# దిక్రైమ్ న్యూస్

Crime News

తెలుగు దినపత్రిక

బుధవారం, జూన్ 03, 2026 | సంపుటి - 20 | సంచిక 255 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## మరోసారి తీవ్రస్థాయికి ఉద్రిక్తతలు

- పశ్చిమ ఆసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు
- కొలిక్కిరాని దౌత్యపరమైన ప్రయత్నాలు
- చర్చలు నిలిపేస్తున్నామని ఇరాన్ ప్రకటన
- 'హోర్ముజ్' జలసంధిని పూర్తిగా మూసివేత!!



న్యూఢిల్లీ : పశ్చిమ ఆసియాలో ఉద్రిక్తతలు మరోసారి తీవ్రస్థాయికి చేరుకున్నాయి. లెబనాన్‌లో ఇజ్రాయెల్ తన సైనిక చర్యలను మరింత విస్తృతం చేయడాన్ని నిరసిస్తూ.. అమెరికాతో మధ్యవర్తుల ద్వారా జరుగుతున్న దౌత్యపరమైన చర్చలను ఇరాన్ సోమవారం రద్దు చేసుకుంది.

తరువాయి 2లో

## నిరంతరం ఉద్యోగాల

# నోటిఫికేషన్ల జారీ

### రాచరికాన్ని, పెత్తనాన్ని తెలంగాణ సమాజం సహించదు



- త్వరలోనే జాబ్ నోటిఫికేషన్లు విడుదల
- న్యాయపరమైన సమస్యలు లేకుండా భర్తీ
- 67 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేశాం
- నిరుపేదల సొంతింటి కల సాకారం చేస్తాం
- అద్దె ఇళ్ల బాధల నుంచి విముక్తి చేస్తాం
- విజన్-2047 లక్ష్యం దిశగా ముందుకు..
- ప్రజాకాంక్షలు నెరవేర్చే ప్రజా ప్రభుత్వం
- తొలి ఏడాదిలోనే రూ.22 వేల కోట్లు జమ
- కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేస్తాం
- మహిళా సంఘాలకు సున్నా వడ్డీ రుణాలు
- రాష్ట్ర మహిళ దేశ పారిశ్రామికరంగంలో కీలకం
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి
- ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు
- అమరవీరుల స్థూపానికి నివాళి అర్పించిన సీఎం

హైదరాబాద్ : తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా నిరుద్యోగ యువతకు సీఎం రేవంత్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు. త్వరలోనే పలు జాబ్ నోటిఫికేషన్లను టీజీపీఎస్సీ విడుదల చేస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమానికి, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఇక్కడ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో వైభవంగా నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు తెలంగాణ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన సీఎం... రాచరికాన్ని, పెత్తనాన్ని తెలంగాణ సమాజం ఎప్పటికీ సహించదన్నారు. ప్రత్యేక తెలంగాణ కల సాకారం చేసిన నాటి ప్రధాని మన్మోహన్ సింగ్, కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీలకు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ వేడుకలలో భాగంగా విధుల్లో ఉత్తమ సేవలు అందించిన పలువురు పోలీసు అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా విశిష్టసేవా పురస్కారాలను ప్రదానం చేశారు.

తరువాయి 2లో



## ధైర్యానికి, సంకల్పానికి, పోరాట స్ఫూర్తికి

# తెలంగాణ ప్రతీక

### రాష్ట్ర ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు



న్యూఢిల్లీ : తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర ప్రజలకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. 'వికసిత్ భారత్' సంకల్పాన్ని సాకారం చేయడంలో భాగంగా.. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రస్థానానికి, ప్రగతి పథానికి కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ పూర్తి మద్దతునిస్తుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. 'ఎక్స్' వేదికగా ప్రధాని మోదీ తెలంగాణ ప్రజలను ఉద్దేశించి ఒక ప్రత్యేక సందేశాన్ని పంచుకున్నారు.

2లో

## రాజకీయాలు అతీతంగా

# తెలంగాణ అభివృద్ధి

### ఉద్యమకారులను గుర్తించి గౌరవిస్తాం

### తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో మంత్రి పొన్నం




సిద్దిపేట : తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి రాజకీయ పార్టీలకు అతీతంగా కృషి చేయాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. త్వరలోనే తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారిని గౌరవిస్తామని మాటిచ్చారు. తెలంగాణ సర్వతోముఖా భివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహకారం తీసుకొని రాష్ట్ర ప్రజల అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు.

2లో

## అభివృద్ధి పథంలో తెలంగాణ

### అమరుల స్ఫూర్తితో తెలంగాణ అభివృద్ధి

### ఆవిర్భావ వేడుకల్లో మంత్రి తుమ్మల



భద్రాద్రి కొత్తగూడెం : ప్రజాపాలనతో తెలంగాణ అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. అమరుల త్యాగాల పునాదులు మీద తెలంగాణ అవతరించిందని తెలిపారు. అమరుల త్యాగాల స్ఫూర్తిగా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలనను అందిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కొత్తగూడెం ప్రగతి మైదానంలో జాతీయ జెండాను మంత్రి తుమ్మల ఆవిష్కరించారు. జిల్లా ప్రజలకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

తరువాయి 2లో



## జూన్ 4న కేరళలోకి నైరుతి రుతుపవనాలు

- దేశవ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే ఛాన్స్
- దక్షిణాది రాష్ట్రాల్లో విస్తృతంగా వర్షాలు

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు స్వల్ప ఆలస్యంతో కేరళలోకి ప్రవేశించేందుకు సిద్ధమవుతున్నాయి.

## కారుణ్య నియామకాలకు

# కుమార్తెలూ అర్హులే

### సంచలన తీర్పు వెలువరించిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ : కారుణ్య నియామకాలకు వివాహిత కుమార్తెలు కూడా అర్హులేనని సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. వివాహిత కుమార్తెను కుటుంబం నిర్వచనం నుంచి మినహాయించడం రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేసింది. అలహాబాద్ హైకోర్టు తీర్పును కొట్టివేస్తూ, బాంబే హైకోర్టు తీర్పుతో ఏకీభవించింది. వివాహం కారణంగా అర్హత ఉన్న కూతురికి సంక్షేమ ప్రయోజనాలు లేకుండా

తరువాయి 2లో



### కూటమి నేతలతో సమన్వయం చేసుకుని సాగాలి

## సర్ ప్రక్రియపై

# అప్రమత్తంగా ఉండాలి

- మన ఓట్లు తీసేందుకు గొడ్డలి పార్టీ కుట్ర చేసే యత్నం
- పని చేయని వారిని నిర్మొహమాటంగా పక్కన పెట్టేస్తా
- ఎస్ఐఆర్‌పై వర్క్ షాప్‌లో చంద్రబాబు కీలక వ్యాఖ్యలు

అమరావతి : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తెదేపా ఎమ్మెల్యేలకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. జనసేన, భాజపాతో కలిసి సమన్వయం చేసుకొని 'సర్'ని పర్యవేక్షించాలన్నారు. తెదేపా ప్రధాన పార్టీగా ఉన్నందున పూర్తి అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. 'సర్'పై తెదేపా ఎమ్మెల్యేలకు చంద్రబాబు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఎస్ఐఆర్‌పై వర్క్ షాప్‌లో ఏపీ సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. శిక్షణ తరగతులకు హాజరుకాని నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 2002 తర్వాత ఓటర్ల జాబితా సవరణ జరుగుతోంది. మన ఓట్లు తీసేసి.. వాళ్ల ఓట్లు పెట్టేలా కుట్రలకు గొడ్డలి పార్టీ వెనుకాడదు.

తరువాయి 2లో

# భారత్‌లో ఎబోలా టెన్షన్..

- ఒక కొత్త స్ట్రెయిన్ వేగంగా వ్యాప్తి
- అప్రమత్తమైన భారత ప్రభుత్వం

న్యూఢిల్లీ : కాంగో, ఉగాండా తదితర ఆఫ్రికా దేశాల్లో ఎబోలా వ్యాధి వేగంగా విస్తరిస్తున్న తరుణంలో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. ఎబోలాలోని అత్యంత ప్రమాదకరమైన 'బుండిబుగ్యో' స్ట్రెయిన్ వేగంగా వ్యాపిస్తుండటంతో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ

తరువాయి 2లో




# అమరుల త్యాగాల రూపమే తెలంగాణ

### సకల జనుల సంకల్పమే స్వరాష్ట్రం

### జనసేన అధినేత పవన్ కళ్యాణ్

### తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన పవన్



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తన ఎక్స్ ఖాతాలో చేసిన పోస్ట్ ప్రస్తుతం వైరల్ అవుతోంది. సకల జనుల సంకల్పం, అమరుల త్యాగాల రూపమే మన తెలంగాణ అని ఆయన కొనియాడారు. నా తెలంగాణ కోటి రతనాల వీణ! అని దాశరథి కృష్ణమాచార్య పలికిన అక్షర సత్యం స్వేచ్ఛా గీతమై మ్రోగిన రోజు పుష్కరం (12 ఏళ్లు) క్రితం ఇదే రోజని గుర్తుచేశారు. తెలంగాణ ప్రజలందరికీ ఆయన హృదయపూర్వక రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దశాబ్దాల పాటు సాగిన ప్రజల ఆకాంక్షలకు, ఆత్మగౌరవ పోరాటానికి,

తరువాయి 2లో

## మరోసారి తీవ్రస్థాయికి ఉద్రిక్తతలు

ఈ చర్చల నిలిపివేతపై ఇరాన్ ప్రతినిధులు స్పందిస్తూ.. "లెబనాన్‌లో ఇజ్రాయెల్ నిరంతరం సాగిస్తున్న అకృత్యాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నాం. కాల్పుల విరమణ ఒప్పందానికి లెబనాన్ అంశం ఒక ముఖ్యమైన ముందస్తు షరతు. కానీ ఇప్పుడు లెబనాన్‌తో సహా అన్ని రంగాలలోనూ ఈ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇజ్రాయెల్ ఉల్లంఘించింది. అందుకే మధ్యవర్తుల ద్వారా అమెరికాతో జరుపుతున్న చర్చలను, పత్రాల మార్పిడిని ఇరాన్ బృందం తాత్కాలికంగా నిలిపివేస్తోంది" అని తస్నిమ్ నివేదించింది.ఆక్రమిత ప్రాంతాల నుండి ఇజ్రాయెల్ దళాలు పూర్తిగా వెనక్కి వెళ్లాలని, అలాగే గాజా, లెబనాన్‌లలో సైనిక చర్యలను పూర్తిగా నిలిపివేయాలనే తమ డిమాండ్లు నెరవేరే వరకు అమెరికాతో దౌత్యపరమైన చర్చలను తిరిగి ప్రారంభించే ప్రసక్తే లేదని ఇరాన్ స్పష్టం చేసింది. ఈ నిర్ణయానికి కొద్దిసేపటి ముందే ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాక్చీ సోషల్ మీడియా వేదికగా అమెరికా, ఇజ్రాయెల్‌లను హెచ్చరించారు. లెబనాన్‌లో ఉద్రిక్తతలు పెంచడం అంటే.. అమెరికాతో కుదిరిన విస్తృత కాల్పుల విరమణ నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుందని ఆయన స్పష్టం చేశారు. "ఇరాన్–అమెరికా మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం అనేది నిస్సందేహంగా లెబనాన్‌తో సహా అన్ని రంగాలకు వర్తిస్తుంది. ఏదైనా ఒక రంగంలో దీనిని ఉల్లంఘిస్తే, అది అన్ని వైపులా ఉల్లంఘించినట్లే అవుతుంది. దీనివల్ల వచ్చే పరిణామాలకు అమెరికా, ఇజ్రాయెల్ దేశాలే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది." అని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాక్చీ పేర్కొన్నారు. అమెరికాతో దౌత్య సంబంధాలు తెంచుకోవడంతో పాటు, ఇరాన్ తన కూటమి దేశాలతో కలిసి అంతర్జాతీయంగా అత్యంత కీలకమైన 'స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్'ను పూర్తిగా స్తంభించిపోయేలా చేయడానికి కార్యాచరణ సిద్ధం చేసినట్లు ప్రకటించింది.దీనితో పాటు ఎర్రసముద్రంలోని 'బాబ్ ఎల్ మండేబ్'జలసంధి లోనూ ఇతర వ్యూహాత్మక పంథాలను అస్త్రాలుగా మార్చి, ఇజ్రాయెల్ మరియు దానికి మద్దతు ఇస్తున్న దేశాలను ఆర్థికంగా, సైనికంగా 'శిక్షించాలని' ఇరాన్ కూటమి నిర్ణయించింది. గాజా, లెబనాన్‌లలో ఇజ్రాయెల్ క్రూరమైన ఆర్మీ ఆపరేషన్లను తక్షణమే ఆపాలని, లేదంటే ఈ ప్రతిఘటన మరింత తీవ్రంగా ఉంటుందని ఇరాన్ పట్టుబడుతోంది. ఈ పరిణామాల వల్ల అంతర్జాతీయ చమురు సరఫరాకు మరియు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ధైర్యానికి, సంకల్పానికి, పోరాట స్ఫూర్తికి తెలంగాణ ప్రతీక

'తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు. తెలంగాణ ప్రజలు తమ సృజనాత్మకతకు, వ్యాపార దృక్పథానికి ప్రసిద్ధులు. ఈ రాష్ట్రం ధైర్యానికి, సంకల్పానికి,పోరాట స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిన గొప్ప చరిత్ర, వైభవోపేతమైన సంస్కృతిని కలిగి ఉంది. వికసిత భారత్ అనే మన స్వప్నాన్ని సాకారం చేసే దిశగా తెలంగాణ అభివృద్ధి ప్రస్థానానికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందించడానికి కట్టుబడి ఉంది. తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ మంచి ఆరోగ్యం, సుఖసంతోషాలూ, విజయాలూ కలగాలని ప్రార్థిస్తున్నాను' అంటూ మోదీ తన సందేశంలో పేర్కొన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా తెలంగాణ ప్రజలకు రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజల ఉత్సాహభరితమైన సంస్కృతి, వారి అద్భుతమైన పారిశ్రామిక స్ఫూర్తితో రాష్ట్రం రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నతమైన ప్రగతి శిఖరాలను, సంపదను సాధించి.. దేశ కీర్తి ప్రతిష్టలను మరింత ఇనుమడింపజేయాలని ఆయన ఆకాంక్షించారు. 2014 జూన్ 2న ఆంధ్రప్రదేశ్ వాయువ్య ప్రాంతం నుండి విడిపోయి, సుదీర్ఘ ప్రజాస్వామ్య పోరాటాల ఫలితంగా భారతదేశంలో సరికొత్త రాష్ట్రంగా తెలంగాణ అవతరించిన సంగతిని ఈ సందర్భంగా జాతీయ మీడియా గుర్తుచేసింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. విశిష్టమైన సంస్కృతి, అద్భుతమైన పారిశ్రామిక నైపుణ్యంతో దేశ గమనంలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోంది. ఈ రాష్ట్రం మరిన్ని ప్రగతి శిఖరాలను అధిరోహిస్తూ, భారతదేశ కీర్తి ప్రతిష్టలను మరింత గొప్పస్థాయికి తీసుకెళ్లాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను. జై తెలంగాణ!' అంటూ ముగించారు.

## అభివృద్ధి పథంలో తెలంగాణ

అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా గోదావరి జలాలతో సశ్యశ్యామలంగా మారేలా సీతారామ ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామని మంత్రి తుమ్మల తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగులో ఉద్యాన పంటల సాగులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అగ్ర స్థానంలో ఉందని చెప్పుకొచ్చారు. దేశానికే తలమానికంగా మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ కొత్తగూడెంలో స్థాపించామని ప్రస్తావించారు. ప్రతి రైతు నుంచి ధాన్యం కొనుగోలు చేసి ప్రజాప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. జిల్లాలో ఐదు నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు మంజూరు చేశామని తెలిపారు. జిల్లా సమగ్ర అభివృద్ధి పారిశ్రామిక ప్రగతి కోసం రహదారులు నిర్మిస్తున్నామని మంత్రి తుమ్మల వెల్లడించారు. భద్రాచలం రామాలయం దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యం ఉండేలా రైల్వే కనెక్టివిటీ కోసం కేంద్రప్రభుత్వానికి ప్రతిపాదన చేశామని అన్నారు. కొత్తగూడెంలో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు కోసం కేంద్రప్రభుత్వం మార్గదర్శకాలు పాటిస్తామని చెప్పారు. కొత్తగూడెం పట్టణం మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయడంతో అభివృద్ధి బాటలో పయనిస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

## సర్ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలి

'సర్' సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. మాకేం సంబంధం లేదన్నట్లుగా ఎంపీలు ఉంటే సరికాదు. జులై 14 లోపు ఓట్లు ఉండేలా చూసుకోకపోతే ఇబ్బందులు ఎదురవుతాయి. పార్టీ ఉంటేనే ప్రభుత్వం వస్తుందనే బాధ్యతతో ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. సైకిల్ పవర్ చూపించేందుకు ప్రతి ఒక్కరూ ఎలక్ట్రిక్ సైకిల్ వాడండి. దీని వల్ల ఖర్చు సున్నా.. ఆరోగ్యానికి ఆరోగ్యం. ఎలక్ట్రిక్ సైకిల్‌పై వీలైనన్ని ఎక్కువ ఇళ్లకు తిరుగుదాం. ఈ నెల 4న ఎన్డీయే సమావేశం తర్వాత భవిష్యత్ కార్యాచరణ చేపడతాం. 2024లో కూటమికి వచ్చిన ఓట్ల కంటే వచ్చే ఎన్నికల్లో పెరగాలి. ప్రతి బుధవారం పార్టీ క్యాలెండర్ తప్పనిసరిగా అమలు కావాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో ఎన్డీఏ సమన్వయ కమిటీల నియామకం జరగనున్నట్లు చంద్రబాబు వెల్లడించారు. క్షేత్రస్థాయిలో మిత్రపక్షాలను కలుపుకువెళ్లాలని.. బలం ఎక్కువా తక్కువా అనేది అనవసరమని, అటువంటి ఆలోచనలు కూడా పెట్టుకోవద్దన్నారు. కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిందేనని ఎమ్మెల్యేలకు సీఎం స్పష్టం చేశారు. ఈ నెల 4న ఎన్డీఏ నేతల సమావేశం జరగనుందని తెలిపారు. జెండా మోయాలంటే జెండా ద్వారా వచ్చిన అధికారంలో కార్యకర్తలను భాగస్వామ్యులను చేయాల్సిందే అని చెప్పారు. పదవి ఎవరికీ శాశ్వతం కాదని.. పనిచేసినంత కాలం పదవికి ఢోకా ఉండదని సీఎం అన్నారు. పని చేయకపోతే నమస్కారం పెట్టి ఎటువంటి మొహమాటం లేకుండా పక్కనపెట్టేస్తానని తేల్చిచెప్పేశారు. ఎవరూ వన్ టైం ఎమ్మెల్యేగా మిగిలిపోవద్దన్నారు. అమెరికన్ డెమోక్రసీలో రెండు సార్లు మాత్రమే ఎన్నికయ్యేందుకు అవకాశం ఉంటుందని సీఎం తెలిపారు. 'మన దగ్గర ప్రజలు మెచ్చినంత కాలం మనం ఎమ్మెల్యేగా ఉండవచ్చు. ఎమ్మెల్యేల ప్రవర్తన బాగుంటే.. ఓట్లు పడతాయి.. ప్రజలు ఆదరిస్తారు. ఎమ్మెల్యేల ప్రవర్తన బాగోలేకపోతే ఓట్లు పోతాయి.. ఆ విషయం అందరూ గుర్తుపెట్టుకోవాలి. పనిచేయకపోయినా పర్వాలేదు.. నోరు మాత్రం పారేసుకోవద్దు. తస్మాత్... జాగ్రత్తగా ఉండాలని ఎమ్మెల్యేలను చంద్రబాబు హెచ్చరించారు.

# నిరంతరం ఉద్యోగాల నోటిఫికేషన్ల జారీ

"పుట్టుక నీది, చావు నీది.. బతుకంతా దేశానిది" అన్న ప్రజాకవి కాళోజీ నారాయణరావు మాటలను సీఎం రేవంత్ రెడ్డి స్మరించుకున్నారు. కాళోజీ స్ఫూర్తితోనే తాము అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్ర ప్రజల హితం కోసం నిరంతరం శ్రమిస్తున్నామని, తమది ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే ప్రభుత్వం అన్నారు. గత 30 నెలల తమ పాలనలో ప్రజా సంకల్పాన్ని నిజం చేయడంలో విజయవంతం అయినట్లు పేర్కొన్నారు. తెలంగాణ విజన్–2047 లక్ష్యాన్ని సాధించే దిశగా అడుగులు వేస్తున్నామని.. రాబోయే రోజుల్లో రాష్ట్ర రైతులను వ్యవసాయ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామని ఈ వేదికగా హామీ ఇచ్చారు. ఎలాంటి న్యాయపరమైన సమస్యలు లేకుండా, అత్యంత పారదర్శకంగా ఇప్పటివరకు 67 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. ఈ సందర్భంగా నిరుద్యోగులకు సీఎం రేవంత్ రెడ్డి శుభవార్త అందించారు. ఈ నెలలోనే టీజీపీఎస్సీ ద్వారా ఇంజినీరింగ్, పీసీబీ, అటవీశాఖ, టౌన్‌ప్లానింగ్, విద్యాశాఖల్లో ఖాళీలకు ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేస్తామని ప్రకటించారు. ఉద్యోగాల నోటిఫికేషన్ల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, విద్యా రంగంలో భాగంగా ఇప్పటికే 1,362 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ క్లాసులు ప్రారంభించామన్నారు. ఈ ఏడాది నుంచి అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉదయం బ్రేక్‌ఫాస్ట్ అందిస్తున్నామని, త్వరలోనే జూనియర్ కాలేజీల విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. పేదలకు సొంతింటి కలను సాకారం చేయడం తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అద్దె ఇళ్ల బాధలు, కష్టాల నుండి పేదలకు విముక్తి కలిగించేందుకు గత 13 నెలల కాలంలో 1.25 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించగా, ఇందుకోసం రూ.22 వేల కోట్లు ఖర్చు చేశామని ఆయన తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మరో 3.50 లక్షల ఇళ్లను మంజూరు చేయగా, ఈసారి క్యూఆర్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తామని చెప్పారు. కొత్త రేషన్‌కార్డులను కూడా పంపిణీ చేసి ప్రజల సమస్యలకు పరిష్కారం చూపామన్నారు. సంక్షేమం, అభివృద్ధికి ఈ ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తోందని సీఎం వెల్లడించారు. ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. రాచరికాన్ని, పెత్తనాన్ని తెలంగాణ సమాజం సహించదన్న రేవంత్, ప్రభుత్వం అంటే నలుగురి చేతిలో ఉండే పెత్తనం కాదని స్పష్టం చేశారు. తమది ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే ప్రజా ప్రభుత్వమన్న సీఎం, గత 30 నెలల్లో ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో విజయవంతం అయ్యామన్నారు. తెలంగాణ విజన్–2047 లక్ష్యం సాధించే దిశగా వెళ్తున్నామని స్పష్టం చేశారు. రైతులను వ్యవసాయ పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పేలా ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు.సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని సీఎం తెలిపారు. జలయజ్ఞంలో చేపట్టిన ప్రాజెక్టులు పదేళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయని, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణానికి మళ్లీ కృషి చేస్తున్నామని చెప్పారు. రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కూలిందని సీఎం ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ఒకేసారి రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసి రైతులను రుణ విముక్తి చేశామని సీఎం తెలిపారు. తొలి ఏడాదిలోనే రైతుల ఖాతాల్లో రూ.22 వేల కోట్లు జమ చేసినట్లు చెప్పారు. రైతుల పంటలు చివరి గింజ వరకు కొనేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బు రూ.11,300 కోట్లు జమ చేశామని తెలిపారు.మహిళలను కోటీశ్వరులుగా చేసేందుకు ప్రణాళికలు వేస్తున్నట్లు రేవంత్? రెడ్డి తెలిపారు. మహిళా సంఘాలకు రూ.60 వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలు ఇచ్చామని చెప్పారు. తెలంగాణ మహిళ దేశ పారిశ్రామికరంగంలో కీలకంగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మహిళలు రూ.10 వేల కోట్లు ఆదా చేసుకున్నారన్న ముఖ్యమంత్రి, 53.90 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని గుర్తుచేశారు. రెండున్నరేళ్లలో ప్రజల ఆశలు, ఆశయాలను నెరవేర్చడంలో విజయం సాధించాం. రాష్ట్రంలో రైతుల్ని పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే దిశగా అడుగులు వేస్తున్నాం. గత ప్రభుత్వం లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కూలిపోయింది. మరమ్మతులు చేయించే భారం ప్రభుత్వంపై పడింది. ఉద్యోగాల భర్తీ ప్రక్రియను విజయవంతంగా చేపట్టాం. రికార్డు సమయంలో 67,763 పోస్టులను భర్తీ చేశాం. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ద్వారా విద్యా వ్యవస్థ మరి బలోపేతం కానుంది. పేదలను అద్దె బాధలనుంచి విముక్తి చేయాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు. కాగా.. తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. సీఎం రేవంత్ రెడ్డి ముందుగా అసెంబ్లీ సమీపంలోని గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించారు. అనంతరం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాల్లో సంబంధిత మంత్రులు జాతీయ జెండా ఆవిష్కరించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాత్రి వేళల్లో హైదరాబాద్‌లోని సచివాలయం, అసెంబ్లీ భవనాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఖమ్మంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ తొలి విడతలో 4.50 లక్షల మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి, రూ.22 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. 53.90 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని గుర్తుచేశారు. హనుమకొండలో అమరవీరుల స్థూపానికి రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వద్ద నివాళి అర్పించి జెండాను ఆవిష్కరించారు. నల్గొండ క్లాక్ టవర్ కూడలి వద్ద అమరవీరుల స్థూపానికి రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నివాళి అర్పించారు. తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు శ్రీకాంతాచారి విగ్రహానికి పుష్పాలతో నివాళి అర్పించారు. అనంతరం పోలీసు పరేడ్ మైదానంలో జాతీయపతాకావిష్కరణ చేశారు. నల్గొండలోని కలెక్టరేట్?లో ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్నారు. అమరవీరుల త్యాగ ఫలితమే మన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రమని తెలిపారు. తెలంగాణ చరిత్ర గురించి మాట్లాడాలంటే నల్గొండ ప్రస్తావన లేకుండా ఒక్క పేజీ కూడా ముందుకు సాగదన్నారు. నల్గొండ కేవలం జిల్లా కాదని విప్లవాల పురిటి గడ్డ, అన్యాయంపై తిరగబడ్డ వీరుల అడ్డా అని వెంకట్?రెడ్డి చెప్పారు. నా భూమి జోలికొస్తే ఆ భూమిలోనే నీ గోరి కడతాం అని దొరల గుండెల్లో వణుకు పుట్టించిందన్నారు. నల్గొండ గడ్డ మన పిల్లలు లాఠీ దెబ్బలు తింటే, శ్రీకాంతాచారి తన ప్రాణాన్ని త్యాగం చేస్తుంటే చూస్తూ ఊరుకోలేదని అన్నారు. తానెప్పుడూ పదవుల కోసం ఆశపడలేదని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్ష నెరవేరకపోతే ఈ పదవులు ఎందుకని నాడు మంత్రి పదవిని విసిరికొట్టి ఉద్యమంలోకి దిగిన చరిత్ర తనదన్నారు.

## అమరుల త్యాగాల రూపమే తెలంగాణ

త్యాగాలకు ప్రతిఫలంగా నిలిచిన చారిత్రాత్మక ఘట్టం ఈ రాష్ట్ర ఆవిర్భావం. తెలంగాణ సాధన కోసం తమ జీవితాలను అంకితం చేసిన ఉద్యమకారులు, విద్యార్థులు, మేధావులు, కళాకారులు, ఉద్యోగులు, రైతులు, అమరవీరులకు తన నివాళులు అర్పించారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మంగళవారం సాయంత్రం 4:30 నుండి 5:30 గంటల మధ్య ప్రెస్ మీట్ నిర్వహించనున్నట్లు తెలిపారు.హైదరాబాద్‌లో నెలకొన్న రాజకీయ వాతావరణం, అలాగే అంతకుముందు తన సభకి పోలీసులు అనుమతి నిరాకరించడంతో ఈ ఈ నిర్ణయం తీసుకున్నారు. "కనీసం తన ఇంట్లో జనసేన పార్టీ నాయకులతో కలిసి ప్రెస్ మీట్ పెట్టుకోవడానికైనా తెలంగాణ పోలీస్ శాఖ అనుమతి ఇస్తుందని ఆశిస్తున్నాను.. ఏం జరుగుతుందో చూద్దాం" అంటూ పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రభుత్వం, పోలీసుల తీరుపై కాస్త సెటైరికల్ పోస్ట్ చేయగా వైరల్ అవుతోంది. అమరావతి: తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తన ఎక్స్ ఖాతాలో చేసిన పోస్ట్ ప్రస్తుతం వైరల్ అవుతోంది. సకల జనుల సంకల్పం, అమరుల త్యాగాల రూపమే మన తెలంగాణ అని ఆయన కొనియాడారు. నా తెలంగాణ కోటి రతనాల వీణ! అని దాశరథి కృష్ణమాచార్య పలికిన అక్షర సత్యం స్వేచ్ఛా గీతమై మ్రోగిన రోజు పుష్కరం (12 ఏళ్లు) క్రితం ఇదే రోజని గుర్తుచేశారు.తెలంగాణ ప్రజలందరికీ ఆయన హృదయపూర్వక రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దశాబ్దాల పాటు సాగిన ప్రజల ఆకాంక్షలకు, ఆత్మగౌరవ పోరాటానికి, త్యాగాలకు ప్రతిఫలంగా నిలిచిన చారిత్రాత్మక ఘట్టం ఈ రాష్ట్ర ఆవిర్భావం. తెలంగాణ సాధన కోసం తమ జీవితాలను అంకితం చేసిన ఉద్యమకారులు, విద్యార్థులు, మేధావులు, కళాకారులు, ఉద్యోగులు, రైతులు, అమరవీరులకు తన నివాళులు అర్పించారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మంగళవారం సాయంత్రం 4:30 నుండి 5:30 గంటల మధ్య ప్రెస్ మీట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో నెలకొన్న రాజకీయ వాతావరణం, అలాగే అంతకుముందు తన సభకి పోలీసులు అనుమతి నిరాకరించడంతో ఈ ఈ నిర్ణయం తీసుకున్నారు. "కనీసం తన ఇంట్లో జనసేన పార్టీ నాయకులతో కలిసి ప్రెస్ మీట్ పెట్టుకోవడానికైనా తెలంగాణ పోలీస్ శాఖ అనుమతి ఇస్తుందని ఆశిస్తున్నాను.. ఏం జరుగుతుందో చూద్దాం" అంటూ పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రభుత్వం, పోలీసుల తీరుపై కాస్త సెటైరికల్ పోస్ట్ చేయగా వైరల్ అవుతోంది. తెలంగాణ గడ్డ పోరాటాల పుట్టినిల్లని, ఇక్కడి గాలిలో పౌరుషం, నీటిలో ఉద్యమ ప్రవాహం, నేలలో అమరుల రక్తం ఉందంటూ పవన్ కళ్యాణ్ భావోద్వేగానికి లోనయ్యారు. సమ్మక్క–సారలమ్మల స్ఫూర్తి నుంచి కొమురం భీమ్ వంటి మహనీయుల త్యాగాల వరకు, ఈ భూమి స్వాభిమానానికి, న్యాయపోరాటాలకు ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు. భాష, సంస్కృతి, సంప్రదాయాలు, జానపద కళలు, సాహిత్య సంపదతో భారతదేశ వైవిధ్యంలో తెలంగాణది ఒక విశిష్టమైన స్థానమని కొనియాడారు. తెలంగాణ సమాజం ఎదుర్కొన్న ప్రధాన సమస్యల పట్ల తనకు ఎప్పటినుంచో ప్రత్యేకమైన ఆవేదన, బాధ్యతాభావం ఉన్నాయని పవన్ స్పష్టం చేశారు. ఫ్లోరోసిస్ బాధిత ప్రాంతాల పరిస్థితి, గిరిజనుల హక్కులు, రైతుల సమస్యలు, నిరుద్యోగ యువత ఆశలు, విద్య, ఆరోగ్య రంగాల సవాళ్లను తాను కేవలం రాజకీయ అంశాలుగా కాకుండా, మానవీయ అంశాలుగా భావిస్తానని.. ప్రజల కష్టాలు ఏ ప్రాంతానివైనా, అవి మన అందరి బాధ్యత అనే నమ్మకం తనదని పేర్కొన్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ఐటీ, ఔషధ పరిశ్రమలు, వ్యవసాయం, పారిశ్రామికాభివృద్ధి, స్టార్టప్ వ్యవస్థ, విద్యా రంగాల్లో తన ప్రత్యేక ముద్రను వేసుకుంటోందని పవన్ కళ్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. అయితే అభివృద్ధి ఫలాలు సమాజంలోని చివరి వ్యక్తి వరకు చేరినప్పుడే ఆ అభివృద్ధి సంపూర్ణమవుతుందని అభిప్రాయపడ్డారు. గ్రామీణ ప్రాంతాలు, గిరిజన తండాలు, వెనుకబడిన వర్గాలు, మహిళలు, యువత, చిన్న రైతులు కూడా సమాన అవకాశాలతో ముందుకు సాగే తెలంగాణ నిర్మాణమే మనందరి లక్ష్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. తెలంగాణ అంటే అపారమైన ఆత్మీయత, అపూర్వమైన సంస్కృతి, అద్భుతమైన మానవ సంబంధాల సమాహారమని పేర్కొన్నారు.. తెలంగాణ ప్రజల ఆశయాలు, ఆత్మగౌరవం, సమగ్ర అభివృద్ధి లక్ష్యాల సాధనకు జనసేన పార్టీ సంపూర్ణ నిబద్ధతతో పనిచేస్తుందని హామీ ఇచ్చారు. ఈ 12వ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ మరింత ప్రగతి సాధించాలని, ప్రతి కుటుంబంలో సంతోషం నిండాలని, సామాజిక న్యాయంతో ఈ గడ్డ దేశానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షిస్తూ జై తెలంగాణ! జై హింద్!" అంటూ తన పోస్ట్ ముగించారు.

## రాజకీయాలు అతీతంగా తెలంగాణ అభివృద్ధి

ఈ వేడుకల్లో భాగంగా జాతీయ జెండాను ఆవిష్కరించి, పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరించారు. అనంతరం జిల్లా ప్రగతి నివేదికను చదివి మంత్రి వినిపించారు. అలాగే, హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జాతీయ జెండాను మంత్రి ఎగురవేశారు. హుస్నాబాద్ అంబేడ్కర్ సర్కిల్ దగ్గర జరిగిన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రజలకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగంలోని ఆర్టికల్ నంబర్ 3 ద్వారా తెలంగాణ ఏర్పాటైందని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. తె తెలంగాణ అనేది కేవలం ఒక భౌగోళిక ప్రాంతం కాదని, కోట్లాదిమంది ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని చెప్పుకొచ్చారు. త్యాగాల పునాదులపై నిర్మితమైన తెలంగాణ, నేడు అభివృద్ధి సంక్షేమానికి చిరునామాగా నిలిచిందని ఉద్ఘాటించారు. తెలంగాణను ప్రజాపాలన ప్రభుత్వంలో మరింత సమానత్వంతో, మరింత ప్రగతితో ముందుకు తీసుకెళ్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## కారుణ్య నియామకాలకు కుమార్తెలూ అర్హులే

చేయడం సరికాదని ధర్మాసనం అభిప్రాయపడింది. యూపీకి చెందిన ఒక వివాహిత మహిళ తన తల్లి మరణం తర్వాత రేషన్ షాప్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేయగా, 'వివాహిత కూతురు' అనే కారణంతో నిరాకరించారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు యూపీ అధికారులను నాలుగు వారాల్లో లైసెన్స్ ఇవ్వాలని ఆదేశించింది.

## భారత్‌లో ఎబోలా టెన్షన్..

తాజా గైడ్‌లైన్స్ జారీ చేసింది. ముఖ్యంగా డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండా, దక్షిణ సుడాన్ దేశాలకు అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు పెట్టుకోవద్దని భారతీయులను కోరినట్లు ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో అధికారిక ప్రకటన ద్వారా చెప్పింది. తాజా పరిస్థితులపై ప్రపంచ ఆరోగ్య సంస్థ తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. మే 17, 2026న ఈ ఎబోలా వ్యాప్తిని 'పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీ ఆఫ్ ఇంటర్నేషనల్ కన్సర్న్ గా ప్రకటించింది. అలాగే ఆఫ్రికా సీడీసీ సైతం దీనిని ఖండాంతర భద్రతా ముప్పుగా పరిగణించిందని 'ద హిందూ' పత్రిక తన నివేదికలో తెలిపింది. ఈ ప్రమాదకర పరిణామాలను దృష్టిలో ఉంచుకుని మే చివరి వారంలో కేంద్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది. కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి, విమానాశ్రయాల్లో పటిష్టమైన స్క్రీనింగ్, నిఘా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. దేశంలో ఇప్పటివరకు ఎబోలా (బుండిబుగ్యో స్ట్రెయిన్) కేసులు ఏవీ నమోదు కాలేదనీ, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ముందస్తు జాగ్రత్తగా అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాల్లో విదేశాల నుంచి వచ్చే ప్రయాణికులకు థర్మల్ స్క్రీనింగ్ తప్పనిసరి చేశారు.గత 21 రోజుల్లో ఎబోలా ప్రభావిత దేశాల నుంచి నేరుగా వచ్చిన వారు లేదా ఆ దేశాల మీదుగా ప్రయాణించి వచ్చిన వారు కచ్చితంగా స్వీయ నిర్బంధంలో ఉండాలని కేంద్ర ఆరోగ్య శాఖ గట్టిగా సూచించింది. ఒకవేళ ఆ ప్రయాణికులలో అకస్మాత్తుగా జ్వరం, తీవ్రమైన తలనొప్పి, కండరాల నొప్పి, వాంతులు, విరేచనాలు, లేదా శరీరంలో ఎక్కడినుంచైనా అకారణంగా రక్తస్రావం కావడం వంటి లక్షణాలు కనిపిస్తే తక్షణమే స్థానిక ఆరోగ్య అధికారులకు సమాచారం అందించాలి. సాయం కోసం వెంటనే కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ '1075' కు కాల్ చేయాలని విజ్ఞప్తి చేసింది. సకాలంలో వైద్య సహాయం పొందడం ద్వారా బాధితుల ప్రాణాలను కాపాడుకోవడమే కాకుండా, ఇతరులకు వ్యాధి సోకకుండా నిరోధించవచ్చని ది హిందూ రిపోర్ట్ చేసింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్రం స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ పంపింది. ఆసుపత్రులలో ప్రత్యేక ఐసోలేషన్ వార్డులు, పరీక్షల కోసం ల్యాబొరేటరీలను ఎప్పుడూ సిద్ధంగా ఉంచాలని.. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ ), నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు అందాయి. విమానాశ్రయంలో ఎవరైనా అనుమానిత రోగులు గుర్తిస్తే వెంటనే వారిని ప్రత్యేక అంబులెన్సుల ద్వారా ఐసోలేషన్ సెంటర్లకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

## జూన్ 4న కేరళలోకి నైరుతి రుతుపవనాలు

భారత వాతావరణ శాఖ తాజా అంచనాల ప్రకారం జూన్ 4న కేరళ తీరాన్ని రుతుపవనాలు తాకే అవకాశం ఉంది. దీంతో దేశంలో అధికారికంగా వర్షాకాలం ప్రారంభం కానుంది. రుతుపవనాల రాకతో దక్షిణ భారత రాష్ట్రాల్లో వచ్చే ఆరు నుంచి ఏడు రోజుల పాటు విస్తృతంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ముఖ్యంగా కేరళలో భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో 7 సెంటీమీటర్ల నుంచి 20 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. అరేబియా సముద్రం మీదుగా తేమతో కూడిన గాలులు బలపడుతుండటంతో రుతుపవనాల కదలిక వేగవంతమవుతోంది. దీని ప్రభావంతో కేరళతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశముందని హెచ్చరించింది. అయితే రుతుపవనాల ప్రారంభంతో పాటు పలు ప్రాంతాల్లో ప్రతికూల వాతావరణ పరిస్థితులు కూడా ఏర్పడే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. దేశంలోని వాయువ్య, మధ్య, తూర్పు ప్రాంతాలతో పాటు దక్షిణ ద్వీపకల్ప ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈదురుగాలుల వేగం గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వరకు ఉండవచ్చని అంచనా వేసింది. దీంతో విద్యుత్ స్తంభాలు, తాత్కాలిక నిర్మాణాలు, వ్యవసాయ పంటలకు నష్టం కలిగే అవకాశం ఉందని పేర్కొంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, స్థానిక అధికారుల సూచనలు పాటించాలని సూచించింది. ఉత్తరాదిలోని దిల్లీ– ఎన్‌సీఆర్, రాజస్థాన్, పంజాబ్, హరియాణా రాష్ట్రాల్లో ఇటీవల నమోదైన తీవ్ర ఎండల నుంచి ఉపశమనం కొనసాగనుంది. ఆ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. గత కొన్ని రోజులుగా అక్కడ గరిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టినట్లు తెలిపింది. అదేవిధంగా మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ వంటి మధ్య భారత రాష్ట్రాల్లో కూడా వర్షాలు కురిసే అవకాశాలు కనిపిస్తున్నాయి. తూర్పు భారతదేశంలోని బిహార్, ఝార్ఖండ్, బంగాల్?లో రాష్ట్రాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉండగా, తొలుత మే 26నే నైరుతి రుతుపవనాలు కేరళను తాకవచ్చునని ఐఎండీ అంచనా వేసింది. అయితే, ఆ అంచనాలను మే 29న సవరించి, తదుపరి వారంలో రావచ్చునని పేర్కొంది. మరోవైపు, వాతావరణంలో ఏర్పడిన ఎల్? నినో పరిస్థితుల వల్ల ఈసారి సాధారణం కంటే తక్కువ వర్షాలే కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది. పసిఫిక్? మహా సముద్ర ప్రాంతంలో ఎల్ నినో పరిస్థితులు ఏర్పడుతున్నాయని, జూన్?లో అవి బలహీనంగా ఉన్నా సెప్టెంబర్?లో బలపడే అవకాశం ఉందని తెలిపింది. మరోవైపు, తీవ్రమైన ఎండల ప్రభావంతో దేశం వేడెక్కిపోతోంది. మధ్యాహ్న సమయంలో ఎండ తీవ్రతకు బయటకు రావడానికి జనం బెంబేలెత్తిపోతున్నారు. అయితే, ఎండలతో అల్లాడిపోతున్న ప్రజానీకానికి మరికొన్ని రోజులపాటు నిరీక్షణ తప్పేలా లేదని వాతావరణ శాఖ చెబుతోంది. మరోవైపు, రెండుమూడు రోజుల తర్వాతైనా రుతుపవనాలు కేరళకు వస్తాయా అని కొందరు నిపుణులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ఇక, రుతుపవనాల రాకతో వాతావరణ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. కేరళలోని పలు ప్రాంతాల్లో ఆరెంజ్?, ఎల్లో అలర్ట్? జారీ చేశారు. మొత్తం 9 జిల్లాల్లో ఎల్లో అలర్ట్? జారీ చేశారు. ఈ నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు.

## ఇజ్రాయిల్-హిజ్బుల్ మధ్య కాల్పుల విరమణ

### శాశ్వతంగా కొనసాగాలని ట్రంప్ ఆకాంక్ష

వాషింగ్టన్,జూన్2 : ఇజ్రాయెల్, ఇరాన్ మద్దతు ఉన్న హెజ్‌బొల్లా మధ్య జరుగుతున్న ఘర్షణలు శాశ్వతంగా ముగియాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆకాంక్షించారు. ఇరుపక్షాలు కాల్పుల విరమణకు అంగీకరించాయని ఆయన పేర్కొన్నారు. హెజ్‌బొల్లా-ఇజ్రాయెల్ మధ్య దాడులు ఆగిపోవడంతో శాంతి చర్చల్లో ఇరాన్ చురుకుగా పాల్గొంటోందని ట్రంప్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా ఖాతా 'ట్రూత్'లో ఓ పోస్ట్ చేశారు. 'ఇజ్రాయెల్‌పై కాల్పులు ఆపేందుకు హెజ్‌బొల్లా అంగీకరించింది. అలాగే ఇజ్రాయెల్ కూడా హెజ్‌బొల్లాపై దాడులు నిలిపివేయడానికి ఒప్పుకుంది. ఇది ఎంతకాలం కొనసాగుతుందో చూడాలి. ఇది శాశ్వతంగా కొనసాగాలని ఆశిస్తున్నాను' అని ట్రంప్ పేర్కొన్నారు. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహుతో చాలా మంచి సంభాషణ జరిగిందని ట్రంప్ చెప్పారు. అయితే పరిస్థితి పూర్తిగా ప్రశాంతంగా మారలేదని అంతర్జాతీయ మీడియా నివేదికలు చెబుతున్నాయి. కాల్పుల విరమణ ప్రకటన వచ్చిన తర్వాత కూడా దక్షిణ లెబనాన్ ప్రాంతాల్లో దాడులు, రాకెట్ ప్రయోగాల వార్తలు వెలువడ్డాయి. దీంతో ఈ ఒప్పందం ఎంతకాలం నిలుస్తుందన్న దానిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఏదేమైనా లెబనాన్‌లో ఉద్రిక్తతలు తగ్గించడం అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న చర్చలకు కీలకమని విశ్లేషకులు భావిస్తున్నారు.

## జనసేనకు భారీ షాక్..

### హౌస్ మోషన్ పిటిషన్ తిరస్కరణ

హైదరాబాద్, జూన్ 2 : హైదరాబాద్‌లో ఇవాళ సభ పెట్టాలనుకున్న జనసేనకు హైకోర్టులో షాక్ తగిలింది. హైకోర్టులో వేసిన హౌస్ మోషన్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఇవాళ మధ్యాహ్నం బహిరంగ సభ పెట్టాలని జనసేన అనుకుంది. ఇందుకు ఉదయం పిటిషన్ వేసింది. ఐతే.. హైకోర్టు.. పిటిషన్‌పై విచారణకు టైమ్ లేదనీ.. ఇంత సడెన్‌గా విచారణ అంటే కష్టమని అభిప్రాయపడింది. పోలీసుల అభ్యంతరాలను తెలుసుకున్న హైకోర్టు.. పిటిషన్‌ని కొట్టివేసింది. ఐతే.. సాయంత్రం పవన్ కళ్యాణ్ జూబ్లీహిల్స్ లోని తన ఇంట్లో పెట్టే ప్రెస్ మీట్‌కి మాత్రం అనుకూల పరిని?తులు ఉన్నాయి. కాబట్టి.. సభకు సంబంధించి జనసేన నెక్ట్స్ మరో తేదీ ఏదైనా నిర్ణయించుకునే ఛాన్స్ ఉంటుంది. హైదరాబాద్‌లో ఇవాళ తెలంగాణ నవ నిర్మాణ సేన పేరుతో సభ పెట్టుకోవాలని జనసేన పార్టీ అనుకుంది. ఐతే.. భద్రతా కారణాలు, ట్రాఫిక్ ఇతరత్రా కారణాలతో పోలీసులు ఈ సభకు అనుమతించలేదు. ఇదే విషయాల్ని హైకోర్టుకు కూడా చెప్పారు. చివరకు హైకోర్టు పోలీసుల వాదనకే మొగ్గు చూపింది. అందువల్ల జనసేన పిటిషన్‌పై విచారణ జరగకుండానే.. దాన్ని కొట్టేసినట్లైంది. ఇది జనసేనకు ఒక ఎదురుదెబ్బ లాంటిదే కాబట్టి.. ఇవాళ సాయంత్రం పవన్ కళ్యాణ్ ఎలా స్పందిస్తారు? ప్రెస్‌మీట్‌లో ఏం చెబుతారనేది ఆసక్తిగా మారింది.

## తెలంగాణను అప్పుల పాలు చేసిన బిఆర్ఎస్

### కమిషన్ల కోసమే కాళేశ్వరం నిర్మాణం

### ఆవిర్భావ వేడుకల్లో మంత్రి వివేక విమర్శలు

మెదక్ : జిల్లాలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్న శంకరంపేట్ లో తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట్ స్వామి అమర వీరుల స్తూపం దగ్గర నివాళు లర్పించారు. అనంతరం జెండా ఆవిష్కరించారు. వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థులు అమరవీరుల గుర్తు చేసుకుంటూ ప్రదదర్శించిన కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని బీఆర్ ఎస్ పదేళ్ల బీఆర్ ఎస్ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల పాలు జేశారని అన్నారు. కమిషన్ల కోసమే లక్ష కోట్ల కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారని విమర్శించారు. మరోవైపు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆవిర్భావ దినోత్సవం సంబురాలు ఘనంగా జరిగాయి. సికింద్రాబాద్ లోని పరేడ్ గ్రౌండ్ లో జరిగిన ఆవిర్భావ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి జెండావిష్కరించి వేడుకలను ప్రారంభించారు. అంతకు ముందు గన్ పార్కు దగ్గర అమర వీరుల స్తూపానికి నివాళులర్పించారు సీఎం రేవంత్ రెడ్డి. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఖమ్మం జిల్లాలో జరిగిన తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో? మంత్రులు, అధికారులు, ప్రజలు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాలను ఘనంగా జరుపుకున్నారు.తెలంగాణ అమరవీరులను స్మరించుకుంటూ ఆటాపాటలతో సంబురాలను జరుపుకున్నారు.

## 91 మంది ఖైదీలకు ప్రభుత్వం క్షమాభిక్ష

### వారి ఉపాధికి తోడ్పాటు అందిస్తామన్న జైళ్లశాఖ డిజి

హైదరాబాద్,జూన్2 : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం 91 మంది ఖైదీలకు క్షమాభిక్ష మంజూరు చేసింది. దీంతో ప్రకటించిన ఖైదీలు జైళ్ల నుంచి విడుదల కానున్నారు. ఈ విషయాన్ని తెలంగాణ జైళ్ల శాఖ డీజీ సౌమ్యా మిశ్రా వెల్లడించారు. విడుదలవుతున్న ఖైదీలు సమాజంలో కొత్త జీవితాన్ని ప్రారంభించాలని, మళ్లీ జైలు బాట పట్టకుండా బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఆమె సూచించారు. విడుదల అవుతున్న వారిలో 85 మంది పురుషులు, ఆరుగురు మహిళలు ఉన్నారు. వీరిలో 38 మంది జైళ్ల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకుల్లో పనిచేయడానికి ఆసక్తి చూపినట్లు డీజీ తెలిపారు. వారికి వెంటనే నియామక పత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు. మిగిలిన 53 మంది వ్యవసాయం, స్వయం ఉపాధి రంగాల్లో స్థిరపడాలని నిర్ణయించుకున్నారని, వారికి కూడా అవసరమైన సహకారం అందిస్తామని వెల్లడించారు. అలాగే విడుదల అవుతున్న మహిళా ఖైదీల్లో నలుగురికి కుట్టు మిషన్లు అందజేసి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు.

# అకాల వర్షాలతో రైతులు కన్నీరు

### తడిసి ముద్దవుతున్న వరి ధాన్యం

### ధాన్యం కుప్పల చుట్టూ వర్షపు నీరు



హైదరాబాద్, జూన్ 2 : ఆరుగాలం కష్టపడి పండించిన పసిడిపంట చేతికొచ్చే సమయానికి అన్నదాతను ప్రకృతి పగబట్టి ఆడుకుంటోంది. ఉదయం పూట భగభగ మండుతున్న ఎండలు కమ్మేస్తుంటే.. రాత్రి కాగానే విరుచుకుపడుతున్న కారుమబ్బులు, భయపెడుతున్న ఈదురుగాలులు, అకాల వర్షాలతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాతావరణం పూర్తిగా అతలాకుతలమైంది. పగలు దంచికొడుతున్న ఎండల తీరు ఒకలా ఉంటే రాత్రివేళ ముంచుకొస్తున్న అకాల వర్షాలు రైతన్నల కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ప్రకృతి కన్నెర్ర చేయడంతో స్వేదం చిందించి పండించిన ధాన్యం రాశులు కళ్ల ముందే తడిసిపోతుంటే ఆ దృశ్యాలు చూసి కర్షకులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ విభిన్న వాతావరణ పరిస్థితులు జిల్లావ్యాప్తంగా రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. కల్లాల్లో, వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో ధాన్యం విక్రయించడానికి వచ్చిన కర్షకులు చెప్పనలవికాని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ కొనుగోలు ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో పగలు రాత్రి కష్టపడి సాధించిన దిగుబడులను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. రోజుల తరబడి మార్కెట్ యార్డుల్లోనే పడిగాపులు కాస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. కల్లాల వద్ద, రోడ్ల పక్కన కుప్పలు పోసిన ధాన్యం వర్షానికి తడవకుండా ప్లాస్టిక్ కవర్లు కప్పుతూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడుపుతున్నారు. రోడ్లపైనే వరి కుప్పలు భారీగా పేరుకుపోవడంతో అటు వాహనదారులకు సైతం ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. గత రెండు మూడు రోజులుగా విరామం లేకుండా కురుస్తున్న అకాల వర్షాలకు జిల్లాలోని సాత్నాల, బేలా, జైనథ్, భోరజ్ మండలాల్లో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మార్కెట్ కేంద్రాల వద్ద ఆరుబయట నిల్వ ఉంచిన ధాన్యం కుప్పల చుట్టూ వర్షపు నీరు వాగుల్లా ప్రవహించడంతో వడ్లు పూర్తిగా తడిసి ముద్దయ్యాయి. ముఖ్యంగా తాంసి మండల కేంద్రంలోని వ్యవసాయ సబ్ మార్కెట్ ఆరబోసిన జొన్న పంటతో, నిస్సహాయ స్థితిలో ఉన్న రైతులతో కిటకిటలాడుతోంది. కంటికి రెప్పలా కాపాడుకున్న జొన్న కుప్పలు అడపాదడపా కురుస్తున్న వానలకు తడిసిపోతుండటంతో వాటిని పదేపదే ఎండబెట్టుకునేందుకు రైతులు తీవ్రంగా శ్రమిస్తూ అలిసిపోతున్నారు. కొనుగోలు ప్రక్రియ నత్తనడకన సాగడానికి ప్రధానంగా గన్నీ బ్యాగులు, లారీలు, హమాలీల కొరత కారణమని స్పష్టమవుతోంది. నిండిన బస్తాలను తరలించేందుకు లారీలు సకాలంలో రాకపోవడం, తూకాలు వేసేందుకు తగినంత మంది కూలీలు దొరకకపోవడంతో కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా మొత్తం పదిహేను ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన అధికారులు.. ఇప్పటి వరకు సుమారు రెండు లక్షల క్వింటాళ్ల వరిని మాత్రమే కొనుగోలు చేయగలిగారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఏమాత్రం పరిష్కారం కాకపోవడంతో వారం రోజులు గడిచినా రైతుల నిరీక్షణ యథాతథంగా కొనసాగుతూనే ఉంది. బస్తాల కొరత అన్నదాతల పాలిట పెను శాపంగా మారింది. క్షణం క్షణం మారుతున్న వాతావరణ పరిస్థితులు, అధికారుల నిర్లక్ష్యం వెరసి రైతుల సహనాన్ని తీవ్రంగా పరీక్షిస్తున్నాయి. పగలు ఎండకు ఎండుతూ, రాత్రి వానకు తడుస్తూ దిక్కుతోచని స్థితిలో ఉన్న కర్షకులు చివరికి తమ ఆగ్రహాన్ని ప్రదర్శిస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని డిమాండ్ చేస్తూ పలుచోట్ల రోడ్డెక్కి ధర్నాలు, ఆందోళనలు చేపట్టారు. వాన ఎప్పుడు ముంచుకొస్తుందో, గాలి దుమారం ఎప్పుడు కమ్ముకొస్తుందో తెలియని అయోమయ పరిస్థితుల్లో అధికారులు తక్షణమే స్పందించాలని వారు వేడుకుంటున్నారు. లారీలు, గోనెసంచులు తగినన్ని అందుబాటులో ఉంచి, నిబంధనలు సడలించి తడిసిన పంటను సైతం వెంటనే కొనుగోలు చేసి తమను తక్షణమే ఆదుకోవాలని రైతన్నలు ముక్తకంఠంతో ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

## టోల్‌ఫ్రీ నంబర్లతోనూ యూరియా బుకింగ్!

### యాప్ వినియోగంలో రైతుల ఇబ్బందులు

హైదరాబాద్, జూన్ 2 : తెలంగాణ రాష్ట్రంలో యూరియా సరఫరాను మరింత పారదర్శకంగా, రైతులకు సులభంగా అందుబాటులో ఉంచేందుకు వ్యవసాయ శాఖ కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రస్తుతం యూరియా పంపిణీ కోసం అమలు చేస్తున్న మొబైల్ యాప్‌లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించిన ప్రభుత్వం, కొత్త సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు ప్రారంభించింది. ముఖ్యంగా సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన తక్కువగా ఉన్న రైతులకు ఈ మార్పులు ఎంతో ఉపయోగపడనున్నాయి. యూరియా కోసం ముందస్తు బుకింగ్ తప్పనిసరి చేసిన తర్వాత రైతులు యాప్ ద్వారా నమోదు చేసుకోవాల్సి వస్తోంది. అయితే గ్రామీణ ప్రాంతాల్లో చాలామంది రైతులకు స్మార్ట్‌ఫోన్ వినియోగం, యాప్ డౌన్‌లోడ్ చేయడం, రిజిస్ట్రేషన్ పూర్తి చేయడం వంటి అంశాలు కష్టంగా మారాయి. సాంకేతిక సమస్యలు, ఇంటర్నెట్ లభ్యత లేకపోవడం వంటి కారణాలతో అనేక మంది రైతులు యూరియా బుకింగ్ చేయలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించిన వ్యవసాయ శాఖ ప్రత్యామ్నాయ మార్గాలను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది.రైతుల సౌలభ్యం కోసం "యూరియా యాప్ టెలి సర్వీసెస్" పేరిట రెండు టోల్‌ఫ్రీ నంబర్లను ఏర్పాటు చేయనున్నారు. యాప్‌లో బుకింగ్ చేసుకోలేని రైతులు తమ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్ నుంచి ఈ టోల్‌ఫ్రీ నంబర్లకు కాల్ చేసి యూరియా అవసరాన్ని నమోదు చేసుకోవచ్చు. రైతులు అందించిన వివరాలను అధికారులు నమోదు చేసి యాప్‌తో అనుసంధానం చేస్తారు. అనంతరం బుకింగ్ పూర్తైన సమాచారం రైతులకు తిరిగి ఫోన్ ద్వారా తెలియజేస్తారు. దీంతో యాప్ వినియోగం రాని రైతులు కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా బుక్ చేసుకునే అవకాశం పొందుతారు.టోల్‌ఫ్రీ సేవలతో పాటు మీసేవ కేంద్రాల ద్వారా కూడా యూరియా బుకింగ్ చేసుకునే సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించింది. గ్రామీణ ప్రాంతాల్లో మీసేవ కేంద్రాలు విస్తృతంగా ఉండటంతో రైతులు సులభంగా అక్కడికి వెళ్లి తమ అవసరాలను నమోదు చేసుకోవచ్చు. దీంతో డిజిటల్ పరిజ్ఞానం లేని రైతులు కూడా వ్యవస్థలో భాగస్వాములు కావడానికి అవకాశం లభిస్తుంది. రైతులకు అందుబాటులో ఉన్న సేవలను మరింత విస్తరించడం ద్వారా ఎరువుల పంపిణీ వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది.ఇప్పటివరకు ఎరువుల నిల్వలు వచ్చినప్పుడు వ్యవసాయ శాఖ ముందుగా డీలర్లకు సమాచారం అందించేది. అయితే కొందరు డీలర్లు ఈ సమాచారాన్ని తమకు సన్నిహితులైన వ్యక్తులకు ముందుగానే తెలియజేయడం వల్ల వారు ఇతర రైతుల కంటే ముందుగా బుకింగ్ చేసుకొని యూరియా పొందుతున్నారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో సాధారణ రైతులు నష్టపోతున్న పరిస్థితులు ఏర్పడ్డాయి.ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ కొత్త విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఇకపై ఎరువుల నిల్వల సమాచారం ముందుగా డీలర్లకు మాత్రమే ఇవ్వకుండా, యాప్ ద్వారా రైతులు, డీలర్లకు ఒకేసారి పంపించనుంది. దీంతో అందరికీ సమాన అవకాశాలు లభించడంతో పాటు ఎరువుల పంపిణీలో పారదర్శకత పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.యూరియా బుకింగ్ వ్యవస్థలో తీసుకొస్తున్న ఈ మార్పులు రైతులకు గణనీయమైన ఊరటనివ్వనున్నాయి. టోల్‌ఫ్రీ నంబర్లు, మీసేవ కేంద్రాల ద్వారా బుకింగ్ సౌకర్యం కల్పించడం వల్ల సాంకేతిక ఇబ్బందులు తగ్గనున్నాయి. అదే సమయంలో ఎరువుల నిల్వల సమాచారాన్ని అందరికీ ఒకేసారి పంపించడం ద్వారా అక్రమాలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంది. రైతులకు సమాన అవకాశాలు కల్పిస్తూ, యూరియా పంపిణీని మరింత సమర్థవంతంగా నిర్వహించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి ఈ చర్యలు దోహదపడనున్నాయి.

## బరితెగించి మాట్లాడుతున్న సిఐడి మాజీ చీఫ్

### మరోమారు ఘాటు విమర్శలు చేసిన రఘురామ

భీమవరం,జూన్2 : సీఐడీ మాజీ చీఫ్, సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్‌పై ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భీమవరంలో జరిగిన ఓ సమావేశంలో అనవసరంగా ఆయన మాట్లాడారని ధ్వజమెత్తారు. పీవీ సునీల్ కుమార్ వ్యాఖ్యలపై పోలీసులు విచారణ చేపట్టాలని సూచించారు. 4000 ఎస్సీ, ఎస్టీ కేసులపై ఛార్జిషీటు వేయించానని ఆయన ఎలా మాట్లాడారని ప్రశ్నించారు. సీబీ సీఐడీకి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. సంచలనమైన కేసులు ఉంటే తప్ప.. 200 కేసులకు మించి తీసుకోవడానికి వీల్లేదని చెప్పారు. 4000 కేసుల్లో ఛార్జిషీటు వేయించానని పీవీ సునీల్ కుమార్ బరితెగించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని రఘురామకృష్ణరాజు విమర్శించారు. తన కస్టోడియల్ టార్చర్ కేసులో ఆయన పాత్ర ఉందని క్లియర్‌గా అర్థమైందని చెప్పారు. ఛార్జిషీట్లు వేయించడంలో ఆయనకి సంబంధం ఏమిటనే విషయంపై పోలీసులు విచారణ చేయాలని సూచించారు. భీమవరంలో జరిగిన సమావేశానికి జాన్‌మార్క్ అనే వ్యక్తి ఢిల్లీ నుంచి వచ్చి మాట్లాడారని చెప్పారు. ఆయన సమావేశంలో మాట్లాడుతూ.. వాళ్లను వేసేయాలని.. వీళ్లని వేసేయాలని పిచ్చిపిచ్చిగా మాట్లాడారని ధ్వజమెత్తారు. మంచి ప్రభుత్వం అని చెప్పి హింసను ప్రేరేపిస్తూ.. పిచ్చిపిచ్చిగా మాట్లాడే వారిపై చర్యలు తీసుకుంటారా..? లేదా..? అనేది ఈ ప్రభుత్వ విచక్షణకే వదిలేస్తున్నానని రఘురామకృష్ణరాజు పేర్కొన్నారు.

## తెలంగాణ నిరుద్యోగులకు శుభవార్త

### ఆర్ అండ్ బిలో 222 ఖాళీ ఇంజనీర్ల భర్తీ

### నోటిఫికేషన్ ఇచ్చిన టిజి పబ్లిక్ సర్వీస్ కమిషన్

హైదరాబాద్ : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మరో కీలక నోటిఫికేషన్ విడుదల చేసింది. ముఖ్యంగా ఇంజనీరింగ్ విద్యార్హత కలిగిన అభ్యర్థులకు ఇది మంచి అవకాశంగా మారనుంది. రోడ్లు, భవనాల శాఖలో మొత్తం 222 ఖాళీల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నోటిఫికేషన్‌లో భాగంగా 49 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టులు, 19 ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. అర్హులైన అభ్యర్థుల నుంచి జూన్ 18 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఎఇఇ పోస్టులకు జూలై 13 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండగా, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పోస్టులకు జూలై 15 వరకు గడువు కల్పించారు.

## సర్ ప్రక్రియపై ప్రజల్లో అవగాహన

### పంటల వైవిధ్యంపై గ్రామసభల్లో రైతులకు సూచన

### కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎస్

హైదరాబాద్,జూన్2 : ఓటరు జాబితా పక్రియలో ప్రజలను భాగస్వాములను చేయాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు కలెక్టర్లను ఆదేశించారు. 'సర్' పక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 4, 6, 9, 10 తేదీల్లో గ్రామ, వార్డు సభలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆయన వివరించారు. 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో పంటల వైవిధ్యతపై రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు. పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, పర్యావరణంపైనా అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామసభల్లో పంటల వైవిధ్యీకరణపై రైతులకు సూచనలు చేయాలన్నారు. వర్షాకాల సన్నద్ధతపై ప్రజలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. నీటి నిల్వల నివారణ, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎస్ తెలిపారు. మొక్కలు నాటడం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచాలని చెప్పారు. ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలను ప్రజలకు వివరించాలని తెలిపారు. ప్రజాప్రతినిధులు, ఎస్‌హెచ్‌జీ సభ్యుల భాగస్వామ్యంతో గ్రామసభలు నిర్వహించాలని కలెక్టర్లకు సీఎస్ రామకృష్ణారావు సూచనలు చేశారు.

## తెలంగాణ మీడియా అకాడమిలో అవతరణ దినోత్సవం

### జాతీయ పతాకాన్ని మీడియా అకాడమి చైర్మన్

హైదరాబాద్,జూన్2 : మంగళవారం నాడు నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమి కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ప్రజల సుదీర్ఘ ఉద్యమానికి ఫలితమని పేర్కొన్నారు. సాధించుకున్న తెలంగాణలో స్వేచ్ఛ, ఆత్మాభిమానం ముఖ్యం అన్నారు. మన రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వ పథకాలు ప్రజలందరికీ అందాలన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చాక పేద ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించడం మన రాష్ట్ర ముఖ్యమంత్రి గొప్పదనం అన్నారు. అదే విధంగా పేద ప్రజలకు రేషన్ షాప్ ల ద్వారా సన్న బియ్యం అందిస్తున్నారని ప్రజా ప్రభుత్వం సేవలను ఆయన కొనియాడారు. అదే విధంగా మహిళా సాధికారిత కోసం మహిళలచే సూపర్ బజార్లు, పెట్రోల్ బంక్ ల నిర్వహణ, గోదాముల నిర్మాణానికి చర్యలు తీసుకుని మహిళాభివృద్ధికి ప్రభుత్వం తొడ్పాటు అందిస్తుందన్నారు. గ్రామీణ, పట్టాణాలలో పని చేస్తున్న కార్మికులకు సమాన వేతనాలను అందేలా చట్టం చేసిందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఎందరో మహానుభావుల త్యాగం ఉన్నదన్నారు. ఈ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో జర్నలిస్టులు, కవులు, కళాకారులు, ఉద్యోగులు, విద్యార్థులు సబ్బండవర్ణాల ప్రజలు పాల్గొని రాష్ట్రాన్ని సాధించుకోవడం జరిగిందన్నారు. అదే విధమైన స్పూర్తితో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ముందుగా జనగణమన గీతాలాపన, అనంతరం తెలంగాణ రాష్ట్ర గేయం జయ జయహే తెలంగాణ గీతాన్ని ఆలపించడం జరిగింది. కార్యక్రమంలో మీడియా అకాడమి కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు, మేనేజర్ శైలేశ్వర్ రెడ్డి, సిబ్బంది శ్రీలతాదేవి, ప్రసాద్, నరేష్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## కర్నాటక సిఎంగా నేడు శివకుమార్ ప్రమాణం

### ఆయనతో పాటు మరో పదిమంది మంత్రులకు అవకాశం

### లోక్‌భవన్‌లో సాయంత్రం 4గంటలకు ప్రమాణ కార్యక్రమం

### రాహుల్ సహా పలువురు కాంగ్రెస్ నేతల హాజరు

బెంగళూరు,జూన్2 : కర్ణాటక ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత డీకే శివకుమార్ 3న బుధవారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఆయనతో పాటు మరో 10 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్టు పార్టీ వర్గాల సమాచారం. ఢిల్లీలో కాంగ్రెస్ అధిష్ఠానంతో డీకే శివకుమార్, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మంగళవారంనాడు చర్చలు జరిపిన అనంతరం తొలివిడత క్యాబినెట్ కూర్పునకు సంబంధించిన కసరత్తు పూర్తయినట్టు చెబుతున్నారు. కొద్ది రోజుల వ్యవధిలోనే మంత్రివర్గ విస్తరణ కూడా ఉంటుందని ఆ వర్గాలు తెలిపాయి. బెంగళూరులోని లోక్ భవన్‌లో బుధవారం సాయంత్రం 4.05 గంటలకు ప్రమాణస్వీకార కార్యక్రమం ఉంటుంది. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, పలువురు సీనియర్ నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. డీకే శివకుమార్‌తో పాటు ప్రమాణస్వీకారం చేసేవారిలో..కేజే జార్జ్, జి.పరమేశ్వర, రామలింగా రెడ్డి, కృష్ణ బైరేగౌడ, యూటీ ఖదెర్, మల్లనగౌడ బసనగౌడ పాటిల్, సతీష్ జార్కిహోళి, ప్రియాంక్ ఖర్గే, యతీంద్ర సిద్ధరామయ్య, లక్ష్మి బెబ్బాల్కర్‌లు ఉన్నారు.పరిమిత అతిథుల సమక్షంలో నిరాడంబరంగా ఈ కార్యక్రమం నిర్వహించాలనుకుంటున్నట్లు శివుమార్ తెలిపారు. పార్టీ కార్యకర్తగా ప్రస్థానాన్ని మొదలుపెట్టిన తాను సీఎం స్థాయికి ఎదగడం వెనక గాంధీ కుటుంబం ఉందని డీకే శివకుమార్ పేర్కొన్నారు. ఒక యువ కార్యకర్తగా తనలోని సామర్థ్యాన్ని దివంగత పీఎం రాజీవ్ గాంధీ గుర్తించారని అన్నారు. జీవితాన్ని ఏవిధంగా ప్రజా సేవకు అంకితం చేయాలి, ప్రజల హక్కుల కోసం ఎలా పోరాడాలి అనే ఎన్నో విషయాలపై తనకు మార్గదర్శనం చేశారన్నారు. రాజకీయ జీవితం క్లిష్ట దశల్లో ఉన్నప్పుడు సోనియాగాంధీ అందించిన మద్దతే తనను ముందుకు నడిపిందన్నారు. రాహుల్ గాంధీ నుంచి ప్రజాస్వామ్య విలువలు, అన్యాయాన్ని వ్యతిరేకించే వైఖరిని నేర్చుకున్నానని పేర్కొన్నారు. నిజమైన నాయకులు కేవలం విజయాలు సాధించిన సమయాల్లోనే అండగా నిలబడరని.. అత్యంత కష్ట సమయాల్లోనూ పక్కనే ఉంటారని అన్నారు. ఇదిలావుంటే ముఖ్యమంత్రి పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేసినా సీఎం బంగ్లాలోనే ఆయన నివాసం ఉండనున్నట్లు తెలుస్తోంది. కర్ణాటకలో సీఎంగా ఎన్నికైన వారికి అధికారిక బంగ్లా అయిన 'కావేరి'ని నివాసంగా కేటాయిస్తారు. అయితే సిద్ధా-డీకేల మధ్య ఒప్పందం ప్రకారం సిద్ధరామయ్య సీఎం పదవికి రాజీనామా చేసినప్పటికీ 2028 సంవత్సరం వరకు కావేరి బంగ్లాలోనే ఉండనున్నారు.

# సంపాదకీయం

## పెట్రోల్ రేషనింగ్ పెడితేనే మేలు !

చమురు మంటలు చల్లారేలా లేవు. ఇప్పటికే వరుసగా నాలుగుసార్లు పెట్రో ధరలను పెంచేశారు. వాణిజ్య సిలిండర్ ధరలు అమాంతంగా పైకి ఎగబాకాయి. పెట్రో సంక్షోభం ఇంకెన్నాళ్లో తెలియదు. అంతర్జాతీయం గా ముడి చమురు ధరలు పెరగడంతో భారత్ లాంటి దేశాలకు గుదిబండగా మారింది. ధరల దాడి ఇప్పట్లో ఆగేలా లేదు. పొదుపు మంత్రం పాటించిన ప్రధాని మోడీ అన్నింటా విఫలం అవుతోంది. పొదుపు ప్రభుత్వంలో కానరావడం లేదు. ధరలను అదుపు చేసే చిత్తశుద్ధి కనిపించడం లేదు. పెట్రో ధరలతో అన్ని వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఉప్పులు, పప్పులు మొదలుకుని అన్నీ పెరుగుతున్నాయి. వంటనూనెల ధరలు సలసల కాగుతున్నాయి. వీటిపై సమీక్షించాల్సిన కేంద్రం మిన్నకుంది. పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగినా, వాటి డిమాండ్ తగ్గడం లేదు. ఎందుకంటే ప్రతి ఒక్కరికీ పెట్రో, డీజిల్, గ్యాస్ అనివార్యం అయ్యింది. పెట్రో ఉత్పత్తుల ధరలు పెరగడంతో వినియోగదారులు వేరే సరుకుల కొనుగోలు తగ్గించి పెట్రో ఉత్పత్తులను కొనుగోలు చేస్తారు. అందుచేత పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగి నప్పుడు వాటి డిమాండ్ తగ్గకపోగా ఇతర సరుకుల డిమాండ్ పడిపోతుంది. దాని ఫలితంగా ఆర్థిక వ్యవస్థ మాంద్యం దిశగా అడుగులు వేస్తుంది. చమురు ఉత్పత్తుల సరఫరా ఎంతగా తగ్గితే అంతగా వాటి ధరలు పెరుగుతాయి. తగ్గిపోయిన సరఫరాకు తగ్గట్టు వాటి డిమాండ్ తగ్గిపోవాలంటే అంత ఎక్కువగా వాటి ధరలు పెరగాలి. అప్పుడు ఆర్థిక వ్యవస్థ అంత తీవ్రంగా మాంద్యంలో కూరుకుపోతుంది. దీనిపై ఆర్‌బిఐ గానీ, కేంద్రం కానీ సమీక్షించి చర్యలకు ఉపక్రమించడం లేదు. పశ్చిమాసియాలో సాగుతున్న యుద్ధంతో ప్రపంచ ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్ల మార్కు దాటేసింది. ప్రజలపైకి పెరిగిన చమురు భారాలను నెట్టడం అనివార్యంగా అనుసరిస్తున్నారు. ధరలు పెంయడం మినహా మిగతా చర్యలపై కేంద్రంలోని ఏ పాలకులు ఆలోచన చేయడం లేదు. దేశ ఆర్థిక వ్యవస్థ గురించి వారి అవగాహన రాహిత్యం ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవాలి. చమురు ధరలు పెరగడం అనేది దాని సరఫరా తగ్గినందువలన సంభవించేది కాదు. నిజానికి ఇప్పుడు ఒకవైపు యుద్ధం కొనసాగుతున్నా, చమురు నిల్వలు సరఫరాను కొనసాగించగల స్థాయిలోనే ఉన్నాయి. చమురు నిల్వలకు కొరత ఏర్పడబోతుందన్న అంచనాలతో ధరలు పెంచేస్తున్నారు. సరఫరా తగ్గడం, అంతర్‌ఆజతీయంగా బ్యారెల్ ధరలు పెరగడంతో ఆ భారం ప్రజలపై నెట్టేస్తున్నారు. వాస్తవానికి ఆర్థిక మాంద్యం వల్లే చమురు సరఫరాకు, డిమాండ్‌కు మధ్య సమతూకం ఏర్పడుతుంది. పెట్రో కొరత ఏర్పడినప్పుడు విచ్చలవిడి వినయోగాన్ని అదుపు చేయాలి. ప్రధానంగా సంపన్న వర్గాల వినియోగాన్ని నియంత్రించాలి. చమురు దిగుమతులు తగ్గినప్పుడు ఆ ప్రభావం వలన వినిమయం కూడా తగ్గిపోయి, ప్రత్యామ్నాయాల వైపు దృష్టి మళ్ళి దేశీయ ఉత్పత్తుల కోసం డిమాండ్ పెరుగుతుంది. దేశ ఆర్థిక వ్యవస్థ మీద ఈ విధానం ప్రభావం చూపుతుంది. ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు పెరిగినప్పుడు దేశీయంగా పెట్రో ఉత్పత్తుల ధరలను పెంచకపోతే ఆ పెట్రో ఉత్పత్తులను దేశీయంగా ఉత్పత్తి చేసేవారు. పంపిణీ చేసేవారు నష్టపోతారు. ఆ నష్టాన్ని ప్రభుత్వం సబ్సిడీ ద్వారా భరించవచ్చు. అప్పుడు చమురు దిగుమతులకు మనం డాలర్ల రూపంలో చెల్లించవలసినది 8 శాతం పెరుగుతుంది. పెట్రో ఉత్పత్తుల రేషనింగ్ ద్వారా సంపన్నుల వినిమయాన్ని అదుపు చేస్తే అప్పుడు వారి వినిమయం వేరే ఉత్పత్తులవైపు మరలుతుంది. ఉపాధి కూడా పెరగవచ్చు. అంతే కాదు, శ్రామిక ప్రజల కొనుగోలు శక్తి, జీవన ప్రమాణాలు పడిపోకుండా నిలబడతాయి. కేవలం సంపన్నుల వినిమయాన్ని మాత్రమే రేషనింగ్ ద్వారా అదుపు చేస్తే దానివల్లే పెట్రో వినిమయం అవసరమైన మోతాదు మేరకు తగ్గిపోతుందని కూడా చెప్పలేము. ఇది అందరికీ వర్తించాలి. ఇక్కడ మోడీ ప్రకటించిన పొదుపును అందరూ పాటించేలా తప్పనిసరి చేయాలి. పెట్రో ఉత్పత్తుల ధరలను పెంచడం గాని, తద్వారా కోట్లాదిమంది ప్రజల మీద భారాలను మోపడం కాని, దేశ ఆర్థిక వ్యవస్థలో మాంద్యం పెరగడానికి దోహదపడుతుంది. పెట్రో ఉత్పత్తుల ధరలు పెరగడంతో, తక్కిన ఉత్పత్తుల వినియోగం బాగా తగ్గిపోయింది. పైగా వినియోగదారులే పెట్రో ధరల పెంపు భారాన్ని కూడా భరించవలసి వచ్చింది. దాంతో సర్వత్రా ద్రవ్యోల్బణ పరిస్థితులు నెలకొన్నాయి. ఢిల్లీలో కాలుష్యాన్ని కంట్రోల్ చేయడానికి వాహనాలపై ఆంక్షలు విధించారు. ఇప్పుడు పెట్రోల్ కోసం కూడా ఇలా అంక్షలు విధించి ప్రజలను భాగస్వాములను చేయాలి. తగిన పద్ధతిలో కట్టుదిట్టంగా దానిని అమలు చేయడం సాధ్యమే. ఇలా చయడంతో పాటు, కాలర్ల అమ్మకాలనపైనా ఆంక్షలు విధించాలి. దీంతో పెట్రో ఆదాతో పాటు, కాలుష్యం కూడా తగ్గగలదు. ఎన్నో ప్రత్యమ్నాయ పద్దతులను అధ్యయనం చేయాల్సి ఉంది. అప్పుడే ధరల భారాన్ని ప్రజలపై పడకుండా చూడవచ్చు. నిల్వలు కరిగిపోకుండా చేయవచ్చు.

# విద్యా సంస్కరణల్లో నూతన అధ్యాయం



సంక్షేమం అంటే కేవలం ఆర్థిక సాయం కాదు. ప్రజల జీవితాలను మార్చగల అవకాశాలను సృష్టించడం, మానవ వనరులను బలోపేతం చేయడం, సమాన అవకాశాలను అందుబాటులోకి తీసుకురావడం కూడా సంక్షేమ పాలనలో అంతర్భాగమే. ఈ దృష్టితో చూస్తే తెలంగాణ ప్రభుత్వం 2026-27 విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న సుమారు రెండు లక్షల మంది ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించాలని తీసుకున్న నిర్ణయం ఒక సాధారణ పథకం కాదు. ఇది విద్య, ఆరోగ్యం, సామాజిక న్యాయం, మానవ వనరుల అభివృద్ధి అనే నాలుగు కీలక రంగాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చే సమగ్ర విద్యా సంస్కరణగా పరిగణించాలి. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా మధ్యాహ్న భోజన పథకాలు ప్రధానంగా పాఠశాల విద్యార్థులకే పరిమితమయ్యాయి. పాఠశాల స్థాయిలో విద్యార్థుల నమోదు, హాజరు, చదువు కొనసాగింపుపై అవి చూపిన సానుకూల ప్రభావం ఇప్పటికే రుజువైంది. అయితే పదో తరగతి తర్వాత విద్యార్థులు ఎదుర్కొనే సవాళ్లు మరింత సంక్లిష్టంగా ఉంటాయి. ఆర్థిక ఒత్తిళ్లు, కుటుంబ బాధ్యతలు, ఉన్నత విద్య ఖర్చుల భయం, పోటీ పరీక్షల ఒత్తిడి వంటి అనేక అంశాలు ఇంటర్మీడియట్ విద్యను ప్రభావితం చేస్తుంటాయి. ఈ దశలో విద్యార్థి ఆరోగ్యం, పోషకాహారం, మానసిక స్థైర్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరం. తెలంగాణ ప్రభుత్వం అదే అంశాన్ని గుర్తించి తీసుకున్న ఈ నిర్ణయం విద్యా విధానంలో ఒక కొత్త ఆలోచనకు నాంది పలుకుతోంది. ఇంటర్మీడియట్ దశను విద్యార్థి జీవితంలో కీలక మలుపుగా ఎందుకు భావిస్తారో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. వైద్య, ఇంజినీరింగ్, సివిల్ సర్వీసులు, సైన్స్, హ్యూమానిటీస్, వృత్తి విద్య -ఏ రంగాన్ని ఎంచుకున్నా దానికి పునాది ఈ రెండు సంవత్సరాలే. కానీ ఇదే సమయంలో పేద కుటుంబాలకు చెందిన అనేక మంది విద్యార్థులు చదువు మానేయడం కూడా వాస్తవం. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువుకు దూరమవుతున్నారు. రాజకీయాల యువతలో నిరాశ విద్యను కొనసాగించాలంటే కనీస జీవన భద్రత కూడా అవసరమనే వాస్తవాన్ని ఈ పథకం గుర్తుచేస్తోంది. ఖాళీ కడుపుతో తరగతి గదిలో కూర్చున్న విద్యార్థి నుంచి ఉత్తమ విద్యా ఫలితాలను ఆశించడం సాధ్యం కాదు. పోషకాహారం, అభ్యాస సామర్థ్యం మధ్య ప్రత్యక్ష సంబంధం ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థతోపాటు అనేక విద్యా పరిశోధనలు వెల్లడించాయి. సరైన ఆహారం అందిన విద్యార్థుల్లో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, హాజరు శాతం, పరీక్షా ఫలితాలు మెరుగుపడతాయని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అల్పాహారం, మధ్యాహ్న భోజనం రెండింటినీ అందించే తెలంగాణ ప్రభుత్వ నిర్ణయం విద్యా నాణ్యతను పెంపొందించే చర్యగా కూడా చూడాలి. ఇంకో ముఖ్యమైన అంశం ప్రభుత్వ జూనియర్ కళాశాలల బలోపేతం. గత కొన్నేళ్లుగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల విస్తరణతో ప్రభుత్వ కళాశాలలపై విద్యార్థుల ఆసక్తి కొంత మేర తగ్గింది. అధిక ఫీజులు వసూలు చేసే ప్రైవేట్ వ్యవస్థ ఒకవైపు ఉండగా, పరిమిత వనరులతో ప్రభుత్వ కళాశాలలు మరోవైపు పోటీ పడుతున్నాయి. ఇలాంటి సమయంలో విద్యార్థులకు పోషకాహార భద్రత కల్పించడం ద్వారా ప్రభుత్వ విద్యాసంస్థల ఆకర్షణ పెరిగే అవకాశం ఉంది. ఇది కేవలం సంక్షేమ చర్య మాత్రమే కాకుండా ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని పెంచే వ్యూహాత్మక నిర్ణయంగా కూడా కనిపిస్తోంది. గురుకుల విద్యాసంస్థల అనుభవం ఈ ఆలోచనకు బలమైన పునాది. తెలంగాణలో సామాజిక సంక్షేమ, గిరిజన, బిసి, మైనారిటీ గురుకులాలు విద్యా రంగంలో విశేష ఫలితాలు సాధించాయి. అక్కడ విద్యార్థులకు అందుతున్న నాణ్యమైన ఆహారం, వసతి, క్రమబద్ధమైన అధ్యయన వాతావరణం విజయానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. డ్రాప్‌అవుట్లు తగ్గడం, ఉన్నత విద్యలో ప్రవేశాలు పెరగడం, జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించడం వంటి విజయాల వెనుక పోషకాహార భద్రత కూడా ఒక ప్రధాన అంశం. ఇప్పుడు అదే అనుభవాన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు విస్తరించే ప్రయత్నం జరుగుతోంది. సంవత్సరానికి సుమారు రూ.180 కోట్ల వ్యయంతో అమలు కానున్న ఈ పథకాన్ని కొందరు భారీ భారం అని విమర్శించే అవకాశం ఉంది. అయితే విద్యపై ఖర్చు చేసే ప్రతి రూపాయిని వ్యయంగా కాకుండా పెట్టుబడిగా చూడాలి. ఒక విద్యార్థి చదువు కొనసాగిస్తే భవిష్యత్తులో అతను నైపుణ్యం కలిగిన మానవ వనరుగా మారతాడు. చదువు మానేస్తే నిరుద్యోగం, అసంఘటిత రంగ ఉపాధి, సామాజిక అసమానతలు పెరిగే ప్రమాదం ఉంటుంది. అందువల్ల ఈ పథకంద్వారా ప్రభుత్వం భవిష్యత్ తెలంగాణకు పెట్టుబడి పెడుతోందని చెప్పవచ్చు. అయితే ఏ సంక్షేమ కార్యక్రమానికైనా అసలు పరీక్ష అమలులోనే ఉంటుంది. ఆహార నాణ్యత, పరిశుభ్రత, సరఫరా వ్యవస్థ, పర్యవేక్షణ, పారదర్శకత వంటి అంశాల్లో నిర్లక్ష్యం చోటుచేసుకుంటే మంచి లక్ష్యాలు కూడా దెబ్బతింటాయి. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ సూచనల మేరకు రూపొందించే మెనూ శాస్త్రీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి. స్థానికంగా లభించే మిల్లెట్స్, పప్పుధాన్యాలు, పాలు, గుడ్లు, కూరగాయలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా విద్యార్థుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా స్థానిక రైతులకు కూడా ప్రయోజనం చేకూరేలా చూడాలి. విద్య అనేది పాఠ్యపుస్తకాల బోధనతో ముగిసిపోయే ప్రక్రియ కాదు. విద్యార్థి శారీరక ఆరోగ్యం, మానసిక స్థైర్యం, సామాజిక భద్రత, ఆర్థిక పరిస్థితి అన్నీ కలిసి అతని విద్యా ప్రయాణాన్ని ప్రభావితం చేస్తాయి. ఈ వాస్తవాన్ని గుర్తించినప్పుడే విద్యా విధానం నిజమైన అర్థంలో సమగ్రంగా మారుతుంది. ఇంటర్మీడియట్ విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించే తెలంగాణ ప్రభుత్వ నిర్ణయం ఆ సమగ్ర దృక్పథానికి ప్రతీకగా నిలుస్తోంది. రాష్ట్ర అభివృద్ధి భవనాలు, రహదారులు, పరిశ్రమలతో మాత్రమే కొలవబడదు. విద్యావంతులైన, ఆరోగ్యవంతులైన యువతతోనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. ఆ దిశగా తెలంగాణ ప్రభుత్వం వేసిన ఈ అడుగు కేవలం ఒక ఆహార పథకం ప్రారంభం కాదు. ఇది విద్యా రంగంలో సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, మానవాభివృద్ధి లక్ష్యాల వైపు తీసుకెళ్తున్న ఒక ముఖ్యమైన సంస్కరణ. సరైన అమలు జరిగితే రాబోయే కాలంలో ఇది దేశానికి ఆదర్శంగా నిలిచే తెలంగాణ మోడల్‌గా గుర్తింపు పొందే అవకాశం ఉంది.

# సీబీఎస్ఈ అన్ స్క్రీన్ మార్కింగ్ వివాదం

### నివేదిక కోరిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ : సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ఆన్-స్క్రీన్ మార్కింగ్ కు సంబంధించిన వివాదం మరింత ముదురుతోంది. కోఎంప్ట్ ఎడ్యుటెక్ సంస్థకు కాంట్రాక్ట్ కేటాయించిన విధానంపై సీబీఎస్ఈ నుంచి కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ పూర్తి నివేదిక కోరింది. ఈ వ్యవహారంలో అవకతవకలు జరిగాయని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్రం హెచ్చరించింది. కోఎంప్ట్‌కు కాంట్రాక్టును కేటాయించేటప్పుడు అనుసరించిన విధానాలు, నిర్ణయం తీసుకునే పక్రియలో పాల్గొన్న అధికారులతో సహా, టెండర్ పక్రియకు సంబంధించిన పూర్తి వివరాలను అందించాలని సీబీఎస్ఈని మంత్రిత్వ శాఖ కోరింది. తొలిసారిగా అమలు చేసిన ఆన్-స్క్రీన్ మార్కింగ్ విధానంపై విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి వేల ఫిర్యాదులు వచ్చాయి. కొన్ని సమాధాన పత్రాలు సరిగా స్కాన్ కాకపోవడం, పేజీలు కనిపించకపోవడం, మార్కుల లెక్కల్లో పొరపాట్లు చోటుచేసుకున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తాయి. కొన్ని వేల జవాబు పత్రాలను తిరిగి మాన్యువల్‌గా మూల్యాంకనం చేయాల్సి వచ్చింది . వివాదం రాజకీయ రంగు కూడా పులుముకుంది. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు (అఃఘాఇ బిౖనిటౖస ఇనీనిబిసనీలౖసబా). ఓఎస్ఎమ్ టెండర్ పక్రియలో మార్పులు చేసి కోఎంప్ట్‌కు అనుకూలంగా నిబంధనలను సడలించారని ఆరోపించారు. టెండర్ నిబంధనల్లో పలు మార్పులు జరిగాయని, దీంతో సంస్థకు అర్హత లభించిందని ఆయన పేర్కొన్నారు. సీబీఎస్ఈ ఈ ఆరోపణలను ఖండించింది. అన్ని నిబంధనలను అనుసరించే కాంట్రాక్ట్ కేటాయించామని, ఎలాంటి అవకతవకలూ జరగలేదని పేర్కొంది. ఈ మొత్తం వ్యవహారంపై కేంద్ర విద్యాశాఖ అంతర్గత విచారణకు ఆదేశించింది.

# అమెరికాలో కాల్పుల కలకలం

### మస్కటీస్‌లో కాల్పులకు ఏడుగురు మృతి

వాషింగ్టన్,జూన్2 : అమెరికాలో వరుస కాల్పుల ఘటనలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. తాజాగా అయోవాలో మస్కటీన్‌లోని పలు ప్రాంతాల్లో కాల్పుల ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనల్లో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. వారిలో అనుమానిత నిందితుడు కూడా ఉన్నట్లు మస్కటీన్ పోలీసులు తెలిపారు. 210 పార్క్ అవెన్యూలోని ఓ నివాసంలో కాల్పులు జరిగాయని పోలీసులకు సమాచారం అందడంతో పోలీసులు, వైద్యసిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొన్నారు. అక్కడ తుపాకీ గాయాలతో ఉన్న నలుగురిని గుర్తించారు. వారిని ఆస్పత్రికి తరలించేలోపే ప్రాణాలు కోల్పోయారు. మస్కటీన్‌కు చెందిన ర్యాన్ విల్లీస్ (52)ను నిందితుడిగా గుర్తించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొనేలోపే అతడు అక్కడినుంచి పరారయ్యాడు. అతడి కోసం గాలిస్తుండగా.. మరో ప్రాంతంలో విల్లీస్ తుపాకీతో కాల్చుకొని ప్రాణాలు కోల్పోయాడు. ఇక, మస్కటీన్‌లోని ఓ నివాసంలో, గ్రాండ్‌వ్యూ అవెన్యూలోని ఓ వ్యాపార సముదాయంలో తుపాకీ గాయాలతో ఇద్దరు వ్యక్తులు మరణించారు. ఒక కుటుంబంలోని వివాదం వల్ల ఈ కాల్పులు జరిగాయని ప్రాథమిక దర్యాప్తులో తెలిసినట్లు పోలీసులు తెలిపారు.

# కట్‌మనీ వ్యవహారంపై విమర్శలు


### వసూళ్లను వెనక్కి ఇచ్చేస్తున్న టిఎంసి నేతలు

కోల్‌కతా,జూన్2 : పశ్చిమబెంగాల్‌లో పదిహేనేళ్ల తృణమూల్ కాంగ్రెస్ పాలన ఎన్నో అవినీతి ఆరోపణలను మూటగట్టుకుంది. ముఖ్యంగా సామాన్య ప్రజల నుంచి తృణమూల్ నేతలు, కార్యకర్తలు 'కట్ మనీ' పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఎప్పట్నుంచో ఉన్నాయి. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ అధికారం కోల్పోయింది. దీంతో తృణమూల్ అగ్ర నేతలపై కూడా ప్రజలు దాడులు చేస్తున్నారు. ఈ దాడుల భయంతో కొందరు తృణమూల్ నేతలు ప్రజాగ్రహాన్ని చల్లబరిచేందుకు కీలక నిర్ణయం తీసుకున్నారు. గతంలో తాము వసూలు చేసిన డబ్బును తిరిగి ఇచ్చెయ్యాలని నిర్ణయించు కున్నారు. బెంగాల్‌లోని కూచ్ బెహార్ జిల్లాలోని మాతాభంగాలోని తృణమూల్ నేతలు గతంలో తాము వసూలు చేసిన డబ్బును ప్రజలకు తిరిగి ఇచ్చేశారు. గ్రామస్తులను ఒక మైదానంలో సమావేశానికి పిలిచి, అక్కడ డబ్బులను పంపిణీ చేశారు. కూచ్ బెహార్ జిల్లాలోని ఓ తృణమూల్ నేత గ్రామస్తుల నుంచి రూ.80 లక్షలు వసూలు చేశాడని, తాజగా అందులో సగం డబ్బును వెనక్కి తిరిగి ఇచ్చేశాడని స్థానిక బీజేపీ నేత తెలిపారు. చాలా గ్రామాల్లో ఇలా 'కట్ మనీ'ని వెనక్కి ఇచ్చేశారట. ప్రజాగ్రహానికి భయపడి తృణమూల్ నేతలు బయటకు రాలేని చోట్ల.. వారి కుటుంబ సభ్యులు, సన్నిహితులు డబ్బును పంపిణీ చేశారట. ఈ పరిణామం ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

# సులభమైన తరణోపాయం

### యద్యత్ పశ్యతి చక్షుర్భ్యాం తత్త దాత్మేతి భావయేత్ 69

మనుష్యుడు కండ్లతో దేనిని దేనిని చూస్తాడో అదంతా ఆత్మయే అని.. అంటే పరబ్రహ్మమే అని భావించాలి. ప్రతినిత్యం లోకంతో మనకు సంబంధం ఏ విధంగా కలుగుతూ ఉన్నదని పరిశీలిస్తే ఉదయాన మనం మేల్కొన్నప్పటి నుంచి రాత్రి పడుకునే వరకు ఎన్నో శబ్దాలను వింటూ ఉంటాం. ఎన్నో దృశ్యాలను చూస్తూ ఉంటాం. వాటితోనే కదా లోకంతో మనకు సంబంధం ఏర్పడుతున్నది! లోకేశ్వరునితో సంబంధం ఏ విధంగా ఏర్పరచుకోవాలో మనలో చాలామందికి తెలియదు. తెలియకపోవచ్చు కూడాను. ఎందుకంటే మనమంతా సామాన్యులమే! అందుకనే మన కందరికీ అర్థమయ్యే రీతిలోనే యోగ తత్వోపనిషత్తు చాలా సరళంగా తరణోపాయం వివరించింది. అదేమంటే కనిపించేది, వినిపించేది అంతా బ్రహ్మమే.. అని భావిస్తూ ఉంటే చాలు.. క్రమంగా పరబ్రహ్మంతో మమేకమై పోతాం. ఆ దివ్యసాన్నిధ్యం మనను వరిస్తుంది. ఇంతకంటే సులభోపాయం మరేం ఉంటుంది కనుక! ఇందులో ఏవో కప్పి చెప్పడాలు విప్పి చెప్పడాలు గూఢార్థాలు లేనే లేవు కదా! వివేకానందుడు ప్రతిరోజూ క్రమం తప్పకుండా ఇంట్లో కూర్చుని ధ్యానం చేసుకునేవాడు. సరిగ్గా అదే సమయంలో, ఇంటి పక్కనే జూట్ మిల్లులో పెద్ద శబ్దంతో సైరన్ మోగించేవారు. దానితో ఆయన చాలా చికాకు పడిపోయేవాడు. ఇదే విషయం శ్రీరామకృష్ణ పరమహంసకు చెప్పుకొన్నాడు. పరమహంస చిరునవ్వు నవ్వి ఆ సైరన్ కూతనే పరబ్రహ్మంగా భావించి మనస్సును లగ్నం చెయ్యమని పలికారు. కొద్దిరోజుల్లోనే వివేకానందుని సమస్య పరిష్కారమై పోయింది. సాధకుడైన వాడు ఇంటినే ఆశ్రమంగా మార్చుకోవాలి. నిత్య జీవితంలో ఎదురయ్యే సంఘటనలనే సాధనగా మార్చుకోవాలి అని దీనివల్ల తెలుస్తున్నది.



ఆధ్యాత్మికం

# సామాజిక తెలంగాణ దిశగా పాలక ప్రభుత్వం పనిచేయాలి

## ● సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్




**కరీంనగర్ టౌన్,జూన్2(ది క్రైమ్ న్యూస్):** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో సిపిఐ పాత్ర మరువలేనిదని, ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేరలేదని, ఈ పాలక ప్రభుత్వమైనా సామాజిక తెలంగాణ దిశగా, ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే విధంగా పరిపాలన సాగాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల సూచించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం గణేష్ నగర్ లో గల సిపిఐ జిల్లా కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన జాతీయ జెండాను పంజాల శ్రీనివాస్ ఎగురవేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను గుర్తించిన సిపిఐ జాతీయ సమితి తెలంగాణ రాష్ట్రం ఇవ్వాల్సిందేనని ఆనాటి యూపీఏ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు కృషి చేసిందని, ఒకే పార్టీ ఒకే నినాదంతో దేశవ్యాప్తంగా సిపిఐ పార్టీ కట్టుబడి ఉందని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పై అనేక ఉద్యమాలు, పోరు బాటలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, శ్రీకృష్ణ కమిటీ కి గాని, ఇతర కమిటీలకు గాని తెలంగాణ ఏర్పాటు ఆవశ్యకతను వివరించిన పార్టీ సిపిఐ అని అన్నారు. నీళు ,,నిధులు, నియామకాలు అనే నినాదంతో రాష్ట్ర కోసం జరిగిన పోరాటంలో ఆనాటి టిఆర్ఎస్ పార్టీ ఒక అడుగు ముందుండి రాష్ట్రం కోసం పోరాటం నిర్వహిస్తే అందులో సిపిఐ కూడా ఏమాత్రం తగ్గకుండా పోరాటాల్లో భాగస్వామ్యం అయ్యిందని, మిలియన్ మార్చ్, ధూం ధాశీ, సాగర హారం లాంటి అనేక కీలక కార్యక్రమాల్లో సిపిఐ ప్రత్యక్షంగా పాల్గొన్నదని గుర్తు చేశారు. 2014 జూన్ 2న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని, ఆవిర్భవించిన అనంతరం జరిగిన ఎన్నికల్లో ప్రజలు టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దెనెక్కించారని, ఉద్యమ నాయకుడు కేసీఆర్ రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగా పనిచేసి ఉద్యమ సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో వైఫల్యం చెందడం మూలంగా గత ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని, కాంగ్రెస్ ప్రభుత్వమైనా రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, భూమిలేని నిరుపేదలకు భూములు ఇవ్వాలని, అర్హులైన పేదలకు, పెన్షన్లు, ఇండ్లు లేని వారికి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, ప్రధానంగా ఉద్యమ సమయంలో అనేక కేసుల పాలు జైల పాలైన ఉద్యమకారులను గుర్తించి వారికి ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విభజన హామీలను అమలు పరచడంలో వివక్షత చూపుతోందని, కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని, ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రైవేటుపరం చేయడానికి పూనుకుంటుందని, రాష్ట్రాల హక్కులను హరిస్తు వివక్షత చూపడం సరైనది కాదని, ఇదే విధమైన పరిపాలన సాగిస్తే తెలంగాణలో బిజెపికి పుట్టగతులు ఉండవని పంజాల శ్రీనివాస్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, న్యాలపట్ల రాజు, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, బీర్ల పద్మ, కొట్టె అంజలి, బూడిద సదాశివ, నాయకులు బాకం ఆంజనేయులు, గామినేని సత్యం, చెంచల మురళి, నగునూరి రమేష్, కసిబోజుల సంతోష్ చారి, నర్సింహులు, నిఖిల్, సాయి, సాంబయ్య ,అశోక్, రామన్న తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

## ● జాతీయ పతాక ఆవిష్కరణ చేసిన డీసీసీ అధ్యక్షులు డా.మేడిపల్లి సత్యం



**కరీంనగర్ టౌన్,జూన్2(ది క్రైమ్ న్యూస్):** జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం, మానకొండూరు ఎమ్మెల్యే, తెలంగాణ ఎస్సీ విభాగం చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి , జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం , కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్ వెలిచాల రాజేందర్ రావు, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, జిల్లా ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, అర్బన్ బ్యాంకు చైర్మన్ కర్ర రాజశేఖర్ , మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ తో పాటు పలువురు నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం పార్టీ శ్రేణుల సమక్షంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జాతీయ జెండాకు వందనం చేస్తూ తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. అనంతరం డా. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ “2004 తెలంగాణ శాసనసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అగ్రనేత శ్రీమతి సోనియా గాంధీ కరీంనగర్ సాక్షిగా తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆంధ్ర పెత్తందారులు, కొన్ని రాజకీయ పార్టీలు వ్యతిరేకించినప్పటికీ, తెలంగాణ ప్రజల ఆకాంక్షను గౌరవించి ఇచ్చిన మాట ప్రకారం సోనియా గాంధీ రాష్ట్రాన్ని ఇచ్చారు. నేడు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రజల పక్షాన ఆమెకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. తెలంగాణ ఉన్నంతవరకు సోనియా గాంధీ పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది” అని అన్నారు. “గతంలో అనేక పార్టీలు మభ్యపెట్టినా, 2000 సంవత్సరంలో 3 రాష్ట్రాలు ఏర్పాటు చేసిన బీజేపీ తెలంగాణపై వివక్ష చూపింది. కానీ సోనియా గాంధీ గారు మాత్రం ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. ఇదే కాంగ్రెస్ పార్టీ నిబద్ధతకు నిదర్శనం” అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుల నరసయ్య , ఉప్పుల అంజని ప్రసాద్, పులి ఆంజనేయులు గౌడ్,మడుపు మోహన్, పత్తి మధుకర్ రెడ్డి, శ్రావణ్ నాయక్, ఆకారపు భాస్కర్ రెడ్డి, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, గడ్డం విలాస్ రెడ్డి,వెన్నం రజిత రెడ్డి, విక్టర్, గంట శ్రీనివాస్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, వెన్న రాజమల్లయ్య,కామ్ రెడ్డి రామ్ రెడ్డి, చర్ల పద్మ, వంగల విద్యాసాగర్, నాగుల సతీష్,గడప శ్రీనివాస్, శ్రీరాముల రమేష్, మాదాసు శ్రీనివాస్, లింగంపల్లి బాబు, కుంభాల రాజ్ కుమార్, చాంద్, శిల్ప, పొరండ్ల రమేష్, కర్రె పావని, సిరిపురం నాగప్రసాద్, సాయిని తిరుపతి, కంకణాల జగదీశ్వర్ రెడ్డి, పెంట శేఖర్, చింతల కిషన్, మూల జైపాల్, హాజీ, బత్తిని చంద్రయ్య గౌడ్, మాలోతు మహాలక్ష్మి, షబానా, దండు రవీందర్, సుదర్శన్, బత్తిని రాజ్ కుమార్, పంజాల స్వామి గౌడ్, ఫజల్, జొన్నల రమేష్, మురళి న్యూస్, హసీనా, నూనె గోపాల్ రెడ్డి, కోట శంకర్, ఆవారు లత, రూపు రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మామిడి సత్యనారాయణ రెడ్డి, పడి శెట్టి భూమయ్య, మీసా రమాదేవి, బండి శరణ్య,గడ్డం శ్రీరామ్, రాచర్ల పద్మ, పెద్దెల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# అమరవీరుల ఆశయాల సాధనే బిజెపి లక్ష్యం

## ● బంగారు తెలంగాణ బిజెపితోనే సాధ్యం: బిజెపి తిమ్మాపూర్ మండల అధ్యక్షుడు చింతం శ్రీనివాస్



**కరీంనగర్ టౌన్, జూన్2(ది క్రైమ్ న్యూస్):** జూన్ 2న తెలంగాణ ప్రజల దశాబ్దాల పోరాటం, వేలాది మంది అమరవీరుల త్యాగాల ఫలం. ఎందరో యువకులు తమ ప్రాణాలను పణంగా పెట్టి సాధించుకున్న స్వరాష్ట్రమే తెలంగాణ అని, ఈ చారిత్రాత్మకమైన రోజున తెలంగాణ ప్రజలందరికీ తెలంగాణ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు బిజెపి తిమ్మాపూర్ మండల అధ్యక్షులు చింతం శ్రీనివాస్ తెలిపారు. బిజెపి తిమ్మాపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రోజున మహాత్మా నగర్ లో తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు చింతం శ్రీనివాస్ జాతీయ జెండాను ఎగరవేసి మాట్లాడారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో భారతీయ జనతా పార్టీ పాత్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడిందన్నారు. 1997లోనే కాకినాడ తీర్మానంలో “ఒక ఓటు - రెండు రాష్ట్రాలు” అని ప్రకటించి, తెలంగాణ డిమాండ్‌కు జాతీయ స్థాయిలో పూర్తి రాజకీయ మద్దతునిచ్చిన ఏకైక పార్టీ బీజేపీ అని తెలిపారు. నాడు పార్లమెంట్‌లో సుష్మా స్వరాజ్ “చిన్నమ్మ”గా తెలంగాణ బిల్లు పాస్ కావడానికి పోషించిన పాత్రను ఈ గడ్డ ఎన్నటికీ మరవదన్నారు. నాడు బీజేపీ అండగా నిలబడకపోతే, కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ బిల్లును ఆమోదించేదే కాదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది కొందరి కుటుంబ స్వార్థం కోసం కాదు, అమరవీరుల ఆశయాల కోసం. ‘నీళ్లు, నిధులు, నియామకాలు’ అనే నినాదంతో సాగిన ఉద్యమంలో యువత, విద్యార్థులు ప్రాణాలు అర్పించారు కానీ, గత12 ఏళ్లలో ఆ ఆశయాలు ఎంతవరకు నెరవేరాయో ఆలోచించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నిరుద్యోగ నిరాశ, పేదరికం, అవినీతి వల్ల తెలంగాణ ఆత్మగౌరవం దెబ్బతిందన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి లక్షల కోట్ల రూపాయల నిధులను మంజూరు చేస్తోందన్నారు. జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు, ఎయిమ్స్ లాంటి సంస్థలతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తోందన్నారు. తెలంగాణను నిజమైన “బంగారు తెలంగాణ”గా మార్చడం, అమరవీరుల కుటుంబాలను ఆదుకోవడం, యువతకు ఉపాధి కల్పించడమే బీజేపీ ధ్యేయం అని తెలిపారు. అమరవీరుల ఆశయాలు నెరవేరాలన్నా, తెలంగాణలో నిజమైన ప్రజాస్వామ్య పాలన రావాలన్నా అది కేవలం బీజేపీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలోబిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్య లుఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర , జిల్లా కార్యవర్గ సభ్యులుబూట్ల శ్రీనివాస, గొట్టిముక్కల తిరపత్ రెడ్డి, ఓదెలుయదవ్, హనుమండ్ల రాజరెడ్డి, రామిడి మహేందర్ రెడ్డి, చిందం అంజి జె.అనిల్,ప్రేం చందు,డి.అజయ్, కొత్తూరి శ్రీనివాస్, వినయ్, కాసాడి సంపత్ బుడిద అక్షయ్, చిందం నరసయ్య, అనంత రెడ్డి, మృత్యుంజయం, చిందం మల్లయ్య, బొంతల రాణి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉన్నత విద్యామండలి ప్రాంగణంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**హైదరాబాద్ (మాసబ్ ట్యాంక్), (ది క్రైమ్ న్యూస్):** మాసబ్ ట్యాంక్, హైదరాబాద్ తెలంగాణ ఉన్నత విద్యామండలి ప్రాంగణంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టా రెడ్డి, జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఉన్నత విద్యామండలి, వైస్-చైర్మన్, ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం గారు, తెలంగాణ ఫీ రెగులేటరీ కమిటీ చైర్మన్ రిటైర్డ్ జస్టిస్ ఎ. గోపాల్ రెడ్డి , తెలంగాణ ఉన్నత విద్యామండలి, కార్యదర్శి, శ్రీరామ్ వెంకటేష్ మరియు సిబ్బంది హాజరయ్యారు. ప్రొఫెసర వి. బాలకిష్టా రెడ్డి మాట్లాడుతూ ఉన్నత విద్యా రంగంలో అన్ని వర్గాల సమ్మిళితత్వానికి పేరొందిన అభివృద్ధి చెందిన తెలంగాణ కోసం రోడ్‌మ్యాప్‌ను వివరించారు. గౌరవనీయ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఊహించినట్లుగా, “తెలంగాణ రైజింగ్ ఏ2047” (ఎవశ్రీఖఅస్త్రుఋఖు =అంఱఅస్త్ర ఏ2047) కి అనుగుణంగా ఉన్నత విద్యా రంగంలో పరివర్తనాత్మక సంస్కరణలను తీసుకురావడానికి తన నిబద్ధతను ఆయన పునరుద్ఘాటించారు. అండర్ గ్రాడ్యుయేట్ (ఖ+) పాఠ్యప్రణాళికలో సవరణలను ప్రారంభించడం, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యను తీర్చిదిద్దడం, బలమైన పరిశ్రమ-విద్యాసంస్థల భాగస్వామ్యాన్ని పెంపొందించడం, ప్రాక్టికల్ మరియు నైపుణ్యం ఆధారిత అభ్యాసాన్ని చేర్చడం కోసం పరిశ్రమల నుండి సూచనలను కోరడం, డిజిటల్ మరియు సాంకేతికత-కేంద్రీకృత అభ్యాసాన్ని చేర్చడం, అలాగే పరిశోధన మరియు ఆవిష్కరణల సంస్కృతిని పెంపొందించడంలో తన అనుభవాలను ఆయన పంచుకున్నారు. తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ చైర్మన్ రిటైర్డ్ జస్టిస్ ఎ. గోపాల్ రెడ్డి మాట్లాడుతూ 1969లో న్యాయవ్యవస్థలో నియమితులైన తర్వాత తాను నిలిపివేయవలసి వచ్చిన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో తన భాగస్వామ్యాన్ని గుర్తు చేసారు. అలాగే తెలంగాణ ఉన్నత విద్యామండలి, వైస్-చైర్మన్ ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం గారు మాట్లాడుతూ సమానత్వ సూత్రాన్ని సమర్థించడంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి యొక్క నిబద్ధతను ప్రస్తావించారు అలాగే సమాజంలోని వివిధ వర్గాల భాగస్వామ్యంతో కూడిన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ మూలాలను వివరించారు. తెలంగాణ ఉన్నత విద్యామండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్ గారు, మాట్లాడుతూ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో విద్యార్థుల భాగస్వామ్యాన్ని ప్రత్యక్షంగా చూసిన తన అనుభవాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఆయన వందన సమర్పణ చేశారు. సం./- కార్యదర్శి, తెలంగాణ ఉన్నత విద్యామండలి

# పవన్ కళ్యాణ్ హైదరాబాద్ సభ వెనుక రాజకీయ కుట్ర దాగి ఉంది

**- బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జి.వి. రామకృష్ణారావు**





**కరీంనగర్ టౌన్, జూన్ 2(ది క్రైమ్ న్యూస్):** పవన్ కళ్యాణ్‌కు హెచ్చరిక చేస్తు తెలంగాణ ప్రజల మనోభావాలను గౌరవించకుండా,ఆవిర్భావ దినోత్సవం రోజున సభలు నిర్వహించడం రాష్ట్ర సమాజాన్ని అవమానించడమే అని, తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన ఆంధ్ర ప్రాంత రాజకీయ నాయకులు ఇప్పుడు ఇక్కడ రాజకీయంగా పట్టు సాధించాలని చూడటం దురదృష్టకరం మని, కేసీఆర్ హయాంలో ఎవరూ తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే సాహసం చేయలేదు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆంధ్ర రాజకీయ శక్తులకు ఇక్కడ అవకాశాలు కల్పిస్తోంది అన్నారు.కరీంనగర్ జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో జాతీయ, పార్టీ జెండాలను ఆవిష్కరించి, మిఠాయిలు పంపిణీ చేశారు.త్యాగాల స్మరణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను కేసీఆర్ చేసిన చారిత్రాత్మక ఆమరణ నిరాహార దీక్షను స్మరించుకున్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని, ప్రజల హక్కులను ఆత్మగౌరవాన్ని కాపాడగలిగే ఏకైక శక్తి బీఆర్ఎస్ కేసీఆర్ మాత్రమే ఆయన అన్నారు.తెలంగాణ ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఎలాంటి రాజకీయ శక్తులనైనా బీఆర్ఎస్ పార్టీ ప్రజలతో కలిసి ప్రజాస్వామ్యబద్ధంగా ఎదుర్కొంటుందని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉంటూ తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణ కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# కళ్యాణ లక్ష్మి - షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ




**గోదావరిఖని టౌన్ (ది క్రైమ్ న్యూస్):** గోదావరిఖని రామగుండం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ 128 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, పేద మరియు మధ్యతరగతి కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. ఈ పథకాల ద్వారా వేలాది కుటుంబాలు లబ్ధి పొందుతూ తమ కుమార్తెల వివాహాలను ఆర్థిక ఇబ్బందులు లేకుండా నిర్వహించుకోగలుగుతున్నాయని తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందాలని సూచించారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు.

# అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు అందిస్తాం

**- సొంతింటి కలను నెరవేర్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే**

**- కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు**



**కరీంనగర్ టౌన్, జూన్2(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని చింతకుంట, ఆరెపల్లి, కొత్తపల్లి మండలం బద్దిపల్లిలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు మంగళవారం సాయంత్రం కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చింతకుంటలో నిర్మాణంలో ఉన్న ఇండ్ల పురోగతిని సమీక్షించారు. ఇప్పటివరకు ఎంత మేర పనులు పూర్తి అయ్యాయి, ఇంకా చేపట్టాల్సిన పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆరెపల్లి, బద్దిపల్లిలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను పరిశీలించి మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణంలో మిగిలి ఉన్న పనుల వివరాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి త్వరగా పూర్తి చేయించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. చింతకుంటలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను త్వరలోనే ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేస్తుందని, అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి గృహం అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. నాడైనా నేడైనా సొంతింటి కలను నెరవేర్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, కార్పొరేటర్లు గంట కళ్యాణి శ్రీనివాస్, గుమ్మడి రాజ్‌కుమార్, ఆకుల నందిని ఉదయ్, కాంగ్రెస్ నాయకులు అర్ష మల్లేశం, ఖదీర్ షా ఖాన్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

# గ్రీన్‌ఫీల్డ్ హైవే పై సర్వీస్ రోడ్ ఏర్పాటు చేయండి

## ● కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు వినతి

**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ):** ఖమ్మం జిల్లాలో గ్రీన్ ఫీల్డ్ హైవే, రైతాంగం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలతో పాటు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డిని హైదరాబాద్ క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఒక సమగ్ర వినతిపత్రం సమర్పించారు. ఖమ్మం - దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంతో ఇబ్బందులు పడుతున్న జిల్లా ప్రజలకు సర్వీసు రోడ్లు నిర్మించడంతో పాటు, దళిత, గిరిజన నిరుద్యోగులకు ఉపాధి రుణాలు, పేద రైతులకు వ్యవసాయ బోరుబావులు మంజూరు చేయాలని ఆయన ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఖమ్మం నుంచి దేవరపల్లి వరకు నూతనంగా నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే పై సర్వీస్ రోడ్డు లేకపోవడం వల్ల జిల్లా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నెల్లూరి కోటేశ్వరరావు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నాగ్పూర్ - అమరావతి క్రాస్ నుంచి వైరా ఎగ్జిట్ వరకు ఉన్న 19.600 కిలోమీటర్ల నుంచి 33.200 కిలోమీటర్ల మార్గంలో రైతుల భూముల మధ్యలోంచి రోడ్డు నిర్మాణం జరిగిందని వివరించారు. దీనివల్ల పొలాలు రెండు భాగాలుగా విడిపోయి, వ్యవసాయ పనుల నిమిత్తం ట్రాక్టర్లు, హార్వెస్టర్లు వెళ్లేందుకు, పండిన ధాన్యాన్ని ఇళ్లకు చేర్చేందుకు దారి లేకుండా పోయిందని , అదేవిధంగా జిల్లా ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ భూములన్నీ నాగార్జున సాగర్ ప్రాజెక్టు కమాండ్ ఏరియా కింద ఉన్నాయని, రోడ్డు నిర్మాణంతో వాగులు, కాలువలు దాటి పశువులను మేతకు తీసుకెళ్లడం ప్రజలకు, రైతులకు కత్తిమీద సాములా మారిందని పేర్కొన్నారు. ఈ సమస్యకు తక్షణ పరిష్కారంగా హైవేకు ఇరువైపులా సర్వీసు రోడ్లు నిర్మించి జిల్లా ప్రజలను ఆదుకోవాలని ఆయన కోరారు. నిరుపేద దళిత, గిరిజన కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపరచడం కోసం కేంద్ర బడ్జెట్ నుంచి ప్రత్యేక రుణాలు మంజూరు చేయాలని ఈ సందర్భంగా కోటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. దినసరి కూలీలుగా ఉంటూ ఆర్థికంగా వెనుకబడిన యువత స్వయం ఉపాధి పొందేలా కేంద్ర ప్రభుత్వ పథకాలను వారికి వర్తింపజేయాలని కోరారు. ముఖ్యంగా ఖమ్మం జిల్లా సింగరేణి మండలం మాధారం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం ఒడ్డుగూడెం, మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం బాలాజీ తండా గ్రామాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ అభ్యర్థులకు ఒక్కొక్కరికి రెండు లక్షల రూపాయల చొప్పున స్వయం



ఉపాధి రుణాలు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తులను మంత్రికి అందజేశారు. అలాగే, సింగరేణి మండలం మాధారం గ్రామానికి చెందిన పేద ఎస్సీ, ఎస్టీ రైతుల వ్యవసాయ భూములకు సాగునీటి సదుపాయం కల్పించాలని మంత్రిని కోరారు. సరైన నీటి వసతి లేక, సొంతంగా బోరుబావులు తవ్వించుకునే స్థోమత లేక ఎంతోమంది పేద రైతుల భూములు బీడువారుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక సాగునీటి పథకాలైన పీఎం - కుసుమ్, పీఎంకేఎస్‌వై ద్వారా ఈ గ్రామంలోని అర్హులైన రైతులకు ఉచితంగా బోరుబావులు, పంపుసెట్లు మంజూరు చేయాలని విన్నవించారు. తాను స్వయంగా క్షేత్రస్థాయిలో రైతుల దరఖాస్తులను పరిశీలించానని, కేంద్రం ఆదుకుంటే ఆయా కుటుంబాల సామాజిక, ఆర్థిక స్థితిగతులు అనూహ్యంగా మెరుగుపడతాయని నెల్లూరి కోటేశ్వరరావు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి వివరించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది.

# ప్రజాస్వామ్య తెలంగాణ కై మరో పోరాటం నిర్మించాలి

## ● సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పిలుపు

**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ):** సాధించుకున్న భౌగోళిక తెలంగాణలో ప్రజాస్వామిక తెలంగాణకై మరో పోరాటం నిర్మించుకుందామని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఖమ్మం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సి వై పుల్లయ్య ఆవుల అశోక్ పిలుపునిచ్చారు. మంగళవారం ఖమ్మంలో స్థానిక అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ అమరవీరుల కల సహకారమైన రోజు జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమాన్ని పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. అమరవీరుల స్థూపానికి పుష్పగుచ్చాలు చల్లి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి టి ఝాన్సీ అధ్యక్షతన జరిగిన సభలో సివై పుల్లయ్య, ఆవుల అశోక్ హాజరై మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన జరిగితే నీళ్ళు, నిధులు, నియామకాలు, స్వయంపాలన ఉంటుందని భావించి సుదీర్ఘకాలం పోరాడిన ప్రజలు, నిరాశ నిస్ప్రభాతంతో బ్రతుకుతున్నారని, వాగ్దానాలు చేసి, గద్దెనెక్కిన పాలకులు ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. పనులు చేసుకోవటానికి దొరకక ప్రజలు వలసపోవటం ఆగలేదని, నిరుద్యోగులు ఉపాధి అవకాశాలు లేక వీధుల పాలవుతున్నారని, రాష్ట్రం రెండు దశాబ్దాల నాటి నుండి అప్పుల కుప్పగా తయారైందని, రాష్ట్ర ఆర్థిక, రాజకీయ సంక్షోభంలో కొరికిపోయిందని పాలకులు నీరోచక్రవర్తి వలె పిడేలు వాయించుకుంటున్నారని వారు విమర్శించారు. ఖమ్మంలో వెలుగుమట్లలో పేదలు నిర్మాణం చేసుకొని నివాసముంటున్న ఇండ్లను దారుణంగా కూల్చివేయడం దుర్మార్గమైన చర్యయ ని, అర్హులైన పేదలకు నివాసం ఉండటానికి స్థలాలను చూపించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాదులో పేదలు నివాసం ఉంటున్న ఇండ్లను హైడ్రా పేరుతో కూల్చి వేసి, అనాధలుగా వెలగొట్టారని దిక్కుతోచని స్థితిలో ఎక్కడ ఉండాలో తెలియని పరిస్థితిలో తల దాచుకుంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు ఇది ప్రభుత్వం యొక్క అనాలోచితమైన చర్యని ఇప్పటికైనా హైడ్రాను నిలిపివేయాలని, ధనవంతులు ఆక్రమించుకున్న చెరువులు ప్రభుత్వ భూములను విడిపించడానికి ప్రభుత్వం దృష్టి పెట్టాలని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తర్వాత ప్రాజెక్టులను నిర్మిస్తామని వేల కోట్ల రూపాయలు బడ్జెట్లో




కేటాయించుకొని ప్రాజెక్టులను నిర్మించకపోగా అవినీతి పేరుతోనే కోట్ల రూపాయలు దండుకున్నారని, సాగునీరు, త్రాగునీరు అందించడంలో బి ఆర్ఎస్,కాంగ్రెస్ ప్రభుత్వాలు విఫలమైన వారు విమర్శించారు. రైతాంగం పండించిన పంటలను ప్రభుత్వ కొనుగోలు చేయకపోవడం వలన రోడ్లమీద ఆరబోసుకొని రైతులు కాపలాగా ఉంటున్నారని, నాన్న అవస్థలు పడుతున్నారని ప్రభుత్వం దృష్టి పెట్టి రైతుల పంటలను తక్షణమే కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకి ఇందిరమ్మ ఇండ్లను, స్థలాలను మంజూరు చేసి, ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ విలువైన ప్రాణాలర్పించిన అమరవీరుల ఆశయాలైనటువంటి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాటాలు నిర్మించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం పిఓడబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ శిరోమణి, పార్టీ ఖమ్మం డివిజన్ నాయకులు కే శ్రీనివాస్, పార్టీ నగర కార్యదర్శి పి శోభ, జాలాది లెనిన్, బుల్లి కొమరయ్య రామనాథం, ప్రగతిశీల యువజన సంఘం పివైఎల్ జిల్లా కార్యదర్శి జె భరత్, పి డి ఎస్ యు జిల్లా అధ్యక్షుడు టీ లక్ష్మణ్, టీ మురళి కృష్ణ, నగర అధ్యక్ష కార్యదర్శులు ఎం రవీందర్, జి అశోక్, డి చంద్, ఆవుల వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య





**సుల్తానాబాద్, జూన్ 02(ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలను పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం ఊషన్నపల్లి ప్రభుత్వ ఆంగ్ల మాధ్యమ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఈర్ల సమ్మయ్య జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలతో, సుశిక్షితులైన, విశేష బోధనానుభవం కలిగిన అధ్యాపకుల చేత ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన ఉచిత బోధనను అందిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఊషన్నపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోనే చదివించాలని ఆయన కోరారు. దాతలు, అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో పాఠశాలను కార్పొరేట్ స్థాయి సౌకర్యాలతో తీర్చిదిద్దామని ఆయన వివరించారు. స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 1.07 లక్షలతో స్మార్ట్ టీవీ ఏర్పాటు చేసి, ఈ విద్యా సంవత్సరం నుండి డిజిటల్ క్లాసులు నిర్వహిస్తున్నాం. విద్యార్థులు స్వయంగా నేర్చుకునేలా కంప్యూటర్ విద్యను ప్రారంభించాము. 30.25 లక్షలతో అద్భుతమైన నూతన తరగతి గదుల నిర్మాణం, స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 7 లక్షలతో సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పించాం. దాతల ద్వారా 1 లక్ష విలువైన మినరల్ వాటర్ ప్లాంట్, ఫ్రిడ్జ్ ఏర్పాటు చేశాం. చిన్న పిల్లల కోసం 1.5 లక్షల విలువతో ప్రీ-ప్రైమరీ స్టడీ మెటీరియల్ సమకూర్చాం. రెగ్యులర్ సిలబస్‌తో పాటు నవోదయ, సైనిక్, గురుకుల, ఆదర్శ పాఠశాలల ప్రవేశ పరీక్షలకు పిల్లలను ప్రిపేర్ చేస్తున్నాం. దీని కోసం ఉపాధ్యాయులం ప్రతి రోజు రెండు గంటలు అదనంగా పనిచేస్తున్నాం. 2025-26 ప్రవేశ పరీక్షల్లో 13 మంది బాలబాలికలు గురుకుల, మోడల్ స్కూళ్లకు ఎంపికయ్యారు. ఇద్దరమ్మాయిలు రాష్ట్రస్థాయి నీతి పద్యాల పోటీల్లో గెలుపొందారు. పాఠశాల ప్రతిభకు గానూ జిల్లా కలెక్టర్ చేతులమీదుగా రెండుసార్లు 'ఛాంపియన్ స్కూల్' (బెస్ట్ స్కూల్) అవార్డును అందుకున్నాం. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఆవుల సునీత, ఉపాధ్యాయులు అమృత సురేష్ కుమార్, మంద శ్రీవాణి, గోపిశెట్టి సుప్రియ, బండారి సరిత, పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు , గ్రామస్తులు పాల్గొన్నారు.

# గోపీ మృతి పాత్రికేయ వృత్తికి తీరని లోటు: టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీ సంతాపం

**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ):** సీనియర్ జర్నలిస్టు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి కూరాకుల గోపీ మృతి పాత్రికేయ వృత్తికి తీరని లోటని ఫెడరేషన్ ఖమ్మం జిల్లా కమిటీ సంతాపం తెలిపింది. మంగళవారం ఉదయం ఆకస్మికంగా అనారోగ్యం పాలైన ఆయన్ను టీడబ్ల్యూజేఎఫ్ నేతల సహకారంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఖమ్మంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చేర్పించారు. అత్యవసర చికిత్స అందుతుండగానే బీపీ రికార్డు నమోదు కాకపోవటం, కార్డియాక్ అరెస్ట్, డయాబెటిక్ పేషెంట్ అయిన ఆయనకు కాలికి గాయంతో ఇన్ఫెక్షన్ శరీరమంతా వ్యాప్తి చెందటంతో తుదిశ్వాస విడిచారు. గతంలో వివిధ పత్రికలు, చానల్స్ లో రిపోర్టర్‌గా పనిచేశారు. ప్రస్తుతం జనంసాక్షి దినపత్రిక ఖమ్మం జిల్లా బ్యూరో ఇన్ చార్జిగా పనిచేస్తున్నారు. నిరంతరం జర్నలిస్టుల సంక్షేమం, సమాజ శ్రేయస్సు కోసం పనిచేసే గోపీ మృతి తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులు దువ్వా సాగర్, టీబీజేఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల శ్రీనివాస్, మానుకొండ రవికిరణ్, ఖమ్మం నియోజకవర్గం అధ్యక్ష, కార్యదర్శులు తురగ రాజేంద్రమూర్తి, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, స్టేట్ కౌన్సిల్ మెంబర్ మధుశ్రీ, జిల్లా కమిటీ సభ్యులు కొత్త యాకేష్, జానీపాష, నూకల రామచంద్ర మూర్తి, కొమిరె నాగేశ్వరరావు, సంతోష్ చక్రవర్తి, ఇర్షాద్, కామళ్ల వెంకట్, టీబీజేఏ నాయకులు గణేష్, అర్షద్, గోపి, కిరణ్, తదితరులు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.



గోపీకి భార్య క్రాంతి, ఇద్దరు కుమార్తెలు తేజస్విని, యశస్విని ఉన్నారు. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ సంతాపం సీనియర్ జర్నలిస్టు కూరాకుల గోపీ మృతికి టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అడ్ హక్ కమిటీ ఓ ప్రకటనలో సంతాపం తెలిపింది. కమిటీ అధ్యక్షుడు రామచందర్, ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య, కార్యదర్శులు రాజశేఖర్, చంద్రశేఖర్, గుడిగే రఘు తదితరులు ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు.

# కొత్త కోర్సులతో, అన్ని రంగాలలో రైజింగ్ శాతవాహన

## విశ్వవిద్యాలయ అభివృద్ధే మా ధ్యేయం - ఆచార్య ఉమేశ్



**హైదరాబాద్ (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాల్లో భాగంగా శాతవాహన విశ్వవిద్యాలయ పరిపాలన భవనంలో ఉపకులపతి ఆచార్య ఉమేశ్ కుమార్ జాతీయ పతాకం ఎగరవేసి మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో అన్ని రకాల మౌలిక వసతులు అభివృద్ధి చేస్తున్నామని ఆధునిక పద్ధతులలో డిజిటల్, ఈ- క్లాస్ రూములతో విద్యాబోధన జరుగుతోందని, ఈ కొత్త విద్యా సంవత్సరంలో ఆర్ట్స్, సైన్స్, కామర్స్ కళాశాలలో రెండేసి నూతన కోర్సులను ప్రవేశపెట్టడానికి ప్రయత్నం చేస్తున్నామని దానిలో భాగంగా ఈ విద్యా సంవత్సరం మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సుకి దరఖాస్తు చేసామని మనకున్న సౌకర్యాలకు కోర్స్ నిర్వహించడానికి అనుమతులు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తూ విశ్వవిద్యాలయాన్ని ముందుకు తీసుకు వెళ్లాలంటే అధ్యాపక అధ్యాపకేతర బృందం కలిసి సమిష్టిగా పనిచేస్తూ తెలంగాణలోని మెరుగైన విశ్వవిద్యాలయంగా నిలపడానికి ప్రయత్నం చేయాలన్నారు. ఈ రాష్ట్ర అవతరణ వేడుకలలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య సతీష్ కుమార్, ఓ ఎస్ డి టు వి సి డా. హరికాంత్, డీన్ సీడీసీ డా.జాఫర్, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ డా.రమాకాంత్, డా.పద్మావతి, డా.మనోహర్, డా.శ్రీశైలం, పరిపాలనాధికారులు డా. నజిముద్దీన్ మునవర్, డా.హుమేరా, వివిధ విభాగాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు




**హైదరాబాద్ (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఘనంగా జరిగాయి. ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం అసువులు బాసిన అమరుల లక్ష్య సాధన దిశగా పనిచేద్దామని ఈ సందర్భంగా ప్రొఫెసర్ కుమార్ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అత్యుత్తమ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని.... ఉన్నత విద్యారంగ అభివృద్ధిలో ఓయూ కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. విద్యా బోధన, పరిశోధనల్లో విద్యార్థులు, అధ్యాపకులను మరింత భాగస్వామ్యం చేసేందుకు ముఖ్యమంత్రి నాన్ నెట్ ఫెలోషిప్, రీసెర్చ్ సీడ్ గ్రాంట్ పథకాలను ప్రవేశపెట్టిన విషయాన్ని గుర్తు చేసారు. రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో ఓయూకు పునర్వైభవం తీసుకొస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలు, ఓయూతో అనుబంధం ఉన్న ప్రతి ఒక్కరికీ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి. నరేష్ రెడ్డి, ఓఎస్డీ ఆచార్య జితెంద్ర కుమార్ నాయక్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కాశీం సహా ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్, డీన్లు, డైరెక్టర్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సుద్దాలలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

## బిఆర్ఎస్ శ్రేణుల సంబరాలు



**సుల్తానాబాద్, జూన్ 02(ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం సుద్దాల గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం గ్రామ ఆటో స్టాండ్ వద్ద ఉన్న భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) పార్టీ జెండా గద్దె వద్ద పార్టీ శ్రేణులు జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సంపత్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన పోరాటాలను, అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ, జై తెలంగాణ నినాదాలతో సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ముత్యాల శ్రీనివాస్, టి. అనిల్, ఒజ్జ శ్రీనివాస్, వి. శ్రీనివాస్ రావు, ఎన్. పోషాలు , అధిక సంఖ్యలో బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**● తెలంగాణ శక్తులన్నీ ఏకం కావాలి ● హక్కుల సాధనకై గొంతెత్తుదాం ● మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి**







**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు పూర్తి చేసుకొని నూతన వసంతంలోకి అడుగుపెడుతున్న శుభసందర్భంగా పెద్దపల్లి నియోజకవర్గంలో గ్రామ గ్రామాన, పట్టణంలో వార్డు వార్డులో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి నేతృత్వంలో పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నాయి. పెద్దపల్లి బస్టాండ్ సమీపంలో గల అమరవీరుల స్థూపానికి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. తదనంతరం అయ్యప్ప టెంపుల్ చౌరస్తా దగ్గర ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల అలంకరించి, అక్కడే గల బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారి ఆదేశానుసారం తెలంగాణ అస్తిత్వాన్ని, హక్కులను కాపాడుకుంటామని కార్యకర్తలు, నాయకులందరి సమక్షంలో గొంతు కలిపి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ఆనాటి ఉద్యమ నాయకుడు, ప్రియతమ నేత, తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు నాయకత్వంలో 14 సంవత్సరాల అలపెరగని పోరాటం, ఎందరో అమరవీరుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని గుర్తుచేశారు. రాష్ట్రం సిద్ధించిన తర్వాత దాదాపు పదేళ్ల పాటు కేసీఆర్ గారి అద్భుత పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది, తలసరి ఆదాయంలోనూ, జాతీయ ఆదాయంలోనూ దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా నిలిచిందని కొనియాడారు. కానీ, గత రెండున్నర సంవత్సరాలుగా (నాయకత్వ మార్పు తదనంతర కాలంలో) తెలంగాణ వ్యతిరేక కుట్రదారుల చేతుల్లోకి పాలన వెళ్లడంతో రాష్ట్రం మళ్లీ వట్టిపోయే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. అమలుకాని, అలవిగాని వాగ్దానాలతో అధికారం చేజిక్కించుకున్న కాంగ్రెస్ పార్టీ ఇవాళ ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా ప్రజలను ముప్పుతిప్పలు పెడుతోందని మండిపడ్డారు.

**తెలంగాణ శక్తులన్నీ ఏకం కావాలి:** కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న అభివృద్ధి నిరోధక, అప్రజాస్వామిక చర్యల వల్ల ఇవాళ రైతులు, మహిళలు, విద్యార్థులు ఇలా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని దాసరి మనోహర్ రెడ్డి గారు ఆరోపించారు. తెలంగాణ వ్యతిరేకులంతా కుట్రలు చేస్తూ, తెలంగాణ గడ్డపై సమైక్యవాదుల బొమ్మలను ఏర్పాటు చేస్తుంటే తెలంగాణ బిడ్డలుగా మనం చూస్తూ ఊరుకోవద్దని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఎక్కడికక్కడ భూదందాలు, అక్రమాలు, అన్యాయాలు పెరిగిపోయాయని, అప్రజాస్వామిక పాలనతో ప్రజలను కించపరుస్తున్నారని ధ్వజమెత్తారు. రాబోయే రోజుల్లో మనల్ని మనం రక్షించుకోవడానికి, 14 ఏళ్ల పోరాట ఫలితమైన తెలంగాణను కాపాడుకోవడానికి తెలంగాణ శక్తులన్నీ మళ్లీ ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని స్పష్టం చేశారు. తెలంగాణ పునర్నిర్మాణానికి, అస్తిత్వ రక్షణకు ప్రతి ఒక్కరూ గొంతెత్తి పోరాడాలని, కేసీఆర్ గారి నాయకత్వంలో తెలంగాణ తల్లి ఆశయాలను నెరవేర్చడానికి పునరంకితం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఉప్పు రాజ్ కుమార్, కౌన్సిలర్ వెన్నం సుజాత రవీందర్, బిఆర్ఎస్ నాయకులు సయ్యద్ మోబిన్, పెంచాల శ్రీధర్, పూదరి చంద్రశేఖర్, నాంసాని సరేష్ బాబు, ఖదీర్ ఖాన్, రేవెల్లి స్వామి, బెక్కం ప్రశాంత్, లైసెట్టి బిక్షపతి, ముకీం, కోడం కిషోర్, చంద్రమౌళి, లవన్ కుమార్, కొంతం సురేష్, వరాల సంపత్, ఫహీమ్, పల్లె మధు, వైద శ్రీనివాస్, రవూఫ్, దాసరి శ్రీనివాస్, ఎడ్ల మల్లేశం, మునీర్, అజార్, లక్కాకుల లింగయ్య, వీరేశం, కుక్క మనోజ్, మహబూబ్, దేవనంది శ్రీనివాస్, అతిక్, ముబషీర్, శేఖర్, పూదరి అనిల్ కుమార్, మహేష్, శ్రవణ్ కుమార్, రాజేష్, బాలసాని శ్రీనివాస్, హరీష్, ఎస్.కె సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# అగ్నివీర్ వాయు విభాగానికి ఎంపికైన యువతులు జిల్లాకు గర్వకారణం

**● యువశక్తి ప్రోగ్రామ్ ద్వారా యువతకు ఉజ్వల భవిష్యత్తు ● మరింత మంది యువతులు సైన్యంలో చేరేందుకు ముందుకు రావాలి ● జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి యువశక్తి ప్రోగ్రామ్‌లో శిక్షణ పొందిన యువతులు సిలివెరి శ్రీజ, చిప్ప శశివర్షిణి భారత సైన్యంలో అగ్నివీర్ వాయు విభాగానికి ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. అగ్నివీర్ వాయు విభాగానికి ఎంపికైన యువతులను సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, దేశ సేవ కోసం భారత సైన్యం, భారత వైమానిక దళంలో చేరడం ఎంతో గౌరవప్రదమైన విషయమని అన్నారు. యువశక్తి ప్రోగ్రామ్‌లో శిక్షణ పొందిన ఇద్దరు యువతులు అగ్నివీర్ వాయు విభాగానికి ఎంపిక కావడం జిల్లా యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా నుంచి మరింత మంది యువత, ముఖ్యంగా యువతులు భారత సైన్యం, వైమానిక దళం, నౌకాదళం వంటి రక్షణ రంగాల్లో అవకాశాలను సద్వినియోగం చేసుకొని దేశ సేవలో భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. యువశక్తి ప్రోగ్రామ్ ద్వారా యువతకు అవసరమైన శిక్షణ, మార్గదర్శనం, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు సహాయ సహకారాలు అందిస్తూ వారి భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. యువత ఉపాధి, ఉద్యోగ అవకాశాలను సాధించేందుకు ఈ కార్యక్రమం సమర్థవంతమైన వేదికగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన యువతుల తల్లిదండ్రులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ జిల్లా అధికారులకు, యువశక్తి ప్రోగ్రామ్ నిర్వాహకులకు, శిక్షణ అందించిన సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువశక్తి ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ లెంకల మహిపాల్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**ధర్మపురి, జూన్ 2, (ది క్రైమ్ న్యూస్):** ధర్మపురి మున్సిపల్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్ని మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం ధర్మపురి పట్టణ పురపాలక సంఘం కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ధర్మపురి మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోట్లాది ప్రజల ఆకాంక్షల ఫలితమని, రాష్ట్రం ఏర్పడిన తరువాత విద్య, వైద్యం, వ్యవసాయం, మౌలిక వసతులు, సంక్షేమ రంగాల్లో విశేష ప్రగతి సాధించిందని అన్నారు. ప్రజల భాగస్వామ్యంతో ధర్మపురి పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు. పట్టణ ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు, పారిశుద్ధ్య సేవలు అందించేందుకు పురపాలక సంఘం నిరంతరం పనిచేస్తోందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి అర్హ గల కుటుంబానికి చేరవేయడమే తమ లక్ష్యమని చైర్మన్ నాగలక్ష్మి వెల్లడించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలను పరస్పరం తెలియజేసుకుంటూ రాష్ట్ర అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని నాయకులు, అధికారులు ప్రతిజ్ఞ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణ ప్రజలందరికీ మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం. శ్రీనివాస్, వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, పురపాలక సంఘం అధికారులు, కౌన్సిలర్లు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం





**నల్గొండ, ప్రతినిధి, జూన్ 2(ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీవో ఎస్. రమణారెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. వారి ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించేందుకు అధికారులు, ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తూ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సబ్ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణం దేశభక్తి నినాదాలు, జాతీయ జెండాలతో కళకళలాడింది. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ తెలంగాణ ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించేలా వేడుకలు నిర్వహించారు.

# ఘనంగా టీఆర్ఎస్ జెండా పండుగ

**- టీఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ - ఉద్యమకారులకు ఘన సన్మానం**




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పెద్దకాల్వల గ్రామ బస్టాండ్ వద్ద మంగళవారం తెలంగాణ రక్షణ సేన జిల్లా బాధ్యులు సలేంద్ర కొమురయ్య యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమాలలో పాల్గొన్న సుమారు 50 మంది ఉద్యమకారులను శాలువాలతో సత్కరించి ఘనంగా సన్మానించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో సలేంద్ర కొమురయ్య యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు ఎన్నో కష్టనష్టాలు భరించి, జైలు శిక్షలు అనుభవించి, తమ జీవితాలను పణంగా పెట్టారని గుర్తు చేశారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఉద్యమకారులకు తగిన గుర్తింపు, సంక్షేమ పథకాలు అందకపోవడం బాధాకరమని అన్నారు. గత ప్రభుత్వంతో పాటు ప్రస్తుత ప్రభుత్వం కూడా ఉద్యమకారుల సంక్షేమంపై నిర్లక్ష్యం ప్రదర్శించిందని విమర్శించారు. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం, పెన్షన్ కల్పిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడిచినా ఆ హామీల అమలుపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఉద్యమకారులకు 250 గజాల భూమి, పెన్షన్ మంజూరు చేసి వారి సేవలకు తగిన గౌరవం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. లేనిపక్షంలో తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తెలంగాణ సాధన కోసం పోరాడిన ఉద్యమకారులను అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించడం తగదని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా ఇన్చార్జ్ హారికరావు, మంథని ఇన్చార్జ్ బొల్లం భూమేష్, బొంగోని శంకరయ్య గౌడ్, సిహెచ్ హనుమాన్లు, కలువల మహేష్, దేవానంది లక్ష్మయ్య, గడ్డం నరసింగం, కలువల తిరుపతి, కలువల రవీందర్, కొమ్ము మల్లేశం, ఊరడి లక్ష్మయ్య, బి. మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ):** మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ ముఖ్య అతిథిగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎందరో అమరవీరుల ప్రాణ త్యాగాల ఫలితంగా తెలంగాణ ఏర్పాటు జరిగిందని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు, సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంలో అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎండీ ఖాదర్ బాబా, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, మండల నాయకులు, యువజన నాయకులు, మహిళా విభాగం తదితరులు పాల్గొన్నారు.

# అమరవీరుల త్యాగాల పునాదులపైనే తెలంగాణ రాష్ట్రం: ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**నల్గొండ, ప్రతినిధి, జూన్ 2(ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మిర్యాలగూడ నియోజకవర్గ కేంద్రంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక అమరవీరుల స్థూపం వద్ద, అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ముందుగా అమరవీరుల స్థూపం వద్దకు చేరుకున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమరవీరుల త్యాగాలు అమూల్యమైనవని, వారి ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కోట్లాది ప్రజల దశాబ్దాల ఆకాంక్షలు, ఎందరో యువకుల బలిదానాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని, ప్రజల సంక్షేమం మరియు సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అమరవీరుల కలల తెలంగాణను నిర్మించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాల్గొన్న వారందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

# విద్యార్థి ప్రతిభను గుర్తించిన నవ శకం సభ్యులు



**మధిర ప్రతినిధి జూన్ 2 (ది క్రైమ్ న్యూస్):** మధిర మున్సిపాలిటీ మడుపల్లి గ్రామానికి చెందిన, కనకపుడి సుమన్, నరేంద్ర కుమారి కుమార్తె, కనకపుడి మాన్విత, ట్రిబుల్ ఐటీ బాసరలో సీటు సాధించిన సందర్భంగా, సోమవారం రాత్రి నవ శకం ఆధ్వర్యంలో తన ప్రతిభను గుర్తించి ఉన్నంత స్థాయికి ఎదగాలని తనకు అన్ని విధాలుగా సహకారం అందిస్తూ ఉంటామని నవశకం సభ్యులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఘనంగా సన్మానించారు, ఈ యొక్క కార్యక్రమంలో, నవ శకం ఫౌండర్ మేకల రమేష్, మధిర మండలం నవ శకం అధ్యక్షులు కూరపాటి సురేష్, మధిర మండలం గౌరవ అధ్యక్షులు వేల్పుల పవన్ కళ్యాణ్, మరియు నవ శకం సభ్యులు, చింతిరాల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

## ● మధిరలో హోరెత్తిన భారీ బైక్ ర్యాలీ: మాజీ సీఎం కేసీఆర్ను కొనియాడిన లింగాల కమల్ రాజ్





**మధిర ప్రతినిధి జూన్ 2 (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మధిర పట్టణంలోని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ కార్యాలయంలో మంగళవారం నాడు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, మధిర నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ లింగాల కమల్ రాజు కార్యక్రమంలో భాగంగా మధిర మేజర్ సొసైటీ చైర్మన్ బిక్కి కృష్ణ ప్రసాద్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించగా, నియోజకవర్గ ఇంచార్జి లింగాల కమల్ రాజు బీఆర్ఎస్ పార్టీ జెండాను ఎగరవేసి వందనం చేశారు. హోరెత్తిన భారీ బైక్ ర్యాలీ జెండా ఆవిష్కరణ అనంతరం పార్టీ కార్యాలయం వద్ద నుండి వందలాది మంది నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ అంబేద్కర్ సెంటర్ మీదుగా, మధిర మెయిన్ రోడ్డు గుండా సాగుతూ స్థానిక తెలంగాణ తల్లి విగ్రహం వరకు చేరుకుంది. కమల్ రాజు నేతృత్వంలో సాగిన ఈ ర్యాలీతో మధిర పురవీధులు గులాబీ మయంగా మారాయి. కేసీఆర్ పాలనలోనే తెలంగాణ అగ్రగామి తెలంగాణ తల్లి విగ్రహం వద్ద పార్టీ శ్రేణులను ఉద్దేశించి లింగాల కమల్ రాజు ప్రసంగించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షను, అమరవీరుల త్యాగాలను గుండెల్లో నింపుకొని, చావు నోట్లోకి వెళ్లి మరీ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఢిల్లీ మెడలు వంచి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని కొనియాడారు. గడిచిన పదేళ్ల కాలంలో కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ చేతగానితనాన్ని ఎండగట్టిన కమల్ రాజు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై కమల్ రాజు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కొన్ని శక్తులు, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ మాయమాటలతో, నెరవేర్చలేని చేతగాని హామీలతో తెలంగాణ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వానికి తెలంగాణను పాలించడం చేతకావడం లేదు. ఇచ్చిన హామీలను అమలు చేయలేక, తెలంగాణ సంపదను ఢిల్లీకి దోచిపెట్టడమే పనిగా పెట్టుకున్నారు. లింగాల కమల్ రాజు, బీఆర్ఎస్ ఇంచార్జ్ తెలంగాణ వ్యతిరేక శక్తుల కుట్రలు సాగకుండా, రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని కమల్ రాజు పిలుపునిచ్చారు. కేసీఆర్ అడుగుజాడల్లో నడుస్తూ, తెలంగాణ కోసం నిరంతరం పాటుపడతామని ఈ సందర్భంగా కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మధిర నియోజకవర్గ పరిధిలోని ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ కార్యకర్తలు మరియు అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# మహాత్ముల విగ్రహాల ఆవిష్కరణ - అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం




### ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**నల్గొండ ప్రతినిధి, జూన్ 2 (ది క్రైమ్ న్యూస్):** మిర్యాలగూడ, జూన్ 2: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మిర్యాలగూడ నియోజకవర్గ కేంద్రంలో సోమవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. తెలంగాణ పండుగ వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ప్రజలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన విగ్రహాలను మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ రాగ్యా నాయక్ సతీమణి భారతి రాగ్యా నాయక్, మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, సామాజికవేత్త డాక్టర్ రాజు చేతుల మీదుగా ఆవిష్కరించారు. అంతకుముందు మిర్యాలగూడ పట్టణంలోని ఎన్టీఆర్ కాంప్లెక్స్‌లో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శు భాకాంక్షలు తెలిపారు. అనంతరం ఒకే వేదికపై గాంధీ, అంబేద్కర్, జ్యోతిరావు పూలే విగ్రహాలను ప్రజల సమక్షంలో ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా బీఎల్ఆర్ బ్రదర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐఐటీలో ఆల్ ఇండియా 32వ ర్యాంకు సాధించిన అడవిదేవులపల్లి మండలం బంగారికుంట తండాకు చెందిన గిరిజన విద్యార్థి కృష్ణప్రసాద్‌కు రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అలాగే గౌడ సంఘం భవన నిర్మాణానికి రూ.10 లక్షలు, ఎల్ఐసీ ఏజెంట్స్ అసోసియేషన్ భవనానికి రూ.6 లక్షలు, జాప్తివీరప్పగూడెం రామాలయ నిర్మాణానికి రూ.5 లక్షలు, దామరచర్ల యాదవ మహారాజుల గంగమ్మ గుడి అభివృద్ధికి రూ.10 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, గాంధీజీ బోధించిన అహింసా సిద్ధాంతం, అంబేద్కర్ అందించిన సామాజిక సమానత్వం, జ్యోతిరావు పూలే ఆశించిన విద్యా వికాస స్ఫూర్తితోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. తెలంగాణ సాధనలో సకల జనుల సమ్మె ఎంత కీలక పాత్ర పోషించిందో, రాష్ట్ర అభివృద్ధిలో రైతులు, కార్మికులు, యువత, మహిళల భాగస్వామ్యం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం బీఎల్ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన పెరుగన్నం పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు పెరుగన్నం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు, దళిత-బహుజన సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, కుల సంఘాల నాయకులు, విద్యార్థులు, మహిళలు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఎంతో మంది అమరవీరుల త్యాగ ఫలితంగానే తెలంగాణ

## ● ఆర్.జీ-త్రీ ఏ.పి.ఏ ఏరియాల్లో ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ● రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ ● అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు





**రామగిరి, జూన్ 02(ది క్రైమ్ న్యూస్):-** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సింగరేణి సంస్థ రామగుండం-త్రీ , అడ్రియాల ప్రాజెక్టు ఏరియాల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరైనారు. వేడుకల్లో భాగంగా ఉదయం రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణం లోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ అమరవీరులకు పూలతో నివాళులు అర్పించారు. తదుపరి స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణం నుండి జి.యం కార్యాలయం వరకు నిర్వహించిన తెలంగాణ రన్ లో సింగరేణి అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు, సేవా సభ్యులు, అధిక సంఖ్యలో పాల్గొని తెలంగాణ ధూంధాం పాటలతో జానపద గీతాలపై నృత్య ప్రదర్శన చేసి అందరిని ఆకట్టుకున్నారు. జీ.ఎం. కార్యాలయంలో ఆర్జీ- త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ జాతీయ పతాకావిష్కరణ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అంతేకాకుండా సాయంత్రం క్రీడా ప్రాంగణంలో నిర్వహించినటువంటి సభా కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఆర్.జి.-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, ఎపిఎ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు, ఇతర అతిథులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థ తెలంగాణలోనే ముఖ్య భూమిక పోషిస్తుందని, విద్యుత్ అవసరాల నిమిత్తం బొగ్గును వెలికి తీసి సరఫరా చేయడం జరుగుతుందని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 12 సంవత్సరాలలో సింగరేణి సంస్థ ఎంతో అభివృద్ధి సాధించినదని, రాష్ట్ర విద్యుత్ అవసరాల కోసం సోలార్ విద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేసి సంస్థ ఎంతో ముందుకు వెళ్తుందని ఎంతో మంది అమరవీరుల త్యాగ ఫలితంగానే తెలంగాణ వచ్చినదని అన్నారు. అందరికి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. తదుపరి ఏరియాలో ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. గత సంవత్సరం కోల్ ఇండియా స్థాయిలో నిర్వహించిన వివిధ ఆటల పోటీలలో గెలుపొంది పథకాలు సాధించిన ఆర్జీ-త్రీ , అడ్రియాల ప్రాజెక్టు ఏరియాల ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. తదుపరి ఉత్తమ సేవా సభ్యులకు బహుమతులను అందజేశారు. అనంతరం స్థానిక కళాకారులు తెలంగాణ జానపద గీతాలను ఆలపించారు. అంతేకాకుండా సింగరేణి ఉద్యోగులు, స్థానిక కళాకారులు, వివిధ పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు, సేవా సభ్యులు తెలంగాణ జానపద గీతాలపై నృత్యాలను ప్రదర్శించి అందరినీ అలరించారు. జబర్దస్త్ వెంకీ మంకీ టీం సభ్యులు చేసిన సంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆలరించాయి. ఈ కార్యక్రమము లో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం.రామచంద్ర రెడ్డి, కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ఏరియా ఇంజనీర్లు సుధాకర్ రెడ్డి, యాదయ్య, ఎస్వోటు జిఎంలు బి.వి.సత్య నారాయణ, బండి సత్యనారాయణ, సేవా అధ్యక్షురాలు వెంకట లక్ష్మి నాగేశ్వరరావు, ప్రాజెక్ట్ అధికారులు జె.రాజశేఖర్, ప్రవీణ్ వి ఫాంటింగ్, జి.శంకర్, సివిల్ డిజిఎం రాజేంద్ర కుమార్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, విభాగధిపతులు బి.టి.మురళీ కృష్ణ, రాజారెడ్డి, ఐలయ్య, సురేఖ, రాజేశ్వరి, లతో పాటు వివిధ గనుల, విభాగాల అధిపతులు, అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు, సేవా సభ్యులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో చేపల వ్యాపారి మృతి





**నల్గొండ ప్రతినిధి, జూన్ 02 (ది క్రైమ్ న్యూస్):** నల్లగొండ జిల్లా హాలియా పోలీస్ స్టేషన్ పరిధిలోని బంటువారిగూడెం గ్రామ శివారులో జాతీయ రహదారి-565పై మంగళవారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ప్రాథమిక సమాచారం ప్రకారం, చేపల వ్యాపారం నిమిత్తం ఆటో నెం.1225లో నల్లగొండ నుంచి హాలియా వైపు వెళ్తున్న శేషమ్మగూడెం గ్రామానికి చెందిన రుద్రాక్షి కుమార్ (38) బంటువారిగూడెం గ్రామ శివారుకు చేరుకోగా, ఎదురుగా హాలియా నుంచి నల్లగొండ వైపు వస్తున్న కారు నెం.2987 ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రుద్రాక్షి కుమార్ తీవ్రంగా గాయపడగా, స్థానికులు వెంటనే నాగార్జునసాగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రమాదంలో ఆటో పూర్తిగా ధ్వంసమైంది. మృతుడి భార్య రుద్రాక్షి జయసుధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హాలియా ఎస్సై సాయి ప్రశాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి కారణమైన వాహన డ్రైవర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఎందరో ఉద్యమ రథసారథులు మరవీరుల త్యాగ ఫలితమే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం: ధర్మపురి బిఆరెస్ పార్టీ నాయకులు




**ధర్మపురి, జూన్2, (ది క్రైమ్ న్యూస్):** ఎందరో ఉద్యమ రథసారథులు, మరవీరుల త్యాగ ఫలితమే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అని అందులో ముందుండే ప్రముఖ మైన వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని ధర్మపురి బిఆరెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పుల మాళలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ కేసీఆర్ ఉద్యమ రథసారథిగా ఎందరో అమరవీరుల, విద్యార్థుల, సకల జనుల, దశాబ్దాల పాటు సుదీర్ఘ పోరాటాల ఫలితంగా 2014 జూన్ 2న భారతదేశంలో 29 వ రాష్ట్రముగా తెలంగాణ అధికారికంగా అవతరించిందని వారు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ పతాక"ఆవిష్కరణ కార్యక్రమం స్థానిక తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అయ్యోరి రాజేష్ కుమార్, మాజీ సర్పంచ్ ఒడ్నాల మల్లేశం, సంగి శేఖర్, చిలువేరి శ్యామ్ సుందర్, పెరుమాండ్ల ఎల్లగౌడ్, బండారి రంజిత్, బండారి అశోక్, చుక్క రవి, అనంతుల లక్ష్మణ్, మురికి శ్రీనివాస్, తరాల కార్తీక్, గుర్రాల సుధాకర్, బాకి శేఖర్, ఎస్డి ఆసిఫ్, స్తంభంకాడి మహేష్, కూరగాయల సంతోష్, నక్క రాజేందర్, మామిడి శ్రీనివాస్, జెట్టి రాజన్న, కాశెట్టి విజయ్, అక్కనపెల్లి సురేందర్, చీపిరిశెట్టి రాజన్న, స్తంభంకాడి (డీజే) మహేష్, కళ్లెం రిషిరెడ్డి, మూటపెల్లి లడ్డు, మొలుగూరి ప్రశాంత్, అంబటి లక్ష్మణ్, దేవరకొండ సురేష్, కొండాపురం యశ్వంత్, చల్ల మున్నా తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కార్యాలయం నందు ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**మధిర ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్) జూన్ 2:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మధిర అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఆఫీస్ నందు ఘనంగా నిర్వహించారు. కే సాయి దీక్షిత్ అగ్రికల్చర్ ఆఫీసర్ జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆత్మ కమిటీ డైరెక్టర్ శ్రీ లక్ష్మి మధిర మండల ఫెర్టిలైజర్ డీలర్లు కృష్ణారావు శ్రీనివాస్ రెడ్డి సత్యనారాయణ మధుసూదన్ రెడ్డి కిషోర్ సీనియర్ అసిస్టెంట్ రమేష్ జూనియర్ అసిస్టెంట్ రవి ఆఫీస్ సిబ్బంది పాషా పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించిన హాలియా మున్సిపాలిటీ



**నల్గొండ ప్రతినిధి, జూన్ 2(ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని హాలియా మున్సిపాలిటీలో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా హాలియా మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ శ్రీ చింతల చంద్రారెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం హాలియా బస్టాండ్ సమీపంలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ గీతాన్ని ఆలపించి, ఉద్యమంలో అమరవీరులు చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన అమరవీరుల త్యాగాల ఫలితంగానే నేడు తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని ఈ సందర్భంగా చైర్మన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు.

# సంక్షేమం - అభివృద్ధి - సామాజిక న్యాయం లక్ష్యంగా ప్రభుత్వ పరిపాలన...

● జూన్ 2 నుంచి కోటి 15 లక్షల కుటుంబాలకు రూ.5 లక్షల ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా ● ఉచిత బస్సు ప్రయాణంతో జిల్లా మహిళలకు 193 కోట్లు ఆదా ● తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణ రావు







**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పెద్దపల్లి పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి వేడుకల్లో భాగంగా ఉదయం పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన తదుపరి అమరవీరుల స్థూపానికి నివాళులర్పించి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తో కలిసి తెలంగాణ ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణ రావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సమీకృత కలెక్టరేట్ ఆవరణలోని తెలంగాణ తల్లి విగ్రహానికి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష గారితో కలిసి పూలమాలలు సమర్పించడం జరిగింది.తదుపరి పోలీసు కవాతు నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయ రమణారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రస్తుతం 200 బిలియన్ అమెరికన్ డాలర్లుగా ఉన్న తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 2034 నాటికి ఒక ట్రిలియన్ అమెరికన్ డాలర్లకు, 2047 నాటికి మూడు ట్రిలియన్ అమెరికన్ డాలర్లకు పెంచే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.రాష్ట్రంలోని కోటి 15 లక్షల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున జీవిత బీమా రక్షణ కల్పించే "ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా" పథకాన్ని జూన్ 2 నుంచి అమలు చేస్తున్నామని తెలిపారు. కుటుంబ పోషకుడు మరణించిన సందర్భంలో కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు పరిశుభ్రత, ఆరోగ్యం, విద్య, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, యువజనాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యారంగంలో ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులకు నూతనంగా అల్పాహార పథకాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరించామని చెప్పారు. జిల్లాలోని 547 పాఠశాలల ద్వారా సుమారు 37 వేల మంది విద్యార్థులకు విద్య అందుతోందని, ఎఫ్.ఆర్.ఎస్ విధానంలో 96 శాతం హాజరు నమోదవుతోందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా రూ.17 కోట్లతో మౌలిక వసతులు కల్పించామని, రూ.66 లక్షలతో భవిత కేంద్రాలను అభివృద్ధి చేశామని, పీఎం శ్రీ పథకం కింద ఎంపికైన 16 పాఠశాలలను ఆధునికీకరిస్తున్నామని తెలిపారు. అభయహస్తం కార్యక్రమం కింద జిల్లాలో 9,823 కొత్త తెల్ల రేషన్ కార్డులు జారీ చేయడంతో పాటు 8,978 మంది కొత్త సభ్యులను పాత కార్డుల్లో చేర్చామని తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద జిల్లాలో 1,18,953 మంది లబ్ధిదారులకు 4,73,691 గ్యాస్ సిలిండర్లను రూ.14.03 కోట్ల సబ్సిడీతో రూ.500కే అందించామని తెలిపారు.ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా జిల్లాలో మహిళలు రూ.193.35 కోట్ల మేర ఆదా చేసుకున్నారని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం మొదటి విడతలో జిల్లాకు మంజూరైన 6,451 ఇళ్ల నిర్మాణాలు వేగంగా కొనసాగుతున్నాయని, లబ్ధిదారుల ఖాతాల్లో ఇప్పటివరకు రూ.126 కోట్లు జమ చేశామని తెలిపారు.రెండో విడతలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 2 వేల చొప్పున మొత్తం 6 వేల ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగిస్తున్న 1,39,760 కుటుంబాలకు రూ.135.92 కోట్ల సబ్సిడీతో ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. మహిళా శక్తి మిషన్ కింద జిల్లాలోని 6,851 స్వయం సహాయక సంఘాలకు రూ.454.66 కోట్ల బ్యాంక్ లింకేజ్ రుణాలు, 1,642 సంఘాలకు రూ.52.90 కోట్ల స్త్రీనిధి రుణాలు అందించామని చెప్పారు.8,909 సంఘాలకు రూ.18.03 కోట్ల వడ్డీ రాయితీ విడుదల చేశామని తెలిపారు. మహిళా సంఘాల ద్వారా 15 అద్దె ఆర్టీసీ బస్సులు, ఒక మెగావాట్ సోలార్ ప్లాంట్, ఒక పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంలో 5,668 మహిళా ఎంటర్‌ప్రైజ్‌లు స్థాపించబడ్డాయని పేర్కొన్నారు. రంగంపల్లి వీ-హబ్ కేంద్రం ద్వారా 376 మందికి శిక్షణ అందించామని తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 93,659 మంది లబ్ధిదారులకు రూ.252.22 కోట్ల చేయూత పింఛన్లు అందించామని తెలిపారు. నరేగా కింద రూ.18.21 కోట్ల వ్యయంతో 30,659 కుటుంబాలకు ఉపాధి కల్పించామని చెప్పారు.వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద 456 మంది రైతులకు రూ.1.92 కోట్ల సబ్సిడీతో వ్యవసాయ పరికరాలు పంపిణీ చేశామని తెలిపారు. రైతు భరోసా కింద 1,54,598 మంది రైతులకు రూ.114.04 కోట్ల నిధులు జమ చేశామని చెప్పారు. 50 శాతం సబ్సిడీపై 6,900 క్వింటాళ్ల పచ్చిరొట్టె విత్తనాలు పంపిణీ చేశామని తెలిపారు. రైతు బీమా కింద గత రెండు సంవత్సరాల్లో మరణించిన 1,002 మంది రైతు కుటుంబాలకు రూ.44.85 కోట్ల పరిహారం అందించామని పేర్కొన్నారు. 2025-26 యాసంగి సీజన్‌లో 334 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రూ.767.09 కోట్ల విలువైన 3,23,773 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి మద్దతు ధరను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు.ఉద్యానవన శాఖ ద్వారా 3,472 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు విస్తరణ చేపట్టి రూ.1.78 కోట్ల సబ్సిడీ అందించామని, సూక్ష్మ నీటి సేద్య పథకం కింద 1,162 ఎకరాలకు రూ.3.19 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు.విద్యుత్ శాఖ ద్వారా జిల్లాలోని 74,157 వ్యవసాయ కనెక్షన్లకు రూ.382.65 కోట్ల సబ్సిడీతో 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. పీఎం కుసుమ్ పథకం కింద 9.5 మెగావాట్ల సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తి యూనిట్ల ఏర్పాటుకు ఒప్పందాలు కుదుర్చుకున్నామని చెప్పారు. పీఎం సూర్యఘర్ పథకం కింద 1,094 సోలార్ రూఫ్‌టాప్‌లను 7.287 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలో 9 ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.నందిమేడారం గ్రామాన్ని మోడల్ సోలార్ గ్రామంగా అభివృద్ధి చేస్తూ రూ.51.28 కోట్లతో 1,486 గృహాలు, 628 వ్యవసాయ పంపుసెట్లకు సోలార్ వ్యవస్థలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా జిల్లాలో రూ.39 కోట్ల 11 లక్షల వ్యయంతో 14,983 మందికి ఉచిత శస్త్రచికిత్సలు నిర్వహించగా, తెలంగాణ హబ్ డయాగ్నోస్టిక్స్ ద్వారా 95,624 మంది నుంచి 1,72,159 శాంపిల్స్ సేకరించి 3,39,906 పరీక్షలు ఉచితంగా నిర్వహించామని, 108 అంబులెన్స్ ద్వారా 13,937 మందికి, 102 సేవల ద్వారా 16,924 మంది గర్భిణులు, చిన్నారులకు రవాణా సౌకర్యం కల్పించారు. రామగుండం క్రిటికల్ కేర్ భవనం, మేడారం సీహెచ్‌సీ లను ప్రారంభించగా, రూ.51 కోట్లతో జిల్లా ఆసుపత్రి, రూ.26 కోట్లతో నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. రోడ్లు, భవనాల అభివృద్ధికి ప్రభుత్వం భారీ స్థాయిలో నిధులు కేటాయించిందని, జిల్లాలో 102.06 కిలో మీటర్ల మేర 22 డబుల్ రోడ్డు విస్తరణకు రూ.921.93 కోట్లు మంజూరు చేయగా పనులు పురోగతిలో ఉన్నాయని అన్నారు. రూ.497.03 కోట్లతో 17 వంతెనల నిర్మాణం, విస్తరణ పనులు చేపట్టగా 9 పూర్తయ్యాయని, వరదలతో దెబ్బతిన్న రహదారులను రూ.31.81 కోట్లతో పునరుద్ధరణ పనులు చేపట్టి 16 పనులు పూర్తి చేశామని అన్నారు.పెద్దపల్లి--కాల్వ శ్రీరాంపూర్ మార్గంలో రూ.119 కోట్లతో నిర్మిస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు 75 శాతం పూర్తయ్యాయని, అలాగే రూ.160.30 కోట్లతో రామగుండం ఆసుపత్రి భవనం, రూ.104.81 కోట్లతో కోర్టు, ఇతర భవనాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. పట్టణాభివృద్ధి రంగంలో ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా మౌలిక సదుపాయాల విస్తరణ చేపడుతోందని, అమృత్-2.0 పథకం కింద జిల్లాలో రూ.289.46 కోట్లతో ఎస్‌టీపీలు, సీవర్ ట్రంక్ మెయిన్‌ల, యూఐడీఎఫ్ నిధుల ద్వారా రూ.226 కోట్లతో మంచినీటి సరఫరా, రోడ్లు, డ్రైన్లు, వీధి దీపాలు, సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. డీఎంఎఫ్‌టీ నిధులు రూ.67.59 కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, భూగర్భ మురుగు కాలువలు, మంచినీటి పైప్‌లైన్ పనులు అమలులో ఉన్నాయి.మెప్మా ఆధ్వర్యంలో 714 సంఘాలకు రూ.96.52 కోట్ల బ్యాంక్ లింకేజ్ రుణాలు, 34,707 మంది వీధి వ్యాపారులకు రూ.68.32 కోట్ల పీఎం స్వనిధి రుణాలు, 994 సంఘాలకు రూ.21.11 కోట్ల స్త్రీనిధి ఆర్థిక సహాయం అందించామని అన్నారు.మత్స్య శాఖ ద్వారా 26,051 హెక్టార్లలో కోటి 58 లక్షల చేప పిల్లల విడుదలకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని తెలిపారు. ప్రమాదాల్లో మరణించిన 23 మత్స్యకార కుటుంబాలకు రూ.1.15 కోట్ల పరిహారం అందించామని చెప్పారు.మహిళా, శిశు సంక్షేమ శాఖ ద్వారా 706 అంగన్‌వాడీ కేంద్రాల్లో 3,710 మంది గర్భిణీలు, 2,930 మంది బాలింతలు, 33,441 మంది చిన్నారులకు పోషకాహారం అందిస్తున్నామని తెలిపారు. 153 మంది దివ్యాంగులకు పరికరాలు, 21 మందికి స్వయం ఉపాధి రుణాలు, 9 దివ్యాంగ జంటలకు వివాహ ప్రోత్సాహకాలు అందించామని పేర్కొన్నారు.యువజన, క్రీడా రంగంలో రూ.2.50 కోట్లతో ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టు, రూ.1.50 కోట్లతో స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.పారిశ్రామిక రంగంలో 266 మందికి ఉపాధి కల్పించే 22 పరిశ్రమలకు రూ.11.24 కోట్ల పెట్టుబడులతో టీజీ-ఐపాస్ అనుమతులు మంజూరు చేశామని, పీఎంఈజీపీ కింద 29 యూనిట్లు, టీ-ఐడియా, టీ-ప్రైడ్ ద్వారా 42 పరిశ్రమలకు రూ.7.67 కోట్లు మంజూరు చేశామని తెలిపారు.ఉపాధి కల్పనలో భాగంగా నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 3,515 మంది యువత పాల్గొనగా 933 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయని తెలిపారు. అగ్నివీర్ శిక్షణ ద్వారా 47 మంది ఎంపికైనట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే. అరుణ శ్రీ, డిసిపి రాంరెడ్డి, డిఆర్‌ఓ రాజేశ్వరి, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, రామగుండం మేయర్ మహంకాళి స్వామి, పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్, నూగిళ్ల మల్లయ్య ,ఆర్డీఓ బి. గంగయ్య, కలెక్టరేట్ ఏఓ ప్రకాష్, జిల్లా అధికారులు,మార్కెట్ చైర్మన్ లు, డైరెక్టర్లు, కౌన్సిలర్లు, సర్పంచ్ లు మరియు ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ అభివృద్ధిలో పోలీసుల పాత్ర కీలకం: సీపీ రమేష్



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమని ఎం. రమేష్ అన్నారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించిన వేడుకల్లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా సీపీ రమేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నో త్యాగాలు, పోరాటాల ఫలితంగా సాధించిన తెలంగాణ నేడు అభివృద్ధి, సంక్షేమం, నూతన ఆవిష్కరణల్లో దేశానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ప్రజల భద్రతే అభివృద్ధికి పునాది అని, పెట్టుబడులను ఆకర్షించడంలోనూ, అనుకూల వాతావరణం కల్పించడంలోనూ పోలీసుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. సైబరాబాద్ దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో ఒకటిగా ఎదిగిందని, ఐటీ, ఫైనాన్స్, విమానాశ్రయం, మెట్రో, ఫ్లైఓవర్లు వంటి ప్రాజెక్టులు తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చాయని తెలిపారు. తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం విధి నిర్వహణలో విశిష్ట ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులకు మహోన్నత సేవా పతకాలు, ఉత్తమ సేవా పతకాలు, సేవా పతకాలను సీపీ ప్రదానం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన 2026 పోలీసు సేవా పతకాలలో సైబరాబాద్ కమిషనరేట్‌కు చెందిన పలువురు అధికారులు, సిబ్బంది ఎంపిక కావడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో వృద్ధాశ్రమం, అనాథాశ్రమానికి చెందిన చిన్నారులు పాల్గొని కార్యక్రమాలను వీక్షించారు. ఈ సందర్భంగా వారికి సీపీ బహుమతులు అందజేశారు. వివిధ విభాగాల డీసీపీలు, ఇతర ఉన్నతాధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అమరవీరులు, ఉద్యమకారులకు న్యాయం జరగాలి: రవికుమార్ యాదవ్



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్రం కోట్లాది మంది ప్రజల ఆకాంక్షలు, అమరవీరుల ఆత్మబలిదానాలు, యువత, ఉద్యమకారుల పోరాటాల ఫలితంగా ఏర్పడిందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్ అన్నారు. మంగళవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మసీద్‌బండ చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమరవీరులకు నివాళులర్పించిన రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ 1969లో ప్రారంభమైన తెలంగాణ ఉద్యమం అనేక దశలను దాటి, సకల జనుల సమ్మె, రైల్‌రోకో, మిలియన్ మార్చ్ వంటి పోరాటాలతో 2014లో రాష్ట్ర సాధనకు దారితీసిందని గుర్తు చేశారు. తెలంగాణ సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల కుటుంబాలకు ఇప్పటికీ పూర్తి న్యాయం జరగలేదని ఆయన విమర్శించారు. అమరవీరుల కుటుంబాలకు పెన్షన్, ప్రభుత్వ ఉద్యోగాలు, ఉద్యమకారులకు ఇంటి స్థలాలు వంటి హామీల అమలులో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమయ్యాయని ఆరోపించారు. అమరవీరులను, ఉద్యమకారులను రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రమే ఉపయోగించుకున్నారని, వారికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల గుర్తింపు కార్డులు జారీ చేసి, పెండింగ్ హామీలను నెరవేర్చాలని కోరారు. తెలంగాణ కోసం పోరాడిన ప్రతి ఒక్కరిని గౌరవించడం ప్రభుత్వాల బాధ్యత అని పేర్కొన్న రవికుమార్ యాదవ్, అమరవీరుల త్యాగాలు, ఉద్యమకారుల పోరాటాలను ఎప్పటికీ మరవకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎల్లేష్, కిశోర్, ఆంజనేయులు సాగర్, రాజు శెట్టి, సదానంద్ యాదవ్, కాంచన కృష్ణ, రమేష్, శ్రీశైలం తదితరులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## తస్మాత్.. జాగ్రత్త.. దొంగలు సంచారిస్తున్నారు.. హెచ్చరిక జరిచేసిన కొడిమ్యాల పోలీసులు..

**జగిత్యాల, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల పోలీస్ వారు ప్రెస్ నోట్ ద్వారా హెచ్చరిక జరిచేసారు. అందులో భాగంగా మండల లోని అన్ని గ్రామాల ప్రజలకు తెలియజేయునది ఏమనగా ప్రజలందరూ ప్రస్తుతం వేసవి కాలం అయినందున ఇంటి బయట పడుకుంటున్నారు అలా పడుకోవడం వలన కొంత మంది గుర్తు తెలియని దొంగలు వచ్చి మహిళల మెడలో ఉన్న బంగారంను కత్తిరించుకుని దొంగతనం చేసుకుని వెళ్ళిపోతున్నారు కావున ప్రజలందరూ బయట పడుకునేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని రాత్రి సమయంలో జాగ్రత్తగా ఉండాలని ఒంటరి ఉండే మహిళలు బయట పడుకోవద్దని ఇంట్లోనే పడుకోవాలని కొడిమ్యాల పోలీస్ వారు ప్రజలను కోరుతున్నారు...

## సచివాలయంలో అమరవీరులకు ఘన నివాళులు..



**హైదరాబాద్ (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర అవతరణ వేడుకలను అత్యంత ఘనంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గిరి శ్రీనివాస్ రెడ్డి జనరల్ సెక్రటరీ ప్రేమ్, కార్యవర్గ సభ్యులు మరియు ముఖ్య అతిథులుగా విచ్చేసిన జేఏసీ ప్రతినిధులు మారం జగదీశ్వర్ గారు, ఏలూరి శ్రీనివాసరావు గారు మరియు ముజీబ్ గారు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలో తెలంగాణ ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమైనదని, అలాగే ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలను సమర్థవంతంగా చేరవేయడంలో సచివాలయ ఉద్యోగులు అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు., ఉద్యోగులకు రావాల్సిన హక్కుల విషయం లో కొత్త ఆరోగ్య పథకాన్నీ సాధించుకున్నామని, ఇంకా మనకు రావలిసిన ఇతర ప్రయోజనాల గురించి కూడా సంఘటితంగా ముందుకు వెళ్దామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ ప్రాణాలను అర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారికి ఘన నివాళులు అర్పించడం జరిగింది. తర్వాత అసోసియేషన్ నాయకులు, కార్యవర్గ సభ్యులు, అధికారులు మరియు మహిళా ఉద్యోగులు కేక్ కట్ చేసి, పరస్పరం మిఠాయిలు పంచుకుంటూ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ ఆనందాన్ని జరుపుకున్నారు. ఈ వేడుకలను విజయవంతంగా నిర్వహించడంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికి అలాగే కార్యక్రమానికి హాజరైన జేఏసీ ప్రతినిధులకు, అధికారులకు, ఉద్యోగులకు మరియు మహిళా ఉద్యోగులకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్ అసోసియేషన్ తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము.

## అమరవీరుల త్యాగాల ఫలితమే తెలంగాణ పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** అమరవీరుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ అన్నారు. మంగళవారం శేరిలింగంపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ అమరవీరులకు నివాళులర్పిస్తూ తెలంగాణ రాష్ట్ర, శేరిలింగంపల్లి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, మహిళలతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించి అమరవీరులకు వందనం సమర్పించారు. అనంతరం గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో సుమారు రూ.2,000 కోట్ల విలువైన అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. త్వరలో రూ.530 కోట్లతో మియాపూర్ చౌరస్తా ఫ్లైఓవర్‌కు శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే రూ.459 కోట్లతో గచ్చిబౌలి ఐఐటీ జంక్షన్ ఫ్లైఓవర్, రూ.220 కోట్లతో కాజాగూడ జంక్షన్ ఫ్లైఓవర్ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. రూ.308 కోట్లతో లింగంపల్లి ఆర్‌ఓబీ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్నట్లు తెలిపారు. విద్యా రంగ అభివృద్ధిలో భాగంగా రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల, రూ.100 కోట్లతో కొండాపూర్, చందానగర్ ప్రాంతాల్లో కోర్ అర్బన్ పాఠశాలల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో శేరిలింగంపల్లిని రాష్ట్రంలోనే అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. తెలంగాణ ఉద్యమంలో అమరులైన వీరులకు నివాళులర్పించిన గాంధీ, వారి త్యాగాలను స్మరించుకుంటూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, మహిళలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విశ్వకర్మ నాలెడ్జి సెంటర్ విశ్వకర్మ యంగ్ లీడర్ అవార్డు..

**జగిత్యాల, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ వ్యవస్థాపకులు విశ్వనాధుల పుష్పగిరి వికారాబాద్ అదనపు కలెక్టర్ వెంకటాచారి క్రైమ్ బ్రాంచ్ ఏసిపి కిరణ్ కుమార్ చేతులమీదుగ విశ్వకర్మ యువత అన్ని రంగాల్లో రాణించాలనే సంకల్పంతో తన వాక్చాతుర్యంతో యువకులను అందర్నీ ప్రేరేపిస్తూ ముందుకు సాగుతున్న శ్రీ కోరుకంటి సాయి కృష్ణ విశ్వకర్మ యంగ్ లీడర్ అవార్డు.. తీసుకున్న సందర్భంగా ఈరోజు అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో సాయి కృష్ణ ని సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ జిల్లా అధ్యక్షులు చింతల రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి పడాల నరేష్, ముఖ్య సలహాదారుడు కొత్త పెల్లి రఘు, ఉపాధ్యక్షులు పోనగంటి రంజిత్, గాజోజు సంతోష్, కార్యవర్గ సభ్యులు బొమ్మెన వంశీ, మ్యాదారపు అంజయ్య, బొమ్మేనా గణేష్, మ్యాదారపు చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# మలిదశ ఉద్యమంలో సింగరేణి కార్మికుల పాత్ర కీలకమైనది

**● తెలంగాణ ఇవ్వవలసిన పరిస్థితి కల్పించడంలో సింగరేణి కార్మికులది కీలక భూమిక ● తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ఆవిర్భావ వేడుకలు ● తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కేంద్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇసంపల్లి రమేష్**



**రామగిరి, జూన్ 02(ది క్రైమ్ న్యూస్):-** తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఓసిపి-వన్ , ఓసిపి-టు, అడ్రియాల గని, ఎస్ అండ్ పి సి వివిధ డిపార్ట్మెంట్లలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆర్జీ-త్రీ , ఏపీఏ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బుద్దె సత్యనారాయణ భవన్ సెంటెనరీ కాలనీలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర కమిటీ నాయకులు మాదారపు కేశవరావు అధ్యక్షతన నిర్వహించబడిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కేంద్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇసంపల్లి రమేష్ చే జాతీయ పతాక ఆవిష్కరణ చేయడం జరిగింది. ప్రొఫెసర్ జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించడం, అమరులను స్మరించుకుంటూ వారికి జోహార్లు అర్పించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ మలిదశ ఉద్యమంలో సింగరేణి కార్మికుల పాత్ర కీలకమైనది. ముఖ్యంగా సకల జనుల సమ్మెతో దేశవ్యాప్త పరిశ్రమలకు బొగ్గు కొరత సృష్టించడం ద్వారా కేంద్ర ప్రభుత్వాన్ని మెడలు వంచి తప్పనిసరిగా తెలంగాణ ఇవ్వవలసిన పరిస్థితి కల్పించడంలో సింగరేణి కార్మికులది కీలక భూమిక. తదనంతరం తెలంగాణ రాష్ట్ర పరిపాలనలో కెసిఆర్ సింగరేణి కార్మికులకు తెలంగాణ ఇంక్రిమెంట్ మొదలుకొని, తల్లిదండ్రుల వైద్యం విద్యుత్ చార్జీల రద్దు, 10 లక్షల రుణానికి వడ్డీ మాఫీ, ఏసీల సౌకర్యం, కారుణ్య నియామకాలు ఇలా సింగరేణిని కార్మికులు అడగకుండానే అనేక హక్కులను కల్పించడం జరిగింది. సింగరేణి సంస్థను ఉన్నత స్థితికి తీసుకురావడం జరిగింది. కానీ ప్రస్తుత పరిస్థితి దానికి భిన్నంగా 14 నెలలుగా కారుణ్య నియామకాలను నిలిపివేసి మరోపక్క 54వేల కోట్ల రూపాయలను బకాయిలు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వకుండా సంస్థను జీతాల కోసం బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన దుస్థితికి కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు నెట్టివేశాయి. కాబట్టి సింగరేణి కార్మికులు ఆనాడు ఆత్మ గౌరవం కోసం, అస్తిత్వం కోసం పోరాడి తెచ్చుకున్న తెలంగాణను - ఈనాడు మరొకసారి పోరాడి తెలంగాణను, సింగరేణి సంస్థను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. కావున ఈ పరిస్థితులలో సింగరేణి పరిరక్షణ కోసం తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం అది నాయకత్వం ఇచ్చే పిలుపుతో ఎటువంటి పోరాటానికైనా మరొకసారి సిద్ధంగా ఉండాలని సింగరేణి కార్మికులను కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో రామగిరి మండల పార్టీ అధ్యక్షులు శంకేసి రవీందర్, రామగిరి మండల రైతు సమన్వయ కమిటీ మండల కన్వీనర్ మాధరవేన శారదా కుమార్ , కేంద్ర కమిటీ నాయకులు పాశం శ్రీనివాస్ రెడ్డి, బ్రాంచ్ కమిటీ నాయకులు బొట్ల శివశంకర్, వేరగోని సంతోష్, పొన్నం సదయ్య, బుద్దే ఉదయ్, పట్టణ అధ్యక్షులు కాపరవేన భాస్కర్, గాజుల ప్రసాద్, ఇజ్జగిరి భూమయ్య, రోడ్డ శ్రీనివాస్ , పలకపాటి రామన్న, చేలకల జోహార్, వేగోళపు మల్లయ్య, మేడగోని రాజన్న, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# మలిదశ పోరాటం అవసరం : జనం కోసం అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కరరెడ్డి



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దీప్తిశ్రీనగర్ సర్కిల్‌లో స్థానిక తెలంగాణవాదులు మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుడు, జనం కోసం సంస్థ అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కరరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నో త్యాగాలు, పోరాటాల ఫలితంగా సాధించుకున్న తెలంగాణను స్వార్థపరుల బారిన పడకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ఏర్పాటుకు ప్రధాన కారణమైన నీళ్లు, నిధులు, ఉద్యోగాలు స్థానికులకు అందేలా చేయడం ప్రథమ ప్రాధాన్యత కావాలని పేర్కొన్నారు. తెలంగాణ స్వయంసమృద్ధి సాధన కోసం మలిదశ పోరాటం అవసరమని, యువత, విద్యార్థులు, సబ్బండ వర్గాలు ముందుకు వచ్చి రాష్ట్ర ఆకాంక్షలను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. 1969 తెలంగాణ ఉద్యమంలో పాల్గొని జైలుశిక్ష అనుభవించిన స్థానిక తెలంగాణవాది హన్మంత్‌రావు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణలో వనరులు పరుల చేతుల్లోకి వెళ్లకుండా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. మాజీ సైనికుడు, తెలంగాణవాది నాగం రాజశేఖర్ మాట్లాడుతూ, రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా స్థానికేతరులు చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నారని, ఇటువంటి చర్యలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. జెండా ఆవిష్కరణ అనంతరం అందరూ కలిసి జాతీయ గీతం 'జనగణమన' ఆలపించారు. కార్యక్రమానికి ముందు భారీ ఎత్తున బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచుకుని ఒకరికొకరు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అశోక్ వర్మ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కర్లపూడి రాఘవేందర్ రావు, శివకుమార్ వర్మ, బాలు, సురేష్, నాగరాజు తదితరులతో పాటు దీప్తిశ్రీనగర్ కాలనీవాసులు, వ్యాపార వర్గాల ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ తల్లి సోనియా గాంధీ నిర్ణయంతోనే రాష్ట్ర కల సాకారం

**● తెలంగాణ గళాన్ని ఢిల్లీకి వినిపించిన ఉద్యమ నేత.. నేడు అభివృద్ధికి దిక్సూచి శ్రీధర్ బాబు ● మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్**





**రామగిరి, జూన్ 02(ది క్రైమ్ న్యూస్):-** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రామగిరి మండలం నాగేపల్లి ఎక్స్‌రోడ్ వద్ద కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు తీగల సదయ్య ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన అనేది అమరవీరుల త్యాగాలు, విద్యార్థుల ఉద్యమాలు, ప్రజల సుదీర్ఘ పోరాటాల ఫలితమని అన్నారు. తెలంగాణ ప్రజల దశాబ్దాల ఆకాంక్షను గుర్తించి ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయమే తెలంగాణ ఆవిర్భావానికి కారణమైందని పేర్కొన్నారు. అందుకే తెలంగాణ ప్రజలు ఆమెను గౌరవంగా తెలంగాణ తల్లి గా అభివర్ణిస్తారని అన్నారు. తెలంగాణ ఉద్యమ కాలం నుంచే మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లడంలో, రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియకు బలమైన మద్దతు అందించడంలో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన అనంతరం కూడా మంథని నియోజకవర్గ అభివృద్ధితో పాటు తెలంగాణ పురోగతి కోసం శ్రీధర్ బాబు నిరంతరం కృషి చేస్తున్నారని, యువత ఉపాధి, విద్య, పారిశ్రామిక అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో ఆయన సేవలు ప్రశంసనీయమని అన్నారు. తెలంగాణ సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను ఎల్లప్పుడూ స్మరించుకుంటూ, వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తొట్ల తిరుపతి యాదవ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి ఎల్ల రామ్మూర్తి, మాజీ సర్పంచ్ తీగల సమ్మయ్య, ఎరుకల బాబురావు, సర్పంచ్ కొండవేన దివ్య, ఉప సర్పంచ్ యసం సతీష్, వార్డు సభ్యులు భద్రపు శ్రీనివాస్, పందుల సోము, రాముని గోపాలకృష్ణ, గొల్లపల్లి నరేష్, మట్ట నర్సమ్మ, కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు వేగోళపుసంతోష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వేగోళపు అంజయ్య, వేగోళపు రాయమల్లు, వేగోళపు బాపు, పొన్నం తిరుపతి, మడిపల్లి మొగిలి, ఈదునూరు త్రిమూర్తి, గొల్లపల్లి రాయమల్లు, బొల్లంపల్లి మల్లయ్య, తాటి శ్రీనివాస్, చింతం మహేందర్, రామిండ్ల మోహన్, మల్ల పెల్లి రాజ్ కుమార్, ఎరుకల రాజశేఖర్, పెండం శ్రీనివాస్, తోట రమేష్, తొట్ల సదానందం, పొన్నం శ్రీనివాస్, ముళ్ళ రాజు, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రధానోపాధ్యాయుడిగా పదోన్నతి పొందిన ఆకుల శ్రీనివాస్‌కి ఘన సన్మానం




**రామగిరి, జూన్ 02(ది క్రైమ్ న్యూస్):-** రామగిరి మండలం కల్వచర్ల గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పదోన్నతి పొందిన ఆకుల శ్రీనివాస్ ను గ్రామ సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి శాలువాతో సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, కల్వచర్ల గ్రామ పాఠశాల విద్యార్థుల విద్యాభివృద్ధిలో ఆకుల శ్రీనివాస్ గారు కీలక పాత్ర పోషించి, విద్యార్థులను ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్లే విధంగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఆయన నాయకత్వంలో పాఠశాల మరింత అభివృద్ధి సాధించి, విద్యార్థులు విద్యా రంగంలో ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ ప్రముఖులు, ఉపాధ్యాయులు, ఇతరులు పాల్గొని ఆకుల శ్రీనివాస్ కి అభినందనలు తెలియజేశారు.

# అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

**- సేవా కార్యక్రమాలతో సమాజాభివృద్ధికి లయన్స్ క్లబ్ కృషి**

**- క్లబ్ అధ్యక్షులు మేకల మారుతి యాదవ్**




**రామగిరి, జూన్ 02(ది క్రైమ్ న్యూస్):-** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ ఆధ్వర్యంలో సెంటినరీ కాలనీలోని అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు మేకల మారుతి యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ ప్రాణాలను అర్పించిన అమరవీరుల త్యాగాలను ఎప్పటికీ మరువలేమని అన్నారు. వారి ఆశయాలకు అనుగుణంగా సమాజ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. అలాగే లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ ఆధ్వర్యంలో విద్య, వైద్యం, ఆకలి నివారణ, పర్యావరణ పరిరక్షణ, నేత్రదాన అవగాహన వంటి అనేక సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో కూడా సమాజంలోని అవసరమైన వర్గాలకు మరింత చేరువై సేవా కార్యక్రమాలను క్లబ్ సభ్యుల సహకారంతో విస్తృతంగా చేపట్టేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ మొల్కురి శ్రీనివాస్, క్లబ్ డైరెక్టర్లు మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి, డాక్టర్ శరణ్య, బుద్ధార్తి బుచ్చయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి తోట చంద్రయ్య, కుమారస్వామి, శ్రీనివాసచారి, బోనాల సతీష్, బాలసాని సతీష్ తదితరులు పాల్గొన్నారు..

# బెల్ట్ షాపులపై అరెకపూడి గాంధీ ఉక్కుపాదం





**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్ కాలనీలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ స్వయంగా రంగంలోకి దిగి చర్యలు చేపట్టారు. స్థానిక మహిళల ఫిర్యాదు మేరకు అర్ధరాత్రి అక్కడికి చేరుకున్న ఆయన, బెల్ట్ షాప్ నిర్వాహకులను పట్టుకుని పోలీసు, ఎక్సైజ్ అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ బెల్ట్ షాపుల ద్వారా నకిలీ మద్యం విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడే వారిని ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ప్రశాంతమైన కాలనీల్లో అక్రమ మద్యం విక్రయాలు జరగడం వల్ల కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా నష్టపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి కార్యకలాపాలను అరికట్టడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకునేలా చూస్తామని తెలిపారు. ప్రజల ఆరోగ్యం, భద్రత తనకు అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. సమస్యపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవడంపై స్థానిక మహిళలు, కాలనీ వాసులు పీఏసీ చైర్మన్ గాంధీకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మియాపూర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ డి.ఐ. రమేష్ నాయుడు, ఎస్ఐ కృష్ణయ్య, ఎక్సైజ్ సిబ్బంది, మహిళలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటికి ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణ

**- తెలంగాణను అప్పుల కుంపటిగా మార్చిన ఘనత బిఆర్ఎస్, కాంగ్రెస్ లదే - బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు - జాతీయ జెండా ఆవిష్కరించిన మండల అధ్యక్షుడు కోండు లక్ష్మణ్**



**రామగిరి, జూన్ 02(ది క్రైమ్ న్యూస్):-** రామగిరి మండలంలో బిజెపి పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మండల అధ్యక్షుడు కొండు లక్ష్మణ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కొండులక్ష్మణ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటికి ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణలో అప్పుల కుంపటిగా మార్చిన ఘనత బిఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలకి దక్కిందన్నారు. తెలంగాణ ప్రజలు 10 సంవత్సరాలు దొరల గడీల పాలన చూసారని గత మూడేళ్ల నుండి నిజాం రాజుల పాలన తలపించే కాంగ్రెస్ ప్రభుత్వ పాలన చూస్తున్నారని ఆయన అన్నారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం వడ్లు, మక్కలు కొనుగోలు చేయక రైతులను నానా ఇబ్బందులు పెడుతుందని కట్టింగుల రూపంలో దాదాపు ఒక ఎకరాకు రెండు నుండి మూడు క్వింటాళ్ల ధాన్యం కట్టింగ్ చేయడం ద్వారా రైతు ఒక ఎకరాకు 5000 నుండి 6000 రూపాయలు నష్టపోతుండు అని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు 420 హామీలను తుంగలో తొక్కి కేవలం కాలయాపన చేస్తుందని హైడ్రా పేరుతో పేద ఇండ్లుకూల్చడం మరియు తమ స్వలాభం కోసం ఇండస్ట్రియల్ పార్కుల పేరుతో రైతుల నుండి భూములను లాక్కోవడంలో ఉన్న శ్రద్ధ నియోజకవర్గాల మరియు రాష్ట్ర అభివృద్ధి మీద ఈ నాయకులకు ద్రుష్టి లేదని ఆయన అన్నారు. త్వరలోనే తెలంగాణలో రాక్షస పాలన అంతమై రామరాజ్యం ఏర్పడుతుందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తోట్ల రాజు, ఉపాధ్యక్షుడు నాంసాని మహేష్, కార్యదర్శి కొత్త కమలాకర్, ఓబీసీ అధ్యక్షుడు మైదానం సందీప్, బిజెపి నాయకులు సాయిరాం, ఆదిత్య, చందు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధిలో సిబ్బంది పాత్ర ఎంతో కీలకం

**రాజాపూర్ గ్రామపంచాయతీ సిబ్బందికి దుస్తుల పంపిణీ**

**రాజాపూర్ గ్రామ సర్పంచ్ పుల్లెల భాగ్యలక్ష్మి- కొమరయ్య**



**రామగిరి, జూన్ 02(ది క్రైమ్ న్యూస్):-** రామగిరి మండలం రాజాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామపంచాయతీ సిబ్బందికి దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ పరిశుభ్రత, అభివృద్ధి కార్యక్రమాలలో నిరంతరం సేవలందిస్తున్న సిబ్బంది సేవలను గుర్తిస్తూ రాజాపూర్ గ్రామ సర్పంచ్ వారి సంక్షేమం కోసం ఈ దుస్తులను అందచేసినారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో సిబ్బంది పాత్ర ఎంతో కీలకమైందని, వారి కృషి వల్లే గ్రామం పరిశుభ్రంగా, అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని తెలిపారు. సిబ్బంది సంక్షేమానికి ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పుల్లెల భాగ్యలక్ష్మి- కొమరయ్య, గ్రామ , వార్డు సభ్యురాలు పుల్లెల సుజాత కాల్వ రజిత శ్రీనివాస్ వార్డ్ సభ్యులు కన్నూరి శేషి కుమార్ పుట్ట లక్ష్మి, పుట్ట సంతు, కాదాచి ఓదమ్మా రమేష్, కలవేనా స్వరూప రమేష్ గ్రామ పంచాయతీ కార్యదర్శి దాసరపు కిరణ్ గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు. సిబ్బంది పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఆంధ్రప్రదేశ్

## వేలేరుపాడులో అగ్నిప్రమాదం

### ఇద్దరు మహిళల సజీవ దహనం

ఏలూరు,జూన్2 : వేలేరుపాడులో మండలంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. వేలేరుపాడులో జరిగిన అగ్నిప్రమాదంలో ఇద్దరు మహిళలు ప్రాణాలు కోల్పోగా, రెండు పూరిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ఘటనపై పోలీసులకు, అగ్నిమాపక అధికారులకు సమాచారం అందజేశారు. సమాచారం అందగానే సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పూరిళ్లలో ఒక్కసారిగా మంటలు ఒక్కసారిగా వ్యాపించాయి. మంటలు భారీగా ఎగసిడపటంతో ఇళ్లలో ఉన్న ఇద్దరు మహిళలు బయటకు రాలేక మృతి చెందినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు విచారణ చేపట్టారు. మృతుల వివరాలు, అగ్నిప్రమాదానికి కారణాలపై మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

## అభివృద్ధిపై జగన్ నీతులు విడ్డూరం

### అమరావతిపై విషం చిమ్ముతూనే ఉన్నారు

### మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

అమరావతి,జూన్2 : రాజధాని అమరావతిపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ అనుసరిస్తున్న వైఖరిపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం రాజధాని అమరావతిలో మంత్రి మాట్లాడుతూ.. అమరావతి గురించి వైఎస్ జగన్ చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా బాధ్యతారాహిత్యమైనవన్నారు. ప్రపంచ స్థాయి రాజధానిని ఐదేళ్ల పాలనలో అల్లకల్లోలం చేసింది గత వైసీపీ ప్రభుత్వమేనని ఆయన గుర్తు చేశారు. రాజధాని నిర్మాణాన్ని అర్ధంతరంగా నిలిపివేసి ఇప్పుడు అభివృద్ధిపై నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందంటూ జగన్ తీరును ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు. మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని అయోమయంలోకి నెట్టి.. ఇప్పుడు మావిగన్ అంటూ మాయ మాటలు చెప్తున్నారంటూ జగన్‌పై మంత్రి రాంప్రసాద్ రెడ్డి నిప్పులు చెరిగారు. అమరావతి రైతులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కింది గత వైసీపీ పాలనలోనే అని విమర్శించారు. రాజధాని ప్రాంతంలో అభివృద్ధి పనులు నిలిపి వేసి.. తద్వారా వేలాది కుటుంబాలను ఇబ్బందులకు గురి చేశారంటూ జగన్ తీరును మంత్రి మండిపల్లి తుర్పారబట్టారు. మరావతికి భూములు ఇచ్చిన రైతుల విశ్వాసాన్ని దెబ్బతీశారంటూ ఆ పార్టీ అగ్రనేతలపై మంత్రి నిప్పులు చెరిగారు. ఐదేళ్లు అధికారంలో ఉండి రాజధాని అభివృద్ధికి ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదన్నారు. ఇప్పుడు అమరావతిపై అసత్యాలు ప్రచారం చేసి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారంటూ జగన్ వైఖరిని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వివరించారు. అమరావతి నిర్మాణానికి కేంద్రం, రాష్ట్రం కలిసి వేగంగా చర్యలు చేపడుతున్నాయని పేర్కొన్నారు. ఉాజధాని అభివృద్ధిని అడ్డుకున్న వారే అవినీతి గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని మంత్రి రాంప్రసాద్ రెడ్డి వ్యంగ్యంగా అన్నారు. వైసీపీ హయాంలో నిలిచిపోయిన పనులను కూటమి ప్రభుత్వం తిరిగి ప్రారంభించిందన్నారు. అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి మండిపల్లి స్పష్టం చేశారు. రైతుల ఆకాంక్షలు, రాష్ట్ర ప్రజల ఆశయాలకు అనుగుణంగా రాజధాని నిర్మాణం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అమరావతి అభివృద్ధిని ఎవరూ అడ్డుకోలేరని.. ఇది రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించిన అంశమన్నారు. జగన్ చేసిన విధ్వంసాన్ని సరిదిద్దుతూ అమరావతిని తిరిగి గాడిలో పెడుతున్నామని ఆయన వివరించారు. రాజధానిపై రాజకీయాలు కాకుండా రాష్ట్రాభివృద్ధిపై దృష్టి పెట్టాలని వైఎస్ జగన్‌కు ఆయన సూచించారు. అమరావతి రాష్ట్ర గౌరవానికి ప్రతీక, దాని నిర్మాణాన్ని పూర్తి చేయడం ప్రభుత్వ బాధ్యత అని వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు.

## బంగ్లాదేశ్‌కు లక్షల మంది చొరబాటుదారులు

### బెంగాల్ నుంచి వెళ్లిపోతున్న అక్రమదారులు

సోనార్‌పూర్, జూన్ 2 : బంగ్లాదేశ్ నుంచి మన దేశంలోకి అక్రమంగా వలస వచ్చిన వారు తిరిగి వెళ్లడంపై దేశవ్యాప్తంగా భిన్నమైన చర్చ జరుగుతోంది. పాతికేళ్లకిందట వచ్చి ఇక్కడే కుటుంబాలను ఏర్పాటు చేసుకున్న వారిపై సానుభూతి చూపించాలని కొంత మంది అంటున్నారు. అయితే వారిని వెనక్కి పంపేయాలని చాలా మంది అభిప్రాయపడుతున్నారు. బంగ్లాదేశ్ ఏర్పడిన 1971 యుద్ధం తర్వాత మొదలైన వలసల పరంపర నేటికీ ఆగలేదు. వివిధ ప్రభుత్వ నివేదికలు . అంతర్గత విశ్లేషణల ప్రకారం, భారతదేశంలో ప్రస్తుతం సుమారు 1.5 కోట్ల నుండి 2 కోట్ల మంది అక్రమ బంగ్లాదేశ్ పౌరులు నివసిస్తున్నారని అంచనా. కేవలం పశ్చిమ బెంగాల్‌లోనే ఏటా లక్షలాది మంది సరిహద్దులు దాటుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. దశాబ్దాల క్రితం వచ్చిన వారు ఇక్కడి స్థానిక రాజకీయ అండదండలతో రేషన్ కార్డులు, ఓటర్ ఐడీలు, ఆధార్ కార్డులు వంటి ఫోర్జరీ పత్రాలు సృష్టించుకుని భారతీయ పౌరులుగా చలామణి అవుతుండటం ఇప్పుడు అసలు చిక్కుగా మారింది. ఇంత పెద్ద ఎత్తున చొరబాట్లు జరుగుతున్నా ఇన్నాళ్లూ ఎందుకు ఉపేక్షించారన్న దానికి ప్రధాన కారణం ఓటు బ్యాంక్ రాజకీయం. సరిహద్దు రాష్ట్రాల్లోని కొన్ని రాజకీయ పార్టీలు ఈ చొరబాటుదారులను తమ శాశ్వత ఓటు బ్యాంకులుగా మార్చుకోవడానికి వారికి రక్షణ కల్పించడమే కాకుండా, భారతీయ గుర్తింపు పత్రాలు లభించేలా సహకరించాయి. 4,096 కిలోమీటర్ల పొడవైన భారత్-బంగ్లాదేశ్ సరిహద్దులో చాలా ప్రాంతం నదీ తీరాలు, చిత్తడి నేలలు కావడం కూడా చొరబాటుదారులకు వరంగా మారింది. ఆర్థిక ఇబ్బందులు, మతపరమైన వేధింపులు , మెరుగైన ఉపాధి కోసం బంగ్లాదేశీయులు భారత్‌ను లక్ష్యంగా చేసుకున్నారు.మన దేశంలోని వనరులు మన పౌరులకే సరిపోని తరుణంలో, కోట్లాది మంది అక్రమ వలసదారులకు ఉచిత రేషన్, వైద్యం, విద్య, గృహనిర్మాణ పథకాలు కల్పించడం దేశ ఆర్థిక వ్యవస్థకు పెను భారం. సామాన్య భారతీయుడు చెల్లించే పన్నుల ద్వారా లభించే సంక్షేమ ఫలాలు చొరబాటుదారుల పాలవ్వడం ప్రజాస్వామ్య విరుద్ధమనే వాదన ఇప్పుడు బలంగా వినిపిస్తోంది. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్, అస్సాం వంటి రాష్ట్రాల్లో జనాభా మార్పిడి జరిగి, స్థానిక భూమిపుత్రులు మైనారిటీలుగా మారుతున్నారనే ఆందోళన పెరుగుతోంది. మానవతా దృక్పథం పేరుతో సానుభూతి చూపే వారు.. వీరు పాతికేళ్ల నుంచి ఇక్కడే ఉంటున్నారని, వారి పిల్లలు ఇక్కడే పుట్టారని వాదిస్తున్నారు. అయితే, చట్టపరంగా చూస్తే అక్రమ ప్రవేశం ఎప్పటికీ అక్రమమే అవుతుంది. అక్రమంగా వచ్చిన వారు మన దేశం పట్ల విధేయులుగా ఉంటారని గ్యారెంటీ లేదు. దేశ భద్రతా కోణంలో చూస్తే, ఉగ్రవాద మూలాలున్న శక్తులు ఈ చొరబాటుదారుల ముసుగులో దేశంలోకి ప్రవేశించే ప్రమాదం ఉంది. జాతీయ భద్రత, పౌరుల ప్రయోజనాల ముందు వ్యక్తిగత సానుభూతికి తావు లేదని ఢిల్లీ పెద్దలు డిటెక్ట్, డిలీట్, డిపోర్ట్ విధానాన్ని వేగవంతం చేస్తున్నారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఇటీవల చేపట్టిన హోల్డింగ్ సెంటర్ల ఏర్పాటు చేయడంతో బంగ్లాదేశీయులు.. స్వదేశానికి వెళ్లిపోతున్నారు.

# బెంగాల్‌లో ట్రీట్మెంట్ అందడం లేదు

### అభిషేక్ బెనర్జీని హైదరాబాద్‌కు తరలిస్తాం

### మాజీ సీఎం మమతా బెనర్జీ వెల్లడి



సోనార్‌పూర్, జూన్ 2 : పశ్చిమ బెంగాల్ రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. తృణమూల్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ అభిషేక్ బెనర్జీపై దక్షిణ 24 పరగణా జిల్లాలోని సోనార్‌పూర్‌లో శనివారం జరిగిన దాడి రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది. ఈ ఘటన తర్వాత తృణమూల్ కాంగ్రెస్, బీజేపీల మధ్య పరస్పర ఆరోపణలు, ప్రత్యారోపణలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. పలు ప్రతిపక్ష పార్టీల నేతలు సైతం అభిషేక్ బెనర్జీపై దాడిని తీవ్రంగా ఖండించారు. మమతా బెనర్జీ మేనల్లుడు, ఎంపీ అభిషేక్ బెనర్జీ ఎన్నికల అనంతరం జరిగిన హింసతో ప్రభావితమైన కుటుంబాలను పరామర్శించడానికి సోనార్‌పూర్‌లో వెళ్లారు. ఈ సమయంలో ఆయన కాన్వాయ్‌పై, ఇటుకలు, రాళ్లు, గుడ్లు విసిరారని ఆరోపణలు వచ్చాయి. ఈ దాడిని బీజేపీ కార్యకర్తలు చేశారని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ, అభిషేక్ బెనర్జీతో పాటు మాజీ సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. దాడి తర్వాత అభిషేక్ బెనర్జీ మీడియాతో మాట్లాడుతూ తనపై హత్యాయత్నం జరిగిందని చెప్పారు. "వారు నన్ను చంపాలనుకున్నారు. మొత్తం ఘటన కెమెరాలో రికార్డయింది. ఈ విషయాన్ని బెంగాల్ హైకోర్టు, గవర్నర్‌కు తెలియజేస్తాం. కోర్టుకు ఆశ్రయించి న్యాయం కోరతాం. అవసరమైతే సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేస్తాను" అని అన్నారు. ఈ దాడిని బీజేపీ చేయించిందని, భద్రతా వ్యవస్థలో కావాలనే లోపం చేశారని ఆరోపించారు. ఇదే బీజేపీ చెప్పే ప్రజాస్వామ్యం. ఎన్నికల ఫలితాలు వచ్చి నెల కూడా కాలేదు, పోలీసులు ఎక్కడా కనిపించడం లేదని అభిషేక్ అన్నారు. అభిషేక్ బెనర్జీ తనతో ఉన్న భద్రతా సిబ్బంది దాడి గురించి పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం అందించారని, అయినప్పటికీ కావాల్సినంత పోలీసు బలగాలు సంఘటనా స్థలానికి చేరుకోలేదని ఆరోపించారు. భద్రతా అధికారులు నిరంతరం సమాచారం ఇస్తున్నా పోలీసులు రాకపోతే, ఈ ఘటన జరగాలని ఉన్నతాధికారులు కోరుకున్నారని తేలిపోయిందన్నారు. మా దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయి, మేము కోర్టును ఆశ్రయిస్తాం అన్నారు. అభిషేక్ బెనర్జీపై జరిగిన దాడిని ప్రజాస్వామ్యంపై దాడిగా రాహుల్ గాంధీ అభివర్ణించారు. టీఎంసీ ఎంపీపై దాడి కేవలం ఒక వ్యక్తిపై దాడి కాదని, ఇది ప్రజాస్వామ్యం, ప్రజల తీర్పుపై దాడిగా పేర్కొన్నారు. ఇది బీజేపీ ప్రతీకార రాజకీయాలకు ఉదాహరణ అని అన్నారు.మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా ఈ ఘటనపై తీవ్రంగా స్పందించారు. బెంగాల్‌లో పాలకులు హంతకులుగా మారారు, ఇలాంటి పనులు చేయడానికి బీజేపీ సిగ్గుపడాలన్నారు. బెంగాల్‌లో డాక్టర్లు సైతం బీజేపీ నేతల మాటలు వింటున్నారని, తన మేనల్లుడు అభిషేక్ బెనర్జీకి చికిత్స అందించడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం నుంచి ఆదేశాల కోసం డాక్టర్లు ఎదురుచూస్తున్నారని, ఓ ఎంపీకి ట్రీట్మెంట్ కూడా ఇప్పించలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అవసరమైతే అభిషేక్ బెనర్జీని హైదరాబాద్‌కు తరలించి మెరుగైన వైద్యం అందిస్తామని రాహుల్ గాంధీ మాటిచ్చారని మమత తెలిపారు. దాడి చేసిన వారు తనపై ఇటుకలు, రాళ్లు, గుడ్లు విసిరారని, దాంతో తనకు గాయాలయ్యాయని ఎంపీ అభిషేక్ తెలిపారు. కంటికి ఇటుక తగిలి గాయమైంది. కన్ను సరిగ్గా తెరవలేకపోతున్నాను. హెల్మెట్ ధరించకపోతే తన తల రెండు ముక్కలయ్యేదన్నారు. మీరు నన్ను చంపవచ్చు.. కానీ నా ధైర్యాన్ని, పోరాటాన్ని మాత్రం అణచివేయలేరని అన్నారు. ఎంపీ డెరెక్ ఒబ్రియన్ కేంద్ర ప్రభుత్వం, హోం మంత్రిత్వ శాఖపై ప్రశ్నలు లేవనెత్తారు. ఇటీవల బెంగాల్‌లో ఓట్ల లెక్కింపు రోజున అభిషేక్ బెనర్జీ భద్రతను ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. ప్రతిపక్షంలో పెద్ద పార్టీకి చెందిన పార్లమెంటరీ నేతపై దాడి జరగడం తీవ్రమైన విషయమని అన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఈ ఘటనను ఖండించారు. రాజకీయ విభేదాలు ఎప్పుడూ హింసకు దారి తీయకూడదని సూచించారు. ఒక ప్రముఖ ప్రతిపక్ష పార్టీలో కీలక నేతకు తగినంత భద్రత కల్పించకపోవడం ఆందోళన కలిగించే విషయం అన్నారు.

## రాష్ట్రాలు రెండయినా జాతి ఒక్కటే

### తెలంగాణ ఆవిర్భావ శుభాకాంలు తెలిపిన సిఎం, డిప్యూటి సిఎం

అమరావతి : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రాంతాలుగా రెండు రాష్ట్రాలు ఏర్పడినా.. తెలుగుజాతి అంతా ఎప్పటికీ ఒక్కటే అని సీఎం అన్నారు. మూడున్నర కోట్ల మంది ప్రజల ఆశలు, ఆకాంక్షలతో యువత బలిదానాలతో సిద్ధించిన రాష్ట్రం తెలంగాణ అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. 'తెలుగు ప్రజలకు రెండు రాష్ట్రాలు ఏర్పడి నేటికి 12 ఏళ్లు. ప్రాంతాలుగా రెండు రాష్ట్రాలు ఏర్పడినా... తెలుగు జాతి అంతా ఎప్పటికీ ఒక్కటే. అటు తెలంగాణ, ఇటు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో పోటీ పడి దూసుకుపోవాలి. ఎంతో చరిత్ర, సాంస్కృతిక నేపథ్యం ఉన్న తెలుగు గడ్డ భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలి. తెలంగాణ రాజధాని హైదరాబాద్, ఏపీ రాజధాని అమరావతి ప్రపంచంలోనే అత్యుత్తమ నగరాలుగా వెలగాలి. ప్రతి తెలుగు కుటుంబానికి అభివృద్ధి ఫలాలు దక్కాలి. అత్యుత్తమ జీవన ప్రమాణాలు పొందాలి. వికసిత్ భారత్ 2047 లక్ష్యంలో మన రెండు రాష్ట్రాలు కలిసి పని చేసి, కీలక భూమి పోషించి తెలుగు వైభవాన్ని, ప్రాభవాన్ని చాటాలి' అంటూ సీఎం చంద్రబాబు పోస్ట్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఏపీ డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. 'మూడున్నర కోట్ల మంది ప్రజల ఆశలు, ఆకాంక్షలతో యువత బలిదానాలతో సిద్ధించిన రాష్ట్రం తెలంగాణ. ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించి పుష్కర కాలం పూర్తయిన సందర్భంగా యావత్ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు. జనసేన ఊపిరులూదుకున్నది తెలంగాణ గడ్డపైనే. ఈ నేల నుంచే వారసత్వంగా పోరాట పటిమను పుణికి పుచ్చుకున్నది. అణగారినవర్గాల సంక్షేమం, యువత ఆకాంక్షలు, వ్యక్తి స్వేచ్ఛకు విఘాతం కలిగితే గళం వినిపించే తెగువ తెలంగాణలో ఉంది. అటువంటి లక్షణం జనసేన శ్రేణుల్లోనూ నిండుగా ఉంది. ఘనమైన చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంపద విలసిల్లే తెలంగాణ రాష్ట్రం సమున్నతంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నాను. తెలంగాణ కోసం బలిదానం చేసిన ప్రతి ఒక్కరికీ అంజలి ఘటిస్తున్నాను' అంటూ పవన్ కల్యాణ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## పుష్కరాలకు పకడ్బందీగా ఏర్పాట్లు

### భక్తులకు లోటు రాకుండా చర్యలు చేపట్టాలి

### పుష్కరాల ఏర్పాట్లపై చంద్రబాబు సమీక్ష

అమరావతి,జూన్2 : పుష్కరాల్లో భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనపై దృష్టి సారించాలని సిఎం చంద్రబాబు అన్నారు. భద్రత, ట్రాఫిక్, పారిశుద్ధ్యంపై ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. గోదావరి పుష్కరాలు-2027 ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు నాయుడు మంగళవారం సమీక్ష నిర్వహించారు. వెలగపూడి సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘంతో కీలక సమావేశం నిర్వహించారు. 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు గోదావరి పుష్కరాలు జరుగనున్నాయి. పుష్కరాల నిర్వహణ ఏర్పాట్లపై అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. పుష్కరాల కోసం మౌలిక వసతుల అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. నీటి వనరులు, రోడ్లు, ఆరోగ్య శాఖల సమన్వయంపై సమావేశంలో చర్చించారు. పుష్కర ఘాట్ల అభివృద్ధిపై అధికారులతో సీఎం సమీక్ష జరిపారు. పుష్కరాల నిర్వహణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశానికి ఎండోమెంట్స్ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి , నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, హోం మంత్రి వంగలపూడి అనిత, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హాజరవగా.. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వర్చువల్‌గా హాజరయ్యారు. అలాగే సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, గోదావరి పుష్కరాల నోడల్ అధికారి వీరపాండియన్ సమీక్షకు హాజరయ్యారు.

## బీజేపీకి సింగం అన్నామలై గుడ్‌బై!

### తదుపరి కొత్త పార్టీ ఏర్పాటుపై దృష్టి

### సొంత పార్టీతో ఉపఎన్నికల్లో పోటీ!!

కోయంబత్తూరు : తమిళనాడు రాజకీయాల్లో సంచలన మార్పు చోటుచేసుకుంది. దేశవ్యాప్తంగా ఎంతో క్రేజ్ సంపాదించుకున్న ఐపీఎస్ మాజీ అధికారి, తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు కే. అన్నామలై ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, జాతీయ ప్రధాన కార్యదర్శి బి.ఎల్. సంతోష్‌లను కలిసి తన 5 పేజీల రాజీనామా లేఖను సమర్పించారు. కొద్ది రోజులుగా అన్నామలై తదుపరి అడుగులపై సాగుతున్న ఉత్కంఠకు ఈ నిర్ణయంతో తెరపడింది. గత ఆరేళ్లుగా తమిళనాట బీజేపీకి 'స్టార్' ఇమేజ్ తెచ్చిన అన్నామలై, తాజాగా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌ను కలిసి రాజీనామా లేఖను అందజేశారు. ఐదు పేజీల సుదీర్ఘ లేఖలో ఆయన పార్టీ కేంద్ర నాయకత్వంతో తనకు ఉన్న వ్యూహాత్మక విభేదాలను స్పష్టంగా ప్రస్తావించినట్లు తమిళ మీడియా వర్గాలు చెబుతున్నాయి. ప్రత్యేకించి ఇటీవలి శాసనసభ ఎన్నికల్లో ఏఐఏడీఎంకే తో పొత్తు పెట్టుకోవాలన్న ఢిల్లీ పెద్దల నిర్ణయంపై ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. బీజేపీ స్వతంత్రంగా ఎదగాలని తాను కోరుకుంటే, అధిష్ఠానం మాత్రం ద్రావిడ పార్టీలపై ఆధారపడటాన్ని ఆయన జీర్ణించుకోలేకపోయారు.తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక, సీట్ల కేటాయింపులో అన్నామలై అభిప్రాయాలను కేంద్ర నాయకత్వం పక్కన పెట్టింది. తనకు కేవలం ఆరు స్థానాల బాధ్యతలు మాత్రమే అప్పగించడంపై ఆయన తీవ్ర అసంతృప్తి చెందారు. ఫలితంగా జరిగిన ఎన్నికల్లో బీజేపీ కేవలం ఒక్క స్థానానికే పరిమితం కావడం, పార్టీ ఘోర పరాజయం పాలుకావడంతో అన్నామలై వాదన నిజమైంది. బీజేపీలో తనకు తగినంత స్వేచ్ఛ, భవిష్యత్తు లేవని భావించిన ఆయన, సుదీర్ఘ చర్చల అనంతరం కమలం గూటి నుంచి బయటకు రావడమే ఉత్తమమని భావించారు.అన్నామలై రాజకీయాల నుంచి తప్పుకోవడం లేదు, పైగా మరింత దూకుడు పెంచబోతున్నారు. రాబోయే ఉపఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా లేదా సరికొత్త వేదిక ద్వారా పోటీ చేసేందుకు ఆయన సన్నాహాలు చేసుకుంటున్నారు. రాబోయే 6 నుంచి 8 నెలల కాలంలో ఒక కొత్త ప్రాంతీయ పార్టీని స్థాపించే యోచనలో ఆయన ఉన్నారు. తమిళ అస్తిత్వం – జాతీయ దృక్పథం అనే సరికొత్త స్లోగన్‌తో, ఒక సెక్యులర్ ప్లాట్‌ఫామ్‌ను సిద్ధం చేయడమే ఆయన తదుపరి కార్యాచరణగా తెలుస్తోంది. ప్రముఖ నటుడు విజయ్ రాజకీయ అరంగేట్రం చేసి ఘనవిజయం సాధించడంతో తమిళనాడు రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. ద్రావిడ పార్టీలైన డీఎంకే, ఏఐఏడీఎంకే , బీజేపీలకు ప్రత్యామ్నాయంగా ఒక కొత్త శక్తి వైపు యువత మొగ్గు చూపుతోందని అన్నామలై గమనించారు. బీజేపీ సిద్ధాంతాల ముద్ర వల్ల తమిళనాడులో ఎదగడం కష్టమని గ్రహించిన ఆయన, విజయ్ తరహాలోనే ద్రావిడ సంస్కృతి, అవినీతి రహిత పాలన అజెండాతో యువతను ఆకట్టుకోవాలని చూస్తున్నారు. ఇప్పటికే పలువురు యువ నిపుణులు, అసంతృప్త నేతలు ఆయనతో టచ్‌లోకి వెళ్లినట్లు సమాచారం. తమిళనాడు బీజేపీకి అన్నామలై రాజీనామా చేయడం ఆ పార్టీకి కోలుకోలేని దెబ్బే. ఐపీఎస్ ఉద్యోగాన్ని వదిలి రాజకీయాల్లోకి వచ్చిన ఈ యువనేత, ఇప్పుడు బీజేపీ చట్రం నుంచి బయటకు వచ్చి ఒంటరి పోరాటానికి సిద్ధమయ్యారు. కోయంబత్తూరుతో సహా తమిళనాడు అంతటా ఆయన మద్దతుదారులు ఇప్పటికే అన్నామలై 2.0 పోస్టర్లతో హల్‌చల్ చేస్తున్నారు. మరి ఈ సింగం సొంతంగా పార్టీ పెట్టి ద్రావిడ కోటలను బద్దలు కొడుతుందో లేదో చూడాలి.

## ఐరాస సంస్కరణల్లో సభ్య దేశాలు కీలకం

### సభ్య దేశాల ప్రాధాన్యత, పారదర్శకత అవసరం

### ఐరాసాలో భారత శాశ్వత ప్రతినిధి వెల్లడి

న్యూఢిల్లీ,జూన్2 : ఐక్యరాజ్యసమితి చేపడుతున్న సంస్కరణల సందర్భంగా సభ్య దేశాల ప్రాధాన్యతలకు అత్యున్నత స్థానం కల్పించాలని భారత్ స్పష్టం చేసింది. ప్రపంచ అభివృద్ధి కార్యక్రమాల్లో ఆ దేశాల జాతీయ యాజమాన్యాలే కేంద్రబిందువుగా కొనసాగాలని ఐరాసాలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ పేర్కొన్నారు. ఐరాస ఆర్థిక, సామాజిక మండలి (ఈసీఓఎస్?ఓసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన అభివృద్ధి కార్యకలాపాల విభాగ సమావేశంలో ఈ అంశాన్ని ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఐరాస డిప్యూటీ సెక్రటరీ, యునైటెడ్ నేషన్స్ సస్టైయినబుల్ డెవలప్‌మెంట్ గ్రూప్ చైర్ అమీనా జె. మహమ్మద్‌తో చర్చలు జరిపినట్లు హరీశ్ తెలిపారు. ఐరాస కార్యకలాపాల్లో అభివృద్ధి విభాగానికి ఉన్న ప్రాధాన్యతను కొనసాగించాలని పర్వతనేని హరీశ్ కోరారు. అభివృద్ధి కార్యక్రమాలు ఆయా దేశాల అవసరాలు, ప్రాధాన్యతలు, విధానాల ఆధారంగానే అమలు కావాలని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతం కావాలంటే వాటి రూపకల్పన, అమలులో సభ్య దేశాల పాత్ర కీలకమని పేర్కొన్నారు. అందుకే సభ్య దేశాల జాతీయ భావనను ఎట్టి పరిస్థితుల్లోనూ బలహీనపరచకూడదని స్పష్టం చేశారు. ఇక ఐరాస రెసిడెంట్ కోఆర్డినేటర్ వ్యవస్థలో చేపట్టే మార్పులు, సంస్కరణలు సభ్య దేశాల అభివృద్ధి లక్ష్యాలకు మరింత సహకరించేలా ఉండాలని పర్వతనేని హరీశ్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం కొనసాగుతున్న చర్చలు అభివృద్ధి కార్యక్రమాల సామర్థ్యాన్ని పెంచే దిశగా సాగాలని సూచించారు. ఏమైనా పునర్?వ్యవస్థీకరణలు చేపట్టినా అవి దేశాలకు అందించే అభివృద్ధి సహాయాన్ని బలోపేతం చేయాలని అన్నారు. అలాగే కార్యక్రమాల అమల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా ఉండాలని పర్వతనేని హరీశ్ పేర్కొన్నారు. రెసిడెంట్ కోఆర్డినేటర్ వ్యవస్థ భవిష్యత్ నిధుల సమీకరణ, పాలన విధానాలపై చర్చలు జరుగుతున్న నేపథ్యంలో పారదర్శకత, జవాబుదారీతనం అత్యంత అవసరమని తెలిపారు. ఈ వ్యవస్థ ద్వారా సభ్య దేశాలకు ఎంత మేర ప్రయోజనం కలుగుతోందో సమగ్రంగా అంచనా వేయాలని సూచించింది. అభివృద్ధి కార్యక్రమాలపై వాస్తవ ప్రభావాన్ని విశ్లేషించిన తర్వాతే భవిష్యత్ నిర్ణయాలు తీసుకోవాలని భారత్ కోరింది. 1948 నుంచి ఐరాస శాంతి భద్రతా కార్యక్రమాల్లో భారత్ కీలక భాగస్వామిగా కొనసాగుతోందని శాశ్వత మిషన్ తెలిపింది. ఇప్పటివరకు 50కి పైగా ఐరాస శాంతి మిషన్లకు దాదాపు మూడు లక్షల మంది భారత సైనికులను పంపిందని పేర్కొంది. అంతర్జాతీయ శాంతి, భద్రతల పరిరక్షణ కోసం 184 మంది భారతీయ శాంతి భద్రతా సిబ్బంది అత్యున్నత త్యాగం చేసినట్లు భారత శాశ్వత మిషన్ వెల్లడించింది. ఈ సందర్భంగా 2025 సంవత్సరానికి గాను 'మిలిటరీ జెండర్ అడ్వకేట్ ఆఫ్ ది ఇయర్ అవార్డు' అందుకున్న మేజర్ అభిలాష బరాక్‌ను కూడా ఐరాస సత్కరించింది. ప్రస్తుతం ఆమె లెబనాన్‌లోని ఐరాస తాత్కాలిక దళంలో విధులు నిర్వహిస్తున్నారు.

## తెలంగాణ ప్రశాంతంగా ఉండటం ఇష్టం లేదా పవన్

### తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

హైదరాబాద్, జూన్ 2 : ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2న హైదరాబాద్‌లో జనసేన పార్టీ కార్యక్రమం నిర్వహించాలన్న నిర్ణయంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చర్య ద్వారా తెలంగాణ, ఆంధ్ర ప్రజల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నారా? అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలకు అత్యంత పవిత్రమైన రోజున సభ పెట్టడం ద్వారా పవన్ కల్యాణ్ ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారని నిలదీశారు. తెలంగాణ ప్రశాంతంగా ఉండటం పవన్‌కు ఇష్టం లేదా అని ఆయన ప్రశ్నించారు. జనసేన తలపెట్టిన కార్యక్రమానికి పోలీసులు అనుమతి నిరాకరించిన విషయాన్ని కూడా ఆయన గుర్తుచేశారు.



# మ్యాజికల్ మే అంటూ త్రిష పోస్ట్..

స్టార్ హీరోయిన్ త్రిష తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఫొటోలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. తనకు ఎంతో ఇష్టమైన 'మ్యాజికల్ మే' నెల జ్ఞాపకాలను, ఫొటోలను అభిమానులతో పంచుకున్నారు. "40 ఏళ్ల వయసులో 25 ఏళ్ల అమ్మాయిలా కనిపించడం గొప్ప కాదు.. 20 ఏళ్ల వయసులో ఉన్న యువతులు 40 ఏళ్ల ప్రాయాన్ని చూసి భయపడకుండా, ఆ వయసు కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూసేలా చేయడమే నా లక్ష్యం" అనే వ్యాఖ్యను కూడా జత చేశారు. దీంతో అది చూసిన వారంతా విజయ్ సీఎం అవ్వడంతో మ్యాజికల్ మే అని క్యాప్షన్ పెట్టారని చర్చించుకుంటున్నారు. వీరి రిలేషన్‌పై ఈ పోస్ట్‌తో హింట్ ఇచ్చారని అంటున్నారు.

# పెద్ది కౌంట్ డౌన్ స్టార్ట్..

ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో మోస్ట్ అవైటెడ్ మూవీ 'పెద్ది' ప్రీ-రిలీజ్ ఈవెంట్ నిన్న రాత్రి ఒక రేంజ్‌లో జరిగింది. సినిమా రిలీజ్‌కు కేవలం 48 గంటల ముందే ఫ్యాన్స్ సందడితో ఆ ప్రాంతమంతా హోరెత్తిపోయింది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, జాన్వీ కపూర్, ఏఆర్ రెహమాన్ ఒకే వేదికపై మెరవడంతో సోషల్ మీడియాలో ఈ సినిమా టాప్ ట్రెండింగ్‌లోకి వచ్చేసింది. ఫ్యాన్స్ తాకిడి ఏ స్థాయిలో ఉందంటే.. సెక్యూరిటీని కంట్రోల్ చేయడం పోలీసులకు తలకు మించిన భారమైంది. తమ ఫేవరెట్ స్టార్స్‌ను చూసేందుకు వేరే రాష్ట్రాల నుంచి కూడా అభిమానులు తరలివచ్చారు. ఈ జోష్ చూస్తుంటే జూన్ 4న థియేటర్లలో రికార్డు స్థాయి ఓపెనింగ్స్ ఖాయమనిపిస్తోంది. అన్ని ఏరియాల్లోనూ సినిమాకు భారీ ఆక్యుపెన్సీ ఉంటుందని ట్రేడ్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈవెంట్‌లో రామ్ చరణ్ చాలా కాన్ఫిడెంట్‌గా కనిపించారు. టెక్నికల్ టీమ్ పనితీరును మెచ్చుకుంటూనే, తన క్యారెక్టర్ మరియు కథలోని ఎమోషన్ గురించి గొప్పగా చెప్పారు. ఈ సినిమా ప్రేక్షకులకు ఒక 'సినిమాటిక్ ఫీస్ట్'లా ఉంటుందని ఆయన ఇచ్చిన హామీ ఫ్యాన్స్‌లో అంచనాలను అమాంతం పెంచేసింది. సినిమాకు గ్లోబల్ మ్యూజికల్ టచ్ ఇచ్చినందుకు ఏఆర్ రెహమాన్‌కు చరణ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన గ్రేస్‌ఫుల్ లుక్స్‌తో జాన్వీ కపూర్ అందరి మనసు గెలుచుకుంది. స్టేజ్‌పై ఆమె చేసిన డ్యాన్స్ వీడియోలు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో క్షణాల్లో వైరల్ అయ్యాయి. ఇక ఏఆర్ రెహమాన్ తన లైవ్ పర్ఫార్మెన్స్‌తో ఆడియన్స్‌ను మంత్రముగ్ధులను చేశారు. ఈ సినిమాకు రెహమాన్ మ్యూజిక్ మెయిన్ హైలైట్‌గా నిలవడమే కాకుండా, ప్రేక్షకులను థియేటర్లకు రప్పించడంలో కీలక పాత్ర పోషించనుంది.









# కొత్త మలుపు టీజర్ రిలీజ్

ప్రముఖ గాయని సునీత తనయుడు ఆకాష్ హీరోగా నటించిన తాజా చిత్రం 'కొత్త మలుపు'. జూన్ 12న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. భైరవి అర్థ్యా కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి శివ వరప్రసాద్ కేశనకుర్తి దర్శకత్వం వహించగా, తాటి బాలకృష్ణ నిర్మిస్తున్నారు. తథాస్తు క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మించిన ఈ మూవీని మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ విడుదల చేయనుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో చిత్ర టీజర్ లాంచ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సీనియర్ నటుడు భానుచందర్, ప్రముఖ గాయని సునీత, నిర్మాత సీ కళ్యాణ్, నటుడు రఘుబాబు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గ్రామీణ నేపథ్యంలోని రొమాంటిక్ ప్రేమకథగా తెరకెక్కిన ఈ చిత్రంలో ప్రేమ, సస్పెన్స్, వినోదం సమపాళ్లలో ఉంటాయని చిత్ర యూనిట్ తెలిపింది. ఆకాష్, భైరవి బావ--మరదళ్ల పాత్రల్లో కనిపించనున్నారు. రఘుబాబు, పృథ్వీ, ప్రభావతి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. యశ్వంత్ సంగీతం అందించారు. దర్శకుడు శివ వరప్రసాద్ కేశనకుర్తి మాట్లాడుతూ, "రొమాంటిక్ లవ్ సస్పెన్స్ జానర్‌లో ఈ సినిమాను రూపొందించాం. ఆకాష్--భైరవి జోడీ చాలా బాగా కుదిరింది. కోనసీమ అందాలను తెరపై ఆవిష్కరిస్తూ, మంచి కామెడీతో కూడిన కథను ప్రేక్షకులకు అందిస్తున్నాం. జూన్ 12న సినిమా విడుదల కానుంది" అన్నారు. "ఆకాష్ ఎంతో కష్టపడే వ్యక్తి. మంచి స్థాయికి చేరుకోవాలని కోరుకుంటున్నాను. ఇది అతనికి రెండో సినిమా. దర్శకుడు శివ ప్రేక్షకులకు వినోదాన్ని పంచే కథను తీసుకొచ్చారు. మైత్రి సంస్థ ఈ చిత్రానికి అండగా నిలవడం గర్వకారణం" అని సునీత అన్నారు. సీనియర్ నటుడు భానుచందర్ మాట్లాడుతూ, "టీజర్ చాలా బాగుంది. హీరో, హీరోయిన్ ఇద్దరూ ఆకట్టుకున్నారు. ఈ చిన్న సినిమాను ప్రేక్షకులు పెద్ద విజయంగా నిలబెట్టాలి" అన్నారు. నిర్మాత తాటి బాలకృష్ణ మాట్లాడుతూ, "ఇది నాకు తొలి సినిమా. మా దర్శకుడికి తొలి చిత్రం. హీరోయిన్ కు తొలి సినిమా. హీరో ఆకాష్‌కు రెండో సినిమా. పూర్తిగా గ్రామీణ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి" అని తెలిపారు. హీరో ఆకాష్ మాట్లాడుతూ, "ఈ చిత్రానికి మంచి కథ అందించిన దర్శకుడికి కృతజ్ఞతలు. మైత్రి మూవీస్ వంటి సంస్థ మద్దతు ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉంది. మా అమ్మ సునీతతో పాటు చిత్ర యూనిట్ అందరికీ ధన్యవాదాలు" అన్నారు. హీరోయిన్ భైరవి అర్థ్యా మాట్లాడుతూ, "నా కెరీర్‌లో 'కొత్త మలుపు' చాలా ప్రత్యేకమైన చిత్రం. ప్రేమ, సస్పెన్స్, హాస్యం కలగలిపిన ఈ కథ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుంది. ఆకాష్‌తో నా జోడీ, బావ--మరదళ్ల పాత్రలు ప్రేక్షకులను తప్పకుండా అలరిస్తాయి" అని చెప్పారు.



# బోయపాటి శ్రీను, వెంకటేష్ కాంబోలో కొత్త సినిమా!

దర్శకుడు బోయపాటి శ్రీను, వెంకటేష్‌తో కలిసి కొత్త సినిమా చేయనున్నట్లు తెలుస్తోంది. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'తులసి' సినిమా సూపర్ హిట్ అయింది. ప్రస్తుతం వెంకటేష్ త్రివిక్రమ్, అనిల్ రావిపూడి దర్శకత్వంలో సినిమాలు చేస్తున్నారు. ఆ సినిమాలు పూర్తయిన తర్వాత బోయపాటితో సినిమాపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. బోయపాటి శ్రీను తన కెరీర్‌లో భారీ విజయాన్ని సాధించి, తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవాల్సిన అవసరం ఉంది.





## 'పెద్ది' కథ పడి లేచిన మనిషిది : బుచ్చిబాబు


దర్శకుడు బుచ్చిబాబు 'పెద్ది' గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇది కేవలం ఒక ఆటగాడి కథ కాదని, చుట్టూ ఉన్నవారిని మార్చే కథ అని తెలిపారు. అలాగే ఇది పడి లేచిన మనిషి కథ అంటూ పేర్కొన్నారు. ఈ సినిమా కోసం ఐదేళ్ల గ్యాప్ తీసుకున్నానని, రామ్ చరణ్ తన కథను ఎలాంటి మార్పులు లేకుండా అంగీకరించడం గొప్ప విషయమని ఎమోషనల్ అయ్యారు. సినిమా అవుట్‌పుట్‌పై నమ్మకం వ్యక్తం చేస్తూ, తాను 100 సార్లు చూసినా చివరి 40-50 నిమిషాలు ఎమోషనల్ అవుతానని చెప్పారు.

# దీపికాకు జాన్వీ స్ట్రాంగ్ కౌంటర్?

ఇసినిమా పరిశ్రమలో ప్రస్తుతం అత్యంత చర్చనీయమైన అంశాల్లో వర్క్ కల్చర్ ఒకటి. ముఖ్యంగా బాలీవుడ్, టాలీవుడ్ ఇండస్ట్రీల్లో పని గంటలు, షూటింగ్ విధానం, ఆర్టిస్టులపై ఉండే ఒత్తిడి వంటి అంశాలపై తరుచు చర్చ జరుగుతునే ఉంటుంది. అయితే, ఈ చర్చకు కేంద్రబిందువుగా నిలిచింది బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె. స్పిరిట్, కల్కి 2 వంటి భారీ ప్రాజెక్ట్‌ల నుంచి ఆమె తప్పుకున్నారనే వార్తలు వచ్చిన తర్వాత.. పని గంటల వివాదం ఇండస్ట్రీ మొత్తం చర్చనీయంగా మారుతుంది.దీపికా పదుకొణె రోజుకు పరిమిత గంటలే పని చేయాలనే నిబంధన పెట్టారని, షూటింగ్ షెడ్యూల్స్ విషయంలో కొన్ని అభిప్రాయ భేదాలు తలెత్తాయని అప్పట్లో ప్రచారం జరిగింది. ఆ తర్వాత సోషల్ మీడియాలో టాలీవుడ్ వర్క్ కల్చర్‌పై రకరకాల కథనాలు వెలువడ్డాయి. ముఖ్యంగా టాలీవుడ్ లో రోజుకు 12 నుంచి 14 గంటల పాటు షూటింగ్‌లు జరుగుతాయని, ఆర్టిస్టులపై భారీ ఒత్తిడి ఉంటుందని కొందరు వ్యాఖ్యానించారు. అయితే, ఈ వివాదంపై తాజాగా బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ చేసిన వ్యాఖ్యలు కొత్త మలుపు తిప్పాయి.'దేవర' సినిమాతో టాలీవుడ్‌లో అడుగుపెట్టిన జాన్వీ కపూర్, ప్రస్తుతం రామ్ చరణ్ సరసన 'పెద్ది' సినిమాలో నటిస్తోంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఆమె టాలీవుడ్‌లో తనకు ఎదురైన అనుభవాలను పంచుకుంది. తెలుగు సినిమా సెట్స్‌లో సమయపాలనకు చాలా ప్రాధాన్యత ఇస్తారని, పనిగంటలను చాలా క్రమబద్ధంగా ప్లాన్ చేస్తారని ఆమె వెల్లడించింది. నటీనటులతో పాటు టెక్నీషియన్ల సంక్షేమాన్ని కూడా ఇక్కడ ఎంతో గౌరవిస్తారని పేర్కొంది. జాన్వీ మాటల్లో చెప్పాలంటే.. టాలీవుడ్‌లో లంచ్ బ్రేక్ అనేది కేవలం పేరుకే ఉండదట. ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా భోజనం చేసి, కాసేపు విశ్రాంతి తీసుకునేలా ప్రత్యేక సమయం కేటాయిస్తారట. ఆ తర్వాత మళ్లీ షూటింగ్‌లో పాల్గొనడం వల్ల పనితీరు మరింత మెరుగ్గా ఉంటుందని ఆమె అభిప్రాయపడింది. అంతేకాకుండా దేవర, పెద్ది సినిమాల షూటింగ్ సమయంలో తాను రోజుకు 9 గంటలకు మించి ఎప్పుడూ పని చేయలేదని స్పష్టం చేసింది.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com

# విశ్వజి



## అవిసె గింజలతో ఎన్నో ప్రయోజనాలు- వీరు దూరంగా ఉండాల్సిందే.!!

ఆరోగ్యంగా ఉండాలంటే పోషకాలు అవసరం. పోషకాలు అందించటంలో అవిసె గింజలు ఎంత గానో ఉపకరిస్తాయి. అవిసె గింజలను రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే అనేక లాభాలు కలుగుతాయి. కాగా, వీటిని తీసుకోవటంలో మాత్రం పరిమితి అవసరం. కొన్ని ఆరోగ్య సమస్యలతో ఉన్నవారు వీటికి దూరంగా ఉంటేనే మంచిది. అయితే, అవిస గింజెలు ఎంత పరిమాణంలో తీసుకోవాలి..ఏ సమయంలో తీసుకోవాలనేది నిపుణులు సూచనలు చేస్తున్నారు. అవిస గింజలు అనేక రకాలుగా ఆరోగ్యానికి మేలు చేస్తాయి. అయితే ఈ గింజలను రోజుకు 2 టేబుల్ స్పూన్ల మోతాదులో లేదా 20 గ్రాముల వరకు తినవచ్చు. ఈ విత్తనాలను ఉదయం బ్రేక్ ఫాస్ట్ సమయంలో లేదా సాయంత్రం స్నాక్స్ రూపంలోనూ తినవచ్చు. ఇలా ఈ గింజలను తింటే అనేక లాభాలను పొందవచ్చు. అవిసె గింజలలో ఒమెగా3 ఫ్యాటీ యాసిడ్లు సమృద్ధిగా ఉంటాయి. ఆల్ఫా లినోలినిక్ యాసిడ్ కూడా అధికంగానే ఉంటుంది. ఇవి కొలెస్ట్రాల్ లెవల్స్‌ను తగ్గిస్తాయి. రక్త నాళాల వాపులను తగ్గిస్తాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ఈ గింజల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది చాలా నెమ్మదిగా జీర్ణం అవుతుంది. అందువల్ల షుగర్, కొలెస్ట్రాల్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. గింజల్లో ఉండే ఫైబర్ కారణంగా మలబద్ధకం తగ్గుతుంది. ఈ గింజల్లో ఫైబర్ అధికంగా ఉన్న కారణంగా వీటిని తింటే రక్తంలో చక్కెర స్థాయిలు నెమ్మదిగా పెరుగుతాయి. దీంతో షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. ముఖ్యంగా టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి మేలు జరుగుతుంది. అధిక బరువు తగ్గాలనుకుంటున్న వారు రోజూ అవిసె గింజలను తింటుంటే ఎంతగానో ఫలితం లభిస్తుంది. అవిసె గింజల్లో లిగ్నన్స్ అనబడే యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి క్యాన్సర్ కణాలను నాశనం చేస్తాయి. దీంతో క్యాన్సర్లు రాకుండా అడ్డుకోవచ్చు. అవిసె గింజలను అధికంగా తింటే మలబద్ధకం ఏర్పడే ప్రమాదం ఉంటుంది. కనీసం 6 నుంచి 8 గంటల పాటు నానబెట్టాల్సి ఉంటుంది. రక్తాన్ని పలుచగా చేసే మందులను వాడేవారు అవిసె గింజలను తినేముందు డాక్టర్‌ను సంప్రదించిన తరువాతనే వినియోగించాలి.




# ఆరోగ్యానికి ఆరు ఆపిల్స్



రోజుకు ఓ ఆపిల్ పండు తింటే డాక్టర్ అవసరం రాదని అంటారు. హిమాలయ పర్వత రాష్ట్రాలైన హిమాచల్ ప్రదేశ్, కశ్మీర్ మనదేశంలో ఆపిల్ పంటకు ప్రసిద్ధి. ప్రస్తుతం ఎన్నో రకాల ఆపిల్ పండ్లు సాగవుతున్నాయి. వాటిలో ఆరు రకాలు బాగా ప్రాచుర్యంలో ఉన్నాయి. తియ్యగా, పుల్లగా ఉండే ఆపిల్ పండ్లు విటమిన్లు, ఫైబర్, ఇతర పోషకాలకు గనులు. పండుగానే కాకుండా సలాడ్లలో, డెజర్ట్‌గానూ వీటిని తినొచ్చు. సిమ్లా ఆపిల్.. ఆకట్టుకునే రంగుతో తియ్యగా, రసభరితంగా నోరూరించే సిమ్లా ఆపిల్ అంటే మనసు పారేసుకోని వారుండరు. హిమాచల్ ప్రదేశ్‌లోని హిమాలయ పర్వత సానువుల్లో సముద్ర మట్టానికి ఆరువేల అడుగుల ఎత్తులో ఈ చెట్లు పెరుగుతాయి. సిమ్లా ఆపిల్‌లో విటమిన్లు ముఖ్యంగా విటమిన్ సి, ఫైబర్, యాంటి ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. అరుగుదలకు సహాయకారిగా ఉంటాయి. జలుబు, ఇన్ఫెక్షన్లతో పోరాటానికి తగినన్ని యాంటి ఆక్సిడెంట్లను శరీరానికి ఇస్తాయి. సిమ్లా ఆపిల్ ముక్కలను వాల్‌నట్స్‌తో మేళవించి, తేనె చల్లుకుని సలాడ్‌గా ఆరగిస్తే మంచిది. కశ్మీర్ ఆపిల్.. అందాల కశ్మీర్ లోయ ఈ రకం ఆపిల్స్‌కు ప్రసిద్ధి. తియ్యగా, రసభరితంగా ఉండే కశ్మీర్ ఆపిల్స్ ఇతర రకాలతో పోలిస్తే లేత ఎరుపు రంగులో ఉంటాయి. తక్కువ కొలెస్ట్రాల్ ఉంటుంది కాబట్టి, గుండె ఆరోగ్యానికి మంచివి. అంతేకాదు, ఊపిరితిత్తుల పనితీరును మెరుగుపరుస్తాయి. రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. చర్మం, వెంట్రుకలకు కూడా ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాయి. యాలకులు, దాల్చినచెక్కను మేళవించి మన రుచికి తగినవిధంగా కశ్మీర్ యాపిల్‌తో పచ్చడి చేసుకోవచ్చు. రాయల్ గాలా ఆపిల్.. లేత ఎరుపు, ఎరుపు, గులాబీ రంగుల్లో ఉంటాయి. కరకరలాడుతూ నోట్లో రసాలూరిస్తూ తియ్యగా ఉంటాయి. ఇవి కశ్మీర్‌లో పండుతాయి. పొటాషియం సమృద్ధిగా ఉంటుంది. దీంతో రక్తపోటు (బీపీ) ఆరోగ్యకరమైన స్థాయిలో ఉంటుంది. భోజనం తర్వాత డెజర్ట్‌తో రాయల్ గాలా ఆపిల్ తింటే కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఎన్నో.

ఇండియన్ గ్రానీ ఆపిల్.. హిమాచల్ ప్రదేశ్, కశ్మీర్ రాష్ట్రాల్లో ఇవి పండుతాయి. ఆకుపచ్చ రంగులో కరకుగా రసభరితంగా ఉండే ఇండియన్ గ్రానీ ఆపిల్స్ రుచికి పుల్లగా ఉంటాయి. విటమిన్ సి, ఫైబర్, పొటాషియం, ఇతర విటమిన్లు సమృద్ధిగా ఉంటాయి. గుండెపోటు, పక్షవాతం ముప్పును తగ్గిస్తాయి. కడుపు నిండిన అనుభూతిని ఇస్తాయి. అలా బరువు తగ్గడానికి దోహదం చేస్తాయి. గోల్డెన్ డెలిషస్ ఆపిల్.. కశ్మీర్‌లో పండిస్తారు. బంగారు పసుపు రంగులో రసభరితంగా, చాలా తియ్యగా ఉంటాయి. ఇవి శరీరంలో సూక్ష్మక్రిములకు వ్యతిరేకంగా పోరాడే శక్తిని ఇస్తాయి. జీవక్రియలకు తగిన శక్తిని ప్రసాదిస్తాయి. రక్తంలో చక్కెర స్థాయులను నియంత్రిస్తాయి. శరీరంలో కలుషిత పదార్థాలను బయటికి (డిటాక్సిఫై) పంపిస్తాయి. రోగనిరోధక శక్తిని పెంచుతాయి. అలా శరీరానికి ఆరోగ్యాన్ని చేకూరుస్తాయి. గోల్డెన్ డెలిషస్ ఆపిల్ పై తింటే శరీరానికి మంచి పోషకాలు అందుతాయి. కిన్నౌర్ ఆపిల్ హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలో కిన్నౌర్ జిల్లాలో పండుతాయి. హిమాలయా పర్వత సానువుల్లో దాదాపు 7 వేల అడుగుల ఎత్తులో రైతులు వీటిని సాగుచేస్తుంటారు. ముదురు ఎరుపు రంగులో నోరూరించే కిన్నౌర్ ఆపిల్స్ తింటే కరకరలాడుతాయి. విటమిన్ సి, ఫైబర్, యాంటి ఆక్సిడెంట్లు పుష్కలం. ఇవి అరుగుదలకు, రోగ నిరోధక శక్తి పెరగడానికి దోహదం చేస్తాయి. బరువు తగ్గడానికి, నోటి ఆరోగ్యానికి మేలుచేస్తాయి. కిన్నౌర్ ఆపిల్‌ను దోరగా కాల్చుకుని తింటూ చలికాలం సాయంత్రాల్లో ఆహ్లాదాన్ని అనుభూతి చెందవచ్చు.

# ప్రొటీన్ లోపం సంకేతాలు, నిర్లక్ష్యం చేస్తే డేంజర్





ప్రొటీన్ అనేది శరీరానికి ఎంతో అవసరం. హార్మోన్లు, ఎంజైమ్‌లు, రోగనిరోధక కణాలు, రవాణా ప్రొటీన్ల ఉత్పత్తిలో ప్రొటీన్ కీలకపాత్ర పోషిస్తుంది. రోజువారీ ఆహారంలో మనం తగినంత ప్రొటీన్ తీసుకోనప్పుడు మన శరీరం వివిధ రకాల ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటుంది. ప్రొటీన్ లోపం సంకేతాలను శరీరం ఎప్పటికి అప్పుడు ఇస్తుంది. అప్రమత్తం కాకుంటే ఆరోగ్య పరంగా అనేక ఇబ్బందులు ఖాయమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రొటీన్ లోపం బారిన పడకుండా పలు సూచనలు అందిస్తున్నారు. ప్రొటీన్ లోపం ఉన్నప్పుడు ముందుగా కండరాల బలహీనత మొదలవుతుంది. కండరాల బలం తగ్గి.. బలహీనత, అలసట, రోజువారీ పనులు చేయడంలో ఇబ్బంది లాంటి సమస్యలు కలుగుతాయి. వ్యాయామం చేసినా కండరాలు పెరగకపోవడాన్ని, క్షీణించడాన్ని గమనించవచ్చు. అదే విధంగా రోగనిరోధక వ్యవస్థలోని కణాలు, ముఖ్యంగా యాంటీబాడీస్ ప్రొటీన్‌తో తయారు కావటంతో.. ప్రొటీన్ లోపం రోగనిరోధక శక్తిని తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. దానివల్ల శరీరం ఇన్ఫెక్షన్లు, జలుబు, ఫ్లూ తదితర వ్యాధులకు గురవుతుంది. జుట్టు ప్రధానంగా ప్రొటీన్ (కెరాటిన్) తో తయారవుతుంది. ప్రొటీన్ లోపంవల్ల జుట్టు సన్నబడటం, పొడిబారడం, బలహీనపడటం, విపరీతంగా రాలిపోవడం లాంటి సమస్యలు వస్తాయి. ప్రొటీన్ లోపం చర్మ సమస్యలకు కూడా దారితీస్తుంది. చర్మం పొడిగా, పొలుసులుగా మారుతుంది. అదేవిధంగా చర్మంపై పగుళ్లు కూడా వచ్చే ప్రమాదం ఉంది. వీటితో పాటుగా చేతుల, కాళ్ల గోర్ల ఆరోగ్యానికి కూడా ప్రొటీన్ దోహదపడుతుంది. ప్రొటీన్ లోపంవల్ల గోర్లు పెలుసుగా మారడం, సులభంగా విరిగిపోవడం, గోర్లపై గీతలు ఏర్పడటం లాంటి సమస్యలు వస్తాయి. ఎడీమా శరీరంలో ద్రవ సమతుల్యత లోపంవల్ల వస్తుంది. ప్రొటీన్‌లు రక్తంలో ప్లాస్మా ఆంకోటిక్ పీడనాన్ని నిర్వహించడంలో సాయపడతాయి. ఈ పీడనం రక్తనాళాల నుంచి కణ జాలంలోకి ద్రవం లీక్ అవ్వకుండా నిరోధిస్తుంది. ప్రొటీన్ లోపంవల్ల ఈ పీడనం తగ్గుతుంది. ప్రొటీన్ ఎముకల ఆరోగ్యంలో కూడా కీలకపాత్ర పోషిస్తుంది. హిమోగ్లోబిన్ ఉత్పత్తికి తోడ్పడుతుంది. ప్రొటీన్ లోపంవల్ల రక్తహీనత ఏర్పడి తీవ్రమైన అలసట, బలహీనత, తల తిరగడం లాంటి సమస్యలు సంభవిస్తాయి. ఒక సాధారణ ఆరోగ్యవంతుడైన వ్యక్తికి ప్రతి కిలో శరీర బరువుకు 0.8 గ్రాముల ప్రొటీన్ అవసరం. మాంసం, చేపలు, గుడ్లు, పాలు, పెరుగు, చీజ్, పప్పులు, బీన్స్, చిక్కుళ్ళు, కాయధాన్యాలు, గింజలు లాంటి వాటిలో ప్రొటీన్ పుష్కలంగా ఉంటుంది.

# మార్కెట్

## ఆర్బీఐ ద్రవ్యసమీక్షపై ఆధారం!.. ఆర్థిక ఫలితాలు, ట్రంప్ సుంకాలూ కీలకమే

దేశీయ స్టాక్ మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడి కొనసాగుతున్నది. మదుపరులు లాభాల స్వీకరణకు పెద్దపీట వేస్తున్నారు. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 863.18 పాయింట్లు లేదా 1.05 శాతం పతనమై 80,599.91 వద్ద ముగిసింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 271.65 పాయింట్లు లేదా 1.09 శాతం క్షీణించి 24,565.35 దగ్గర నిలిచింది. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి త్రైమాసికానికి (ఏప్రిల్-జూన్)గాను ఆయా కంపెనీలు ప్రకటించే ఆర్థిక ఫలితాలు ఈ వారం మార్కెట్ కదలికలకు దిక్సూచి అంటున్నారు.




# చాలాకాలం తర్వాత స్వల్పంగా బలపడ్డ రూపాయి



అమెరికన్ డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ సోమవారం స్వల్పంగా బలపడింది. కొంతకాలంగా క్షీణిస్తూ వస్తున్న రూపాయికి ఇది కాస్త ఊరటగా చెప్పవచ్చు. ఇవాళ ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ 87.36 రూపాయల వద్ద స్థిరపడింది. దాంతో ఈ ఏడాదిలో నమోదైన గరిష్ఠ పతనం నుంచి రూపాయి కాస్త కోలుకున్నట్లయ్యింది. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ అత్యంత కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ఆ సమయంలో ఒక డాలర్‌కు రూ.88.10 వరకు చెల్లించాల్సి వచ్చింది. దాంతో పోలిస్తే ఇవాల్టి 87.36 రూపాయలు కొంత సానుకూలమని చెప్పవచ్చు. అయితే ఈ మధ్యకాలంలో రూపాయి తీవ్ర ఒడిదొడుకులను ఎదుర్కొంటోంది. గడిచిన ఏడాది కాలంలో రూపాయి విలువ 4.06 శాతం బలహీనపడగా.. గత నెల రోజుల్లోనే 1.77 శాతం పతనమైంది. ఈ ఏడాది జనవరి నుంచి చూసినప్పుడు డాలర్‌పై రూపాయి విలువ సుమారు 1.82 శాతం మేర నష్టపోయింది. దేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన గణాంకాలు, రిజర్వ్ బ్యాంక్ చర్యలు, లేదా ప్రపంచ మార్కెట్లలోని సానుకూల సెంటిమెంట్ లాంటి కారణాలవల్ల రూపాయికి డిమాండ్ పెరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. అయితే ఈ పురోగతి తాత్కాలికమే కావచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ త్రైమాసికం చివరి నాటికి డాలర్‌తో రూపాయి మారకం విలువ తిరిగి 87.52 రూపాయలకు చేరే అవకాశం ఉంది. రాబోయే 12 నెలల్లో కూడా రూపాయి మారకం విలువ స్వల్పంగా క్షీణించవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఆర్థిక వ్యవస్థలో స్థిరమైన మెరుగుదల ఉంటేనే రూపాయి విలువ దీర్ఘకాలంలో నిలదొక్కుకుంటుందని నిపుణులు చెబుతున్నారు.




## ఎస్బీఐ కార్డ్, ఫోన్‌పే కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డులు.. వీటిని ట్రై చేశారా?

ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ అనుబంధ సంస్థ ఎస్బీఐ కార్డ్, ప్రముఖ డిజిటల్ పేమెంట్స్ యాప్ ఫోన్‌పే కలిసి కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డులను తీసుకొచ్చాయి. సెలెక్ట్ బ్లాక్, పర్పుల్ పేరిట రెండు వేరియంట్లలో ఇవి పరిచయమయ్యాయి. ఇవి రూపే, వీసా నెట్‌వర్క్‌లపై పనిచేస్తాయి. రూపే వెర్షన్‌ను యూపీఐకి లింక్ చేసుకోవచ్చు. ఫోన్‌పే ఈ-గిఫ్ట్ వోచర్లుగా సెలెక్ట్ బ్లాక్‌పై రూ.1,500, పర్పుల్‌పై రూ.500 అందుకోవచ్చు. అంతేగాక బ్లాక్ కార్డు వినియోగదారులు ఏటా చేసే ఖర్చులు రూ.5 లక్షలుగా ఉంటే రూ.5 వేల ట్రావెల్ వోచర్, పర్పుల్ కార్డుదారులు ఏటా ఖర్చు రూ.3 లక్షలుగా ఉంటే రూ.3 వేల ట్రావెల్ వోచర్ పొందవచ్చు. ఫోన్‌పే యాప్ ద్వారా ఈ కార్డుల కోసం దరఖాస్తు చేసుకొనే వీలున్నది. బిల్లులనూ నేరుగా చెల్లించవచ్చు. కస్టమర్లకు ప్రతిరోజూ చేసే కిరాణా, ట్రావెల్ బుకింగ్స్, బీమా ప్రీమియంలు తదితర ఖర్చులపై రివార్డు పాయింట్లూ వస్తాయి. సెలెక్ట్ బ్లాక్ కార్డ్ ద్వారా ఫోన్‌పే యాప్‌పై కొనుగోలు లావాదేవీలు జరిపినప్పుడు 10 శాతం వరకు వాల్యూ బ్యాక్ ఆఫర్ అందుకోవచ్చు.